తెలుగు దినపత్రిక

# సాక్షర

చదువు..సమీక్షించు

RNI NO.APTEL/2011/42149



## తీన్మార్ మల్లన్న వాహనాన్ని ఢీకొట్టిన లారీ..

(యాదాద్రి భువనగిరి, సాక్షర): మోత్కూరు మండలం అనాజిపురం గ్రామం వద్ద తీన్మార్ మల్లన్న పాదయాత్రలో శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. మోత్కూరు నుంచి అనాజిపురం మీదుగా తిరుమలగిరి వైపు పాదయాత్ర సాగుత...

3వ పేజీ




## నా ఫోన్ ను ట్యాప్ చేయిస్తున్నారు : రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ :ప్రధాని నరేంద్ర మోడి తన మొబైల్‌ను ట్యాప్ చేయిస్తున్నారని.. దీనికి సంబంధించి తన వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఇన్‌స్టాగ్రామ్ వేదికగా శుక్రవారం నిర్వహించిన 'ఆస్క్ మి' కార...

2వ పేజీ

ఆదిలాబాద్ | సంపుటి : 16 సంచిక : 281 శనివారం, నవంబర్ 14, 2026 ఎడిటర్: ఎ. లింగన్న | పేజీలు : 10 రూ. 2.00

# క్రిటికల్ మినరల్స్ వేటలో భారత్ దూకుడు..!




(ముంబై, సాక్షర): క్రిటికల్ మినరల్స్.. ఇప్పుడివే ఓ దేశం అభివృద్ధిని , సైనిక సామర్థ్యానికి కొలమానమని చెప్పొచ్చు. ఎందుకంటే.. ఇవి ఎవరి గుప్పిట్లో ఉంటాయో వారిదే రాజ్యం. అందుకే.. వీటికోసం అమెరికా, చైనా పోటీ పడుతున్నాయి. ముఖ్యంగా అమెరికా అయితే.. వీటికోసం సైనిక ఘర్షణలు, చిన్నపాటి యుద్ధాలకు తెరతీస్తోంది. ఇక చైనా అయితే దశాబ్దం క్రితమే వీటి అవసరాన్ని గుర్తించి.. ఏకంగా పలుదేశాల్లో మైనింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. అయితే లేటెస్టుగా ఈరంగంలోకి భారత్ సైతం ఎంటరైంది.భవిష్యత్ అవసరాలకు కీలకమైన ఖనిజాల సేకరణలో భారత్ అత్యంత చురుగ్గా వ్యవహరిస్తోంది. 2025 జనవరి నుంచి ఇప్పటివరకు భారత్ మొత్తం 15 క్రిటికల్ మినరల్స్ ఒప్పందాలపై సంతకాలు చేసి గ్లోబల్ రేసులో అగ్రగామిగా నిలిచింది. క్లైమేట్ యాక్షన్ లైవ్ విడుదల చేసిన తాజా నివేదిక ప్రకారం, అంతర్జాతీయంగా కీలక ఖనిజ వనరులను చేజిక్కించుకోవడంలో భారత్ ప్రపంచంలోనే రెండో స్థానాన్ని దక్కించుకుంది.ఈ జాబితాలో 41 ఒప్పందాలతో అమెరికా మొదటి స్థానంలో ఉండగా, ఆ తర్వాత స్థానాన్ని భారత్ కైవసం చేసుకుంది. 11 ఒప్పందాలు మాత్రమే చేసుకున్న చైనా, కెనడా, సౌదీ అరేబియా, యూరోపియన్ యూనియన్ వంటి ప్రధాన దేశాలను భారత్ వెనక్కి నెట్టింది.

మిగతా 2 లో

# రాహుల్ గాంధీ హైదరాబాద్ పర్యటనపై కేటీఆర్ ఫైర్..



- రూ.100 కోట్ల ఖర్చుపై ప్రశ్నలు

(హైదరాబాద్, సాక్షర): ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ హైదరాబాద్ పర్యటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ విమర్శలు గుప్పించారు. 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. రాహుల్‌కు పలు ప్రశ్నలు సంధించారు. ఉద్యోగాలిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్.. ఉద్యోగాల కోసం పోరాడుతున్న నిరుద్యోగులపై దాడులు చేయించినప్పుడు రాహుల్ ఎక్కడున్నారని నిలదీశారు. మహిళా ప్రజాప్రతినిధుల చీరలు లాగి, అసెంబ్లీ ఎదుటే దాడులు చేసినప్పుడు, రైతుల ఆత్మహత్యలు, చేనేత కార్మికుల బలవన్మరణాలపై మాట్లాడేందుకు సమయం లేదా అంటూ రాహుల్‌పై విరుచుకుపడ్డారు. కేటీఆర్ పోస్ట్..: 'ఉద్యోగాలిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఉద్యోగాల కోసం పోరాడుతున్న నిరుద్యోగ విద్యార్థులను పోలీసులతో గొంతు నులిమి, దాడులు చేయించినప్పుడు మీరు ఎక్కడున్నారు రాహుల్ గాంధీ? లగచర్లలో గిరిజన మహిళలను వారి భూముల కోసం పోరాడుతున్నందుకు కొట్టినప్పుడు, దుస్తులు చింపి అవమానించినప్పుడు మీకు చలనం కలగలేదా? హైడ్రా బుల్డోజర్లతో కష్టపడి జీవిస్తున్న తెలంగాణ ప్రజల ఇళ్లను కూల్చివేస్తున్నప్పుడు మీరు ఢిల్లీలో నిద్రపోతున్నారా? కంచ గచ్చిబౌలి హెచ్‌సీయూ భూముల్లో రాత్రికి రాత్రే 10 వేలకు పైగా చెట్లను నరికివేసి, జింకలు, నెమళ్లు సహా విలువైన జీవవైవిధ్యాన్ని ధ్వంసం చేసినప్పుడు.. కేటీఆర్ పార్కును నాశనం చేస్తున్నప్పుడు మీ గొంతు ఎందుకు పెగల్లేదు?

3 లో

## ప్రపంచవ్యాప్తంగా నిలిచిపోయిన మైక్రోసాఫ్ట్ సేవలు..




టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ సేవలకు ప్రపంచవ్యాప్తంగా తీవ్ర అంతరాయం కలిగింది. ముఖ్యంగా ఈమెయిల్ సర్వీస్ అయిన ఔట్‌లుక్‌తో పాటు టీమ్స్ యాప్‌లో సమస్యలు తలెత్తడంతో లక్షలాది మంది యూజర్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గంటల తరబడి ఈమెయిళ్లు పంపడం, స్వీకరించడం సాధ్యపడలేదని, ఇన్‌బాక్స్‌లు లోడ్ కాలేదని అనేకమంది ఫిర్యాదు చేశారు. ఔటేజ్ ట్రాకర్ అయిన డౌన్‌డెటెక్టర్ ప్రకారం, గురువారం ఒక్కసారిగా సుమారు 1.30 లక్షల మంది యూజర్లు ఔట్‌లుక్‌లో సమస్యలు ఉన్నట్లు రిపోర్ట్ చేశారు. కేవలం ఔట్‌లుక్ మాత్రమే కాకుండా, మైక్రోసాఫ్ట్ వర్క్‌ప్లేస్ మెసేజింగ్ యాప్ 'టీమ్స్', ఏఐ అసిస్టెంట్ 'కో-పైలట్', మైక్రోసాఫ్ట్ 365 సూట్‌లోని ఇతర సేవల్లోనూ అంతరాయం ఏర్పడినట్లు వేలాది మంది ఫిర్యాదు చేశారు.

పూర్తిగా 3 లో

## అమెరికాలో రికార్డు స్థాయిలో బహిష్కరణలు..




అమెరికాలో వలసదారులపై ట్రంప్ ప్రభుత్వం అనుసరిస్తున్న కఠిన వైఖరి మరోసారి స్పష్టమైంది. 2026 ఆర్థిక సంవత్సరంలో 'ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్' (ఐసీఈ) ఏజెన్సీ చరిత్రలోనే అత్యధిక స్థాయిలో వలసదారులను దేశం నుంచి బహిష్కరించడంతో పాటు అరెస్టులు కూడా చేపట్టింది. ఈ మేరకు యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ అధికారికంగా గణాంకాలను విడుదల చేసింది. హోంల్యాండ్ సెక్యూరిటీ వివరాల ప్రకారం.. 2026 ఆర్థిక సంవత్సరంలో ఏకంగా 4,83,200 మందిని దేశం నుంచి బహిష్కరించారు. 'ఐస్' ఏజెన్సీ 23 ఏళ్ల చరిత్రలో ఇదే అత్యధికం. గత ఏడాది నమోదైన 4,42,640 బహిష్కరణల రికార్డును ఇది అధిగమించింది.

పూర్తిగా 2 లో

## అమెరికాలో ఇళ్ల అమ్మకాలు డౌన్.. 16 ఏళ్ల కనిష్టానికి విక్రయాలు.. ధరలు




అమెరికాలో గృహ విక్రయ రంగం తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటోంది. మార్ట్‌గేజ్ వడ్డీ రేట్లు రికార్డు స్థాయిలో పెరగడంతో ఇళ్ల అమ్మకాలు గత 16 ఏళ్లలో ఎన్నడూ లేనంత కనిష్ట స్థాయికి పడిపోయాయి. అయితే, అమ్మకాలు భారీగా తగ్గినప్పటికీ, ఇళ్ల ధరలు మాత్రం పైపైకే వెళ్తుండటం గమనార్హం. ఈ వింత పరిస్థితి కొనుగోలుదారులను తీవ్ర గందరగోళానికి గురిచేస్తోంది. నేషనల్ అసోసియేషన్ ఆఫ్ రియల్టర్స్ (ఎన్ఏఆర్) గురువారం విడుదల చేసిన నివేదిక ప్రకారం.. అక్టోబర్‌లో పాత ఇళ్ల అమ్మకాలు సెప్టెంబర్‌తో పోలిస్తే 5.5% తగ్గి, వార్షిక రేటు 3.75 మిలియన్లకు పడిపోయాయి. గత ఏడాది అక్టోబర్‌తో పోలిస్తే ఇది 8.8% తక్కువ. 2010 ఆగస్టు తర్వాత ఇదే అత్యంత తక్కువ అమ్మకాల రేటు కావడం గమనార్హం.

పూర్తిగా 4 లో

## రెండేళ్లలో భారత్‌లోనే సొంతంగా విమానాల తయారీ: రామ్మోహన్




2036 నాటికి మరో 100 విమానాశ్రయాలు 200 ఆధునిక హెలిపోర్టులు నిర్మిస్తామన్న రామ్మోహన్ నాయుడు ఉడాన్ రెండో దశ మౌలిక వసతుల కోసం రూ. 30 వేల కోట్ల కేటాయింపు - ఏరోస్పేస్ రంగంలో పెట్టుబడులకు ముందుకు రావాలని పారిశ్రామికవేత్తలకు పిలుపు విశాఖపట్నం: విశాఖపట్నంలో నిర్వహిస్తున్న 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సులో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కీలక విషయాలను వెల్లడించారు. 'భారత విమాన రంగం- అనుసంధానం' అంశంపై ఆయన ప్రసంగిస్తూ... ఆత్మనిర్భర్ భారత్ కింద రాబోయే రెండేళ్లలో భారతదేశం సొంతంగా పౌర విమానాన్ని తయారు చేసి ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

పూర్తిగా 3 లో

## డిసెంబర్ వరకే హైదరాబాద్‌కు నీళ్లు..



- ఆ తర్వాత తీవ్ర కొరత తప్పదా?

(హైదరాబాద్, సాక్షర): హైదరాబాద్ మహానగరాన్ని మంచినీటి కొరత ముప్పు వెంటాడుతోంది. నగరానికి నీటిని అందించే సింగూరు, మంజీరా జలాశయాల్లో ప్రస్తుతం ఉన్న నిల్వలు మరో 42 రోజులకు మాత్రమే సరిపోనున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే డిసెంబర్ తర్వాత నగరంలోని పలు ప్రాంతాలకు నీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. సింగూరు, మంజీరా జలాశయాల నుంచి నీటి సరఫరా జరిగే ప్రాంతాలపై కొరత ప్రభావం పడే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. శేరిలింగంపల్లి, పటాన్‌చెరు, జూబ్లీహిల్స్, కూకట్‌పల్లి, సనత్‌నగర్, రాజేంద్రనగర్, ఖైరతాబాద్ నియోజకవర్గాల్లో నీటి సరఫరా కష్టతరంగా మారవచ్చని భావిస్తున్నారు. వీటిలో ముఖ్యంగా శేరిలింగంపల్లి నియోజకవర్గంపై ప్రభావం ఎక్కువగా ఉండొచ్చని హెచ్చరికలు వెలువడుతున్నాయి.

4 లో

## భారత్ సమ్మిట్-2026




- ఫోటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి సీతక్క

(హైదరాబాద్, సాక్షర): హైదరాబాద్‌లో జరుగుతున్న భారత్ సమ్మిట్ 2026లో భాగంగా భారత్‌కు వివిధ దేశాలతో ఉన్న చారిత్రక సంబంధాలు, గతంలో భారత ప్రధానులు ఇతర దేశాలతో నెలకొల్పిన స్నేహపూర్వక సంబంధాలు, దౌత్యపరమైన అనుబంధాలను ప్రతిబింబించేలా ఏర్పాటు చేసిన ప్రత్యేక ఫోటో ఎగ్జిబిషన్‌ను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క,మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో భారత ప్రధానులు వివిధ దేశాలతో కొనసాగించిన సత్సంబంధాలు, అంతర్జాతీయ స్థాయిలో భారత్ సాధించిన దౌత్యపరమైన పురోగతిని తెలియజేసే ఫోటోలను వారు ఆసక్తిగా పరిశీలించారు.

2 లో

## ఉత్తర తెలంగాణలో పట్టు సాధించేది ఎలా ?





(కరీంనగర్, సాక్షర): తెలంగాణ రాజకీయాల్లో ఒకప్పుడు తిరుగులేని ఆధిపత్యం చలాయించిన బీఆర్ఎస్, వరుస ఎన్నికల పరాజయాల తర్వాత డీలా పడింది. ఇప్పుడు తన పూర్వ వైభవాన్ని తిరిగి పొందేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. ముఖ్యంగా పార్టీకి కంచుకోటలుగా ఉన్న ఉత్తర తెలంగాణ జిల్లాలపై బీఆర్ఎస్ అధిష్ఠానం ప్రత్యేక దృష్టి సారించింది. 2004 నుంచి పార్టీకి బలమైన పునాదిగా ఉన్న ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో కోల్పోయిన పట్టును తిరిగి సాధించడం ఇప్పుడు బీఆర్ఎస్ ముందున్న అతిపెద్ద సవాలు.పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్వయంగా ఈ పునరుజ్జీవ కార్యక్రమాలకు నాయకత్వం వహిస్తున్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఎదురైన చేదు అనుభవాలను సమీక్షించుకున్న తర్వాత, క్షేత్రస్థాయిలో పార్టీ క్యాడర్‌ను తిరిగి ఉత్తేజపరిచేందుకు ఒక నెల రోజుల పాటు వరుస బహిరంగ సభలు, సమావేశాలకు ప్రణాళిక రూపొందించారు.

4 లో

## సంపాదకీయం

# కాంగ్రెస్ కు బీలాంగింగ్ వరమా... శాపమా...




కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ రాసిన ఆత్మకథ ఃబిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్ఃవిడుదలైనప్పటి నుండి భారత రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇందులో ఆమె ప్రస్తావించిన పలు కీలక చారిత్రక అంశాలను ఆయుధంగా చేసుకుని భారతీయ జనతా పార్టీ కాంగ్రెస్‌పై ఎదురుదాడికి దిగుతోంది. ముఖ్యంగా రాబోయే ఉత్తరప్రదేశ్, పంజాబ& అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఈ పుస్తకంలోని అంశాలు బీజేపీకి రాజకీయంగా కలిసొచ్చే అస్త్రాలుగా మారాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

బీజేపీకి అస్త్రాలుగా మారిన ప్రధాన అంశాలు

• ఎమర్జెన్సీ ప్రస్తావన. 1975లో ఇందిరా గాంధీ విధించిన ఎమర్జెన్సీ ఒక పొరపాటు అని, తర్వాత ఇందిర కూడా అదే అభిప్రాయానికి వచ్చారని సోనియా ఈ పుస్తకంలో పేర్కొన్నారు. దీనిపై బీజేపీ స్పందిస్తూ, నెహ్రూ-గాంధీ కుటుంబం చేసిన చారిత్రక తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకే ఆమె ప్రయత్నిస్తున్నారని, ఈ పుస్తకానికి ఃబిలాంగింగ్ఃబదులు ఃవైట్‌వాషింగ్ఃఅని పేరు పెట్టి ఉండాల్సిందని బీజేపీ అధికార ప్రతినిధి సి.ఆర్. కేశవన్ విమర్శించారు.

1984 సిక్కు వ్యతిరేక అల్లర్లు. ఈ పుస్తకంలో 1984 నాటి సిక్కు వ్యతిరేక అల్లర్లపై తన కుటుంబానికి క్లీన్ చిట్ ఇచ్చుకునే ప్రయత్నం జరిగిందని బీజేపీ ఆరోపిస్తోంది. పంజాబ& ఎన్నికల ముంగిట ఈ అంశం కాంగ్రెస్‌కు ఇబ్బందికరంగా, బీజేపీకి అనుకూలంగా మారే అవకాశం ఉంది.

ముందు తన పిల్లలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాతో ఈ విషయంపై చర్చించినట్లు సోనియా వెల్లడించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తాను ప్రధానమంత్రి పదవి చేపట్టాలా? అని వారిని అడిగినప్పుడు ఇద్దరూ స్పష్టంగా వద్దని చెప్పారని రాశారు. ఇందిరా గాంధీ హత్య, రాజీవ్ గాంధీ హత్యను ప్రత్యక్షంగా చూసిన తమకు, తల్లి కూడా ప్రధానమంత్రి అయితే కుటుంబానికి ముప్పు పెరుగుతుందనే భయం ఉండేదని ఆమె వివరించారు. తాను ప్రధాని కావడం లేదని చెప్పినప్పుడు పిల్లలు ఎంతో ఉపశమనం పొందారని గుర్తుచేసుకున్నారు.2004 ఎన్నికల ఫలితాల తర్వాత ప్రధానమంత్రి పదవిని స్వీకరించాలా? వద్దా? అనే విషయంలో తాను తీవ్ర మానసిక సంఘర్షణకు గురయ్యానని సోనియా గాంధీ రాశారు. ఒకవైపు కాంగ్రెస్ కార్యకర్తల ఆశలు, ప్రజల నమ్మకం, మరోవైపు తన వ్యక్తిగత భయాలు, కుటుంబ భద్రత వంటి అంశాలు తనను ఆలోచనలో పడేశాయని తెలిపారు. చివరకు ప్రధానమంత్రి పదవిని తిరస్కరించాలని నిర్ణయించుకున్న రాత్రి తన మనసులోని సందేహాలన్నీ తొలగిపోయాయని పేర్కొన్నారు. తన అంతరాత్మ నుంచి 'సోనియా.. నీకు నువ్వు నిజాయితీగా ఉండు. ఈ విషయం నీకు ఎప్పటినుంచో తెలుసు. దాన్ని వదిలేయ్!' అనే భావన కలిగిందని పుస్తకంలో వివరించారు.తన నివాసంలో కాంగ్రెస్, సంకీర్ణ పార్టీల నేతలు ప్రధానమంత్రి పదవిని స్వీకరించాలని కోరిన సమావేశాన్ని కూడా ఆమె గుర్తుచేసుకున్నారు. ఆ సమయంలో రాహుల్ గాంధీ తనను 'మీరు ప్రధానమంత్రి కావడానికి ఎందుకు అంగీకరించారు?' అని ప్రశ్నించారని తెలిపారు. నాయకులు తన మాట వినడం లేదని, ఒత్తిడి చేస్తున్నారని తాను సమాధానమిచ్చినట్లు రాశారు. మరోవైపు ప్రియాంక గాంధీ కూడా తన నిర్ణయానికి కట్టుబడి ఉండాలని సూచించారని, ఆ సమయంలో ఆమె భావోద్వేగానికి గురయ్యారని వెల్లడించారు.తాను ప్రధానమంత్రి అయితే బీజేపీ, దాని మిత్రపక్షాలు తన విదేశీ మూలాన్ని రాజకీయ అస్త్రంగా ఉపయోగించుకునే అవకాశం ఉందని సోనియా భావించారు. దీనివల్ల దేశంలో రాజకీయ వివాదం పెరిగి, ప్రభుత్వం పనితీరు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రభావం పడుతుందని ఆందోళన చెందారు. తనకు ప్రధానమంత్రి పదవి కంటే దేశంలో స్థిరమైన, సమర్థవంతమైన, లౌకిక ప్రభుత్వం ఏర్పడటమే ముఖ్యమని పేర్కొన్నారు.2004లో పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో కాంగ్రెస్ నేతల సమావేశంలో తాను ప్రధానమంత్రి పదవిని చేపట్టబోనని ప్రకటించినప్పుడు పలువురు నాయకులు నిరసన వ్యక్తం చేశారని సోనియా గుర్తుచేసుకున్నారు. కొందరు నిర్ణయం మార్చుకోవాలని కోరడంతో కొద్దిసేపు ప్రసంగాన్ని ఆపాల్సి వచ్చిందని తెలిపారు. అయినప్పటికీ తన నిర్ణయాన్ని మార్చుకోలేదు. అనంతరం డాక్టర్ మన్మోహన్ సింగ్ పేరును ప్రధానమంత్రి పదవికి ప్రతిపాదించారు. దీంతో యూపీఏ ప్రభుత్వానికి మన్మోహన్ సింగ్ నాయకత్వం వహించారు.మొత్తంగా, ప్రధానమంత్రి పదవిని తిరస్కరించడం వెనుక కుటుంబ భద్రత, రాజకీయ పరిస్థితులు, వ్యక్తిగత సిద్ధాంతాలు కీలకంగా ఉన్నాయని సోనియా గాంధీ తన ఆత్మకథలో వివరించారు. 2004లో దేశ రాజకీయాలను మలుపు తిప్పిన తన నిర్ణయంపై ఇన్నేళ్ల తర్వాత ఆమె చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు మరోసారి చర్చనీయాంశంగా మారాయి.2004 ప్రధాని పదవి త్యాగం మరియు ఃసూపర్ పీఎంఃఃసూపర్ పీఎంఃఃసూపర్ పీఎంః

## మొదటి పేజీ తరువాయి రెండేళ్లలో భారత్‌లోనే సొంతంగా విమానాల తయారీ: రామ్మోహన్ నాయుడు

కేవలం విమానాల తయారీకే పరిమితం కాకుండా, డిజైనింగ్ నైపుణ్యాలను కూడా దేశీయంగానే అభివృద్ధి చేసుకోవడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఉడాన్ పథకం రెండో దశ విస్తరణ కోసం రూ. 30,000 కోట్ల బడ్జెట్ కేటాయించినట్లు మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా 2036 నాటికి దేశవ్యాప్తంగా మరో 100 విమానాశ్రయాలు, 200 ఆధునిక హెలిపోర్టులను నిర్మిస్తామన్నారు. 2014లో దేశంలో కేవలం 74 విమానాశ్రయాలు ఉండగా, ప్రస్తుతం ఆ సంఖ్య 166కి చేరిందని, ఏటా ప్రయాణికుల సంఖ్య 25 కోట్లను దాటిందని వివరించారు. 'డిజి యాత్ర' విధానం వల్ల ప్రయాణికుల బోర్డింగ్ సమయం 90 సెకన్ల నుంచి 20 సెకన్లకు తగ్గిందని పేర్కొన్నారు. ఏరోస్పేస్ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలకు ఇది సరైన సమయమని మంత్రి పిలుపునిచ్చారు. విమాన విడిభాగాల తయారీ, మెయింటెనెన్స్, డ్రోన్లు, ఎయిర్ టాక్సీల విభాగాల్లో విస్తారమైన అవకాశాలు ఉన్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో భోగాపురం విమానాశ్రయం పనులు గడువు కంటే ఆరు నెలల ముందే పూర్తయ్యాయని ప్రశంసించారు. అనంతపురం జిల్లా లేపాక్షి సమీపంలో ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ సిటీ ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయని, ప్రకాశం బ్యారేజ్, శ్రీశైలం, హైదరాబాద్ హుస్సేన్‌సాగర్‌లను అనుసంధానిస్తూ సీప్లేన్ సర్వీసులు త్వరలోనే అందుబాటులోకి వస్తాయని వివరించారు.

## మొదటి పేజీ తరువాయి ప్రపంచవ్యాప్తంగా నిలిచిపోయిన మైక్రోసాఫ్ట్ సేవలు..

ఈ పరిణామంతో ప్రపంచవ్యాప్తంగా ఆఫీసు పనులు, ఇతర కమ్యూనికేషన్లకు తీవ్ర ఆటంకం కలిగింది. ఈ అంతరాయంపై మైక్రోసాఫ్ట్ స్పందించింది. అమెరికాలోని యూజర్లు ఎక్స్ఛేంజ్ ఆన్‌లైన్ మెయిల్‌బాక్స్‌లను యాక్సెస్ చేయడంలో ఇబ్బందులు పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని సోషల్ మీడియా ద్వారా వెల్లడించింది. తమ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లోని ఒక భాగంపై అసాధారణంగా లోడ్ పెరిగిందని, దీనివల్లే కనెక్టివిటీ సమస్యలు తలెత్తాయని తొలుత భావించింది. అయితే, ఆ తర్వాత అసలు కారణాన్ని గుర్తించింది. ఆటోమేటెడ్ తనిఖీల సమయంలో కొన్ని సర్వర్లు విఫలం కావడం వల్ల అవి అనూహ్యంగా అందుబాటులో లేకుండా పోయాయని, ఇదే సమస్యకు మూలమని నిర్ధారించింది. ఈ వైఫల్యానికి దారితీసిన పూర్తి సాంకేతిక కారణాలను వెల్లడించనప్పటికీ, సమస్యను పరిష్కరించేందుకు ఒక ఫిక్స్‌ను పరీక్షిస్తున్నట్లు మైక్రోసాఫ్ట్ తెలిపింది. "ప్రభావాన్ని తగ్గించడానికి సాధ్యమైన అన్ని మార్గాల్లో దూకుడుగా ప్రయత్నిస్తున్నాం" అని మైక్రోసాఫ్ట్ 365 స్టేటస్ ఖాతా 'ఎక్స్' (గతంలో ట్విట్టర్) లో పోస్ట్ చేసింది. కాగా, ఉత్తర అమెరికాలో టీమ్స్‌కు సంబంధించిన సమస్యలను పునరుద్ధరించామని కంపెనీ అంతకుముందు ప్రకటించినా, కొంతమంది యూజర్లకు కనెక్టివిటీ సమస్యలు ఇంకా కొనసాగుతున్నాయని ఫిర్యాదులు వస్తూనే ఉన్నాయి.

## తెలుగు ప్రజలతో 'ఇందిరమ్మ' అనుబంధాన్ని గుర్తుచేసుకున్న సోనియా గాంధీ

- కొత్తగా విడుదలైన తన జ్ఞాపకాల పుస్తకంలో కీలక విషయాలు వెల్లడించిన సోనియా
- తెలుగు ప్రజలు తనను రాజీవ్ గాంధీ భార్యగా కాక, ఇందిరమ్మ కోడలిగానే చూశారని వెల్లడి
- 2004లో ఉమ్మడి ఏపీలో జరిపిన యాత్ర నాటి అనుభవాలను పంచుకున్న సోనియా
- లంబాడీ మహిళలు తనను ఇందిరమ్మ కోడలిగా ఆదరించిన సంఘటనను గుర్తుచేసుకున్న వైనం
- నీలం సంజీవరెడ్డి, వీవీ గిరి ప్రస్తావనతో పాటు పలు రాజకీయ ఘట్టాల వెల్లడి



కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు సోనియా గాంధీ, తెలుగు ప్రజలతో తనకున్న ప్రత్యేక అనుబంధాన్ని తన తాజా ఆత్మకథలో గుర్తుచేసుకున్నారు. తనకంటూ ఒక గుర్తింపు రాకముందు, రాజీవ్ గాంధీ భార్యగా కంటే కూడా మాజీ ప్రధాని ఇందిరా గాంధీ కోడలిగానే తెలుగు ప్రజలు తనను ఎంతగానో ఆదరించారని ఆమె వివరించారు. ఇటీవల ప్రచురితమైన "బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్" అనే తన జ్ఞాపకాల పుస్తకంలో ఈ ఆసక్తికర విషయాలను వెల్లడించారు. 2004లో జన సంపర్క్ కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించినప్పటి అనుభవాలను ఆమె పంచుకున్నారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌ను సందర్శించిన అనంతరం విజయవాడకు ప్రయాణిస్తుండగా, మార్గమధ్యంలో 'ఇందిరమ్మ'కు మద్దతుగా నినాదాలు వినిపించాయని తెలిపారు. ఈ ప్రయాణంలో రోడ్డు పక్కన నిల్చున్న లంబాడీ (బంజారా) మహిళల బృందం తన దృష్టిని ఆకర్షించిందని సోనియా పేర్కొన్నారు. వారి సాంప్రదాయ ఎరుపు, నీలం రంగుల లెహంగాలు, అద్దాలతో కుట్టిన ఓణీలు చూసి, తన మెహందీ వేడుక నాటి దుస్తులను గుర్తుచేసుకుని వాహనం ఆపానని చెప్పారు. ఆ మహిళలు ఆప్యాయంగా తన తలపై ఓణీ కప్పి, తమ సంప్రదాయ దుస్తులకు ఉన్న ప్రాముఖ్యతను తెలుసుకుని ఆనందంతో నాట్యం చేశారని, తనను కూడా అందులోకి లాగారని సోనియా రాశారు. 'నువ్వు ఇందిరమ్మ కోడలివి, అందుకే నీకు, కాంగ్రెస్‌కు ఓటేస్తాం' అని ఆ మహిళలు తనతో చెప్పిన మాటలు ఎప్పటికీ గుర్తుంటాయని సోనియా తెలిపారు. ఈ సంఘటన ప్రజల నాడిని అర్థం చేసుకోవడానికి, తన రాజకీయ ప్రయత్నాలను కొనసాగించడానికి ఎంతో ప్రోత్సాహాన్ని ఇచ్చిందని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ పుస్తకంలో తెలుగు నేతలకు సంబంధించిన పలు పాత రాజకీయ సంఘటనలను కూడా సోనియా ప్రస్తావించారు. 1969 రాష్ట్రపతి ఎన్నికల్లో కాంగ్రెస్ సిండికేట్ అభ్యర్థి అయిన నీలం సంజీవరెడ్డికి వ్యతిరేకంగా ఇందిరా గాంధీ.. వీవీ గిరికి మద్దతిచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ఆత్మప్రబోధానుసారం ఓటు వేయాలన్న పిలుపుతో గిరి విజయం సాధించిన తీరును వివరించారు. అలాగే, 1975లో అలహాబాద్ హైకోర్టు తీర్పు తర్వాత నెలకొన్న రాజకీయ సంక్షోభం సమయంలో జరిగిన పరిణామాలను కూడా ఆమె ఈ పుస్తకంలో పొందుపరిచారు.

## సివిల్ సర్వీసెస్‌లో తుది ఇంటర్వ్యూకు అర్హత సాధించిన 31 మంది తెలంగాణ అభ్యర్థులు

- అభినందనలు తెలిపిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

(హైదరాబాద్, సాక్షర): తెలంగాణ ప్రాంతం నుంచి అత్యధిక సంఖ్యలో అభ్యర్థులు సివిల్ సర్వీసెస్‌లో విజయం సాధించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి సంస్థ సహకారంతో ప్రారంభించిన 'రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం' పథకం మరోసారి మంచి ఫలితాలను సాధించింది. ఇటీవల విడుదలైన సివిల్స్ మెయిన్స్ పరీక్షలో ఉత్తీర్ణులై 31 మంది అభ్యర్థులు తుది ఇంటర్వ్యూకు ఎంపికయ్యారు. సింగరేణి సంస్థ సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షలో ఉత్తీర్ణులైన తెలంగాణ ప్రాంత అభ్యర్థులకు ఆర్థిక ప్రోత్సాహకం అందించేందుకు రెండు నెలల క్రితం దరఖాస్తులను ఆహ్వానించింది. వచ్చిన దరఖాస్తుల్లో 158 మంది అర్హులైన అభ్యర్థులను గుర్తించి, ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున మొత్తం రూ.1.58 కోట్ల ఆర్థిక ప్రోత్సాహకాన్ని అందించింది. ఈసారి ప్రోత్సాహక మొత్తాలను నేరుగా అభ్యర్థుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసే విధానాన్ని అమలు చేశారు. ఈ ఆర్థిక సహకారంతో అభ్యర్థులు మెయిన్స్ పరీక్షలకు మరింత ఉత్సాహంతో సిద్ధమయ్యారు. వారిలో 31 మంది తుది ఇంటర్వ్యూకు ఎంపిక కావడం విశేషం. తుది ఇంటర్వ్యూకు ఎంపికైన 31 మంది అభ్యర్థులకు కూడా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సింగరేణి సంస్థ త్వరలో ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున అదనపు ఆర్థిక ప్రోత్సాహకాన్ని అందించనుంది. సివిల్స్ మెయిన్స్ లో ఉత్తీర్ణులై తుది ఇంటర్వ్యూకు ఎంపికైన తెలంగాణ బిడ్డలందరికీ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అభినందనలు తెలిపారు. ఇంటర్వ్యూ దశకు చేరుకున్న అభ్యర్థులందరూ తుది పరీక్షలోనూ విజయం సాధించి తెలంగాణకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం పథకానికి సింగరేణి సంస్థ గత రెండేళ్లుగా తన కార్పొరేట్ సామాజిక బాధ్యత (CSR) నిధుల నుంచి ఆర్థిక సహకారం అందిస్తోంది. ఈ పథకం ద్వారా మొదటి ఏడాది ఏడుగురు, రెండో ఏడాది 20 మంది చొప్పున మొత్తం 27 మంది అభ్యర్థులు సివిల్ సర్వీసెస్‌లో విజయం సాధించడం విశేషం. ఈ ఏడాది కూడా అత్యధిక సంఖ్యలో అభ్యర్థులు తుది ఇంటర్వ్యూలో విజయం సాధించి సివిల్ సర్వీసెస్‌కు ఎంపిక కావాలని, ఈ అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో మాక్ ఇంటర్వ్యూలు నిర్వహించబోతున్నారని, ఈ మాక్ ఇంటర్వ్యూల నిర్వహణకు కూడా సింగరేణి సంస్థ తన సహకారాన్ని అందిస్తుందని సింగరేణి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి తెలిపారు. ఈ ఏడాది తుది ఇంటర్వ్యూకు ఎంపికైన 31 మందిలో వరంగల్ జిల్లా నుంచి 6, మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా నుంచి 4, హైదరాబాద్, జగిత్యాల జిల్లాల నుంచి 3, నల్గొండ, రంగారెడ్డి, సంగారెడ్డి, సూర్యాపేట జిల్లాల నుంచి ఇద్దరేసి చొప్పున, ఆదిలాబాద్, నారాయణపేట, సిద్దిపేట, కామారెడ్డి, కరీంనగర్, ఖమ్మం, మంచిర్యాల జిల్లాల నుంచి ఒక్కొక్కరు చొప్పున తుది ఇంటర్వ్యూకు అర్హత సాధించారు.

## రాహుల్ చేతుల మీదుగా గిగ్ వర్కర్స్ చట్టం అమలు

(హైదరాబాద్, సాక్షర): భారత్ సమ్మిట్ ద్వారా తెలంగాణ కేంద్రం.. ఇప్పుడు నిరాకరించింది. తెలంగాణ ప్రజలకు వ్యతిరేకిస్తున్నాయి. వారు వ్యతిరేకించేది కాంగ్రెస్ ను కాదు... సుపరిపాలన కోసం రాజ్యాంగాన్ని 106 సార్లు మనం పెట్టుబడులకు అనుకూలమని ప్రపంచానికి చాటడమే ప్రభుత్వ అనుకూలంగా ఏ నిర్ణయాలు తీసుకున్నా బీజేపీ, బీఆరెస్ తెలంగాణ ప్రజలను.. కేంద్ర ప్రభుత్వానికి గిగ్ వర్కర్స్ ను సవరించుకున్నాం . ప్రపంచ శాంతి కోసం చర్చ జరగాల్సిన ఉద్దేశం. డిసెంబర్ 7,8,9 తేదీల్లో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ వ్యతిరేకిస్తున్నాయి . వివిధ రంగాల్లో వివిధ హోదాలలో ఉన్న ఆదుకునే ఆలోచన లేదు. గిగ్ వర్కర్స్ చట్టాన్ని రేపటి నుంచి అవసరం ఉంది. భారత్ సమ్మిట్ కోసం ఇక్కడికి వచ్చిన ప్రతీ సమ్మిట్ నిర్వహిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యక్తులను భారత్ సమ్మిట్ కు ఆహ్వానించాం . నగరాన్ని అమలు చేయబోతున్నాం . రాహుల్ గాంధీ చేతుల మీదుగా గిగ్ అతిథి తెలంగాణ బ్రాండ్ అంబాసిడర్లుగా మారుతారు. వెల్లడించారు. శుక్రవారం నాడు అయన మీడియాతో మాట్లాడారు. ప్రత్యక్షంగా చూసి, పారిశ్రామిక విధానాలను తెలుసుకుంటారని వర్కర్స్ చట్టం అమలును ప్రారంభించబోతున్నాం . భారత్ సమ్మిట్ ఇప్పటికైనా బీజేపీ నాయకులు విజ్ఞత ప్రదర్శించాలి . మీకు హైదరాబాద్ వాతావరణం పెట్టుబడులకు అనుకూలం. ఇందులో భారత్ సమ్మిట్ నిర్వహిస్తున్నాం. కిషన్ రెడ్డి, రాంచందర్ రావు, లో ముగింపు సందేశాన్ని ఇచ్చేందుకు రాహుల్ గాంధీ హైదరాబాద్ కడుపులో విషం ఉండొచ్చు.. అది తెలంగాణ ప్రజలపై భాగంగా కర్టెన్ రైజర్ డిల్లీతో పాటు వివిధ ప్రాంతాల్లో కర్టెన్ రైజర్ కేటీఆర్ ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూస్తున్నారని వస్తున్నారు . ప్రధాని మోదీ ఇతర దేశాలకు వెళ్లి ఉపన్యాసాలు ప్రదర్శించకండని అన్నారు. రాహుల్ గాంధీ బీజేపీని ఓడించి కార్యక్రమాలు నిర్వహించాం. ముంబై, అహ్మదాబాద్ లోనూ కర్టెన్ ఆరోపించారు. పెట్టుబడులను ఆహ్వానించి 2034 నాటికి 1 ఇస్తారు, విదేశాలలో సదస్సులు నిర్వహిస్తారు మోదీ ఏది చేసినా దేశానికి ప్రధాని అవుతారని బీజేపీ భయపడుతోంది . మీ రైజర్ కార్యక్రమాన్ని నిర్వహించబోతున్నాం . నవంబర్ 13, 14 ట్రిలియన్ ఎకానమీగా, 2047 నాటికి 3 ట్రిలియన్ ఎకానమీగా కరెక్టు.. రాహుల్ గాంధీ చేస్తే తప్పు అన్నట్లుగా బీజేపీ రాజకీయాల కోసం రాహుల్ గాంధీ తెలంగాణ పర్యటనను తేదీల్లో భారత్ సమ్మిట్ కు 70 దేశాల నుంచివెయ్యి మంది రాష్ట్రాన్ని తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం . మూసీ వ్యవహరిస్తుందని అన్నారు. ప్రధాన ప్రతిపక్ష నాయకుడిని బీజేపీ వ్యతిరేకించొద్దు . ఢిల్లీల్లో గ్లోబల్ సమ్మిట్ కర్టెన్ రైజర్ కార్యక్రమానికి ప్రతినిధులు హాజరవుతున్నారని అన్నారు. భారత్ సమ్మిట్ కు ప్రక్షాళన, మెట్రో విస్తరణ, రీజనల్ రింగ్ రోడ్డును, తుమ్మిడిహట్టిని, ఎందుకు వ్యతిరేకిస్తోంది . బీజేపీ వైఖరి నియంతృత్వ వైఖరి . పీయూష్ గోయల్ వస్తే మీరు స్వాగతించారు.. కానీ భారత్ ఆహ్వానించినా కొంతమందికి మొదట అనుమతులు ఇచ్చిన ఇలా ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా బీజేపీ, బీఆరెస్ ప్రజాస్వామ్యంలో అందరి అభిప్రాయాలు తీసుకుంటాం . సమ్మిట్ కు రాహుల్ గాంధీ వస్తే విమర్శిస్తారా అని ప్రశ్నించారు.

## తీన్మార్ మల్లన్న వాహనాన్ని ఢీకొట్టిన లారీ..

- నలుగురికి గాయాలు, దంపతుల పరిస్థితి విషమం



(యాదాద్రి భువనగిరి, సాక్షర): మోత్కూరు మండలం అనాజిపురం గ్రామం వద్ద తీన్మార్ మల్లన్న పాదయాత్రలో శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. మోత్కూరు నుంచి అనాజిపురం మీదుగా తిరుమలగిరి వైపు పాదయాత్ర సాగుతున్న క్రమంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన (టీఎస్ 30 టి 7596) చౌటుప్పల్ మండలం జై కేసారానికి చెందిన లారీ మల్లన్న కాన్వాయ్‌లోని ఫార్చునర్ కారు (టీఎస్ 30 ఎల్ 444)ను బలంగా ఢీకొట్టింది. దీంతో ఆ కారు అదుపుతప్పి ఎదురుగా వస్తున్న మరో కారును ఢీకొట్టడంతో రెండు వాహనాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ ప్రమాదంలో (టీఎస్ 04 8919) నంబర్ గల కారులో ప్రయాణిస్తున్న నలుగురికి గాయాలయ్యాయి. వారిలో తిరుమలగిరికి చెందిన మేడబోయిన శ్రీనాథ్, ఆయన భార్య చందనతో పాటు రెండేళ్ల కుమారుడికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే 108 అంబులెన్స్‌లో నార్కట్‌పల్లి కామినేని హాస్పిటల్ కు తరలించారు. కారు డ్రైవర్ సురేష్‌కు కూడా గాయాలు కావడంతో మరో వాహనంలో దవాఖానకు తరలించారు. అలాగే తీన్మార్ మల్లన్నకు చెందిన ఫార్చునర్ కారులో ఉన్న మరో ఇద్దరు కూడా గాయపడినట్లు తెలిసింది.లారీ ఢీకొట్టిన తీవ్రతకు మల్లన్నకు చెందిన ఫార్చునర్ కారు పూర్తిగా ధ్వంసమైంది. అయితే ప్రమాదం జరిగిన సమయంలో తీన్మార్ మల్లన్న కారులో కాకుండా కాలినడకన పాదయాత్రలో ముందుకు సాగుతుండటంతో తృటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. కాగా, ఈ ప్రమాదంలో గాయపడిన భార్యాభర్తల పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ ప్రమాదంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలపై వివరాలు సేకరిస్తున్నారు.

## రోడ్ల ఆధునికీకరణపై మేధోమథనం.. హైటెక్స్ వేదికగా ఇండియన్ రోడ్ కాంగ్రెస్: కోమటిరెడ్డి

- హైటెక్స్‌లో డిసెంబర్ 19 నుంచి 22 వరకు 85వ ఐఆర్‌సీ సదస్సు జరుగుతుందన్న కోమటిరెడ్డి
- నాలుగు రోజుల పాటు విస్తృతంగా జరగనున్న సాంకేతిక చర్చలు జరుగుతాయని వెల్లడి
- దేశవ్యాప్తంగా ఇంజినీర్లు, పరిశోధకులు, నిర్మాణ రంగ నిపుణులు హాజరవుతారన్న మంత్రి

(హైదరాబాద్, సాక్షర): హైదరాబాద్ వేదికగా ప్రతిష్ఠాత్మక 85వ ఇండియన్ రోడ్ కాంగ్రెస్ (ఐఆర్‌సీ) వార్షిక సదస్సు జరగనుంది. ఈ నెల 19 నుంచి 22వ తేదీ వరకు మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలంగాణ రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెల్లడించారు. రహదారుల నిర్మాణం, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా పటిష్టమైన రోడ్డు వ్యవస్థల రూపకల్పనపై విజ్ఞాన పంపిణీ, ఆలోచనల మార్పిడి, వినూత్న విధానాల అన్వేషణకు ఈ ఐఆర్‌సీ సదస్సు ఒక కీలక వేదిక కానుందని మంత్రి పేర్కొన్నారు. నాలుగు రోజుల పాటు సాగే ఈ సదస్సులో దేశం నలుమూలల నుంచి ఇంజినీర్లు, పరిశోధకులు, విద్యావేత్తలు, విద్యార్థులు, కాంట్రాక్టర్లు, కన్సల్టెంట్లు, మెటీరియల్ తయారీదారులు పాల్గొని సాంకేతిక అంశాలపై విస్తృతంగా చర్చించనున్నారని తెలిపారు. ఈ నెల 19న ఐఆర్‌సీ 238వ కౌన్సిల్ సమావేశం, 20న జాతీయ రహదారుల పరిశోధనా మండలి 90వ సమావేశం జరగనున్నాయని తెలిపారు. దేశవ్యాప్తంగా రోడ్డు నెట్‌వర్క్ నాణ్యతను పెంచేందుకు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునేందుకు ఈ సమావేశాలు దోహదపడనున్నాయి. జాతీయ స్థాయి ప్రతినిధులు ఒకేచోట చేరి విధానపరమైన అంశాలపై చర్చించనుండటంతో హైదరాబాద్ వేదికగా జరుగుతున్న ఈ సదస్సుకు ప్రాధాన్యత ఏర్పడింది

## ప్రశాంత్ నగర్‌లో ప్రభుత్వ స్థలాలకు హైడ్రా రక్షణ

- 2,121 గజాలకు ఫెన్సింగ్.. ఆక్రమణలకు పాల్పడితే చర్యలు




(ఘట్‌కేసర్, సాక్షర): మేడ్చల్ జిల్లా పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడ పరిధిలోని ప్రశాంత్ నగర్ కాలనీలో ప్రభుత్వ స్థలాలను హైడ్రా అధికారులు శుక్రవారం పరిరక్షించారు. కాలనీవాసుల ఫిర్యాదుతో స్పందించిన అధికారులు సర్వే నంబర్లు 94, 95లోని మొత్తం 2,121 గజాల స్థలాలకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ఫెన్సింగ్ వేశారు. ఇందులో పాఠశాలకు 868, పార్కుకు 765, కమ్యూనిటీ హాల్‌కు 488 గజాలు కేటాయించారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ఈ చర్యలపై కాలనీ అధ్యక్షుడు గంట సోమిరెడ్డి, కోశాధికారి బీన బోయిన శ్రీనివాస్‌తో పాటు కాలనీవాసులు హైడ్రాకు కృతజ్ఞతలు తెలిపారు.

## మొదటి పేజీ తరువాయి రాహుల్ గాంధీ హైదరాబాద్ పర్యటనపై కేటీఆర్ ఫైర్..

రాజ్యాంగబద్ధమైన ప్రక్రియలను అపహాస్యం చేస్తూ, 10 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టి కాంగ్రెస్‌లో చేర్చుకున్నప్పుడు మీరు ఎందుకు మౌనంగా ఉన్నారు? మహిళా ప్రజాప్రతినిధుల చీరలు లాగి, అసెంబ్లీ ఎదుటే దాడులు చేసినప్పుడు కనీసం ఒక్క మాటైనా మాట్లాడారా రాహుల్ గాంధీ? రైతుల ఆత్మహత్యలు, చేనేత కార్మికుల బలవన్మరణాలు, అర్ధరాత్రి వేళ జర్నలిస్టుల అరెస్టులు, కార్పొరేట్ అనుకూల విధానాలు, భూకబ్జాలపై మాట్లాడటానికి మీకు సమయం లేదా? మీ సొంత పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులే బహిరంగంగా అవినీతి గురించి మాట్లాడుతున్నారు. అయినా మీరు నోరు ఎందుకు మెదపడం లేదు? అవసరమైనప్పుడు మౌనం వహించారు.. ఇప్పుడు మాత్రం తెలంగాణ ప్రజల సొమ్ము రూ.100 కోట్లతో ప్రచార ఆర్భాటం కోసం సిగ్గులేకుండా వచ్చారా? రాహుల్ గాంధీ.. తెలంగాణ ప్రజల సొమ్ముతో ఈ ప్రచార పర్యటనలు చేయడానికి మీకు ఎవరు అధికారం ఇచ్చారు? తెలంగాణ ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పే ధైర్యం ఉందా?' అంటూ ఎక్స్‌లో కేటీఆర్ ప్రశ్నల వర్షం కురిపించారు.

## ప్రభుత్వ భూముల వేలంపై మాజీ మంత్రి హరీశ్ రావు ఆగ్రహం.

(హైదరాబాద్, సాక్షర): ప్రజా ప్రయోజనాలకు ఉపయోగపడే ప్రభుత్వ భూములను విక్రయించాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు మండపడ్డారు. మూడు నియోజకవర్గాల పరిధిలోని సుమారు 10 లక్షల మంది జనాభాకు, నిత్యం వందలాది భారీ వాహనాల నిలుపుదలకు కీలకమైన ఈ స్థలాన్ని అమ్మడం వల్ల రవాణా రంగం, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడతారని పేర్కొన్నారు. ఈ నెల 27న హెచ్ఎండీఏ నిర్వహించే వేలంలో కాప్రాలోని బస్తీ దవాఖానా స్థలం (484 గజాలు), అమీన్‌పూర్‌లోని 302 గజాలతో పాటు మూసాపేట ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసు స్థలాన్ని సైతం అమ్మకానికి పెట్టడం విడ్డూరమని హరీశ్ రావు విమర్శించారు. ఎన్నికలకు ముందు ఒక్క ఇంచు భూమి కూడా అమ్మబోమని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నేడు అందుకు విరుద్ధంగా కైతలాపూర్‌లో శ్మశాన వాటికలను తవ్వించడంతో పాటు హెచ్ఎండీఏ, హౌసింగ్ బోర్డు, విశ్వవిద్యాలయాలు, పారిశ్రామిక భూములను వేలం వేస్తూ మాట తప్పారని ఆయన ఆరోపించారు.

## మొదటి పేజీ తరువాయి ఉత్తర తెలంగాణలో పట్టు సాధించేది ఎలా ?

గోదావరిఖనిలో జరిగిన సింగరేణి కార్మిక గర్జనతో మొదలైన ఈ రాజకీయ యాత్ర, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లోని రైతు సదస్సుల మీదుగా సాగుతూ, నవంబర్ 29న కరీంనగర్‌లో నిర్వహించనున్న 'దీక్షా దివస్' వేడుకలతో పతాక స్థాయికి చేరనుంది. కార్మికులు, రైతులు, తెలంగాణ ఉద్యమ సెంటిమెంట్ అనే మూడు ప్రధాన అంశాలను ఎంచుకోవడం ద్వారా, తమ సంప్రదాయ ఓటు బ్యాంకును తిరిగి ఆకట్టుకోవాలని బీఆర్ఎస్ భావిస్తోంది.అయితే.. ఉత్తర తెలంగాణలో బీఆర్ఎస్‌కు పరిస్థితులు అంత సులభంగా లేవు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ స్థానాలను బీజేపీ కైవసం చేసుకోవడం గులాబీ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ. కేవలం ఎన్నికల ప్రచారాలకే పరిమితం కాకుండా, బీజేపీ తన సంస్థాగత బలాన్ని కూడా ఈ ప్రాంతంలో గణనీయంగా పెంచుకుంది. ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో బీసీ నాయకత్వాన్ని ప్రోత్సహించడం, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ కేంద్ర సహాయ మంత్రిగా ఉండటం వంటి అంశాలు బీజేపీకి క్షేత్రస్థాయిలో బలాన్ని చేకూర్చాయి.మరోవైపు, అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నుంచి కూడా బీఆర్ఎస్ గట్టి పోటీని ఎదుర్కొంటోంది. గతంలో తమ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను గుర్తు చేయడం ద్వారానే ఓట్లు రాబట్టవచ్చన్న వ్యూహం ఇప్పుడు ఫలించడం లేదు. సింగరేణి ప్రాంతంలో 18,000 మంది వారసులకు ఉద్యోగ అవకాశాలు కల్పించామని, కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు సాగునీరు అందించామని బీఆర్ఎస్ నేతలు పదేపదే ప్రస్తావిస్తున్నప్పటికీ, అవి ఎన్నికల్లో ఓట్లుగా మారలేదన్నది స్పష్టమైంది.రాజకీయాల్లో పాత విధేయతలు, గత చరిత్ర కేవలం ఒక ఆరంభం మాత్రమే అవుతాయి తప్ప, వాటినే శాశ్వత విజయాలకు గ్యారెంటీగా తీసుకోలేము. కార్యకర్తల్లో నెలకొన్న అసంతృప్తిని తొలగించడం, క్షేత్రస్థాయిలో బలహీనపడిన పార్టీ యంత్రాంగాన్ని పునర్నిర్మించడం, ఒకేసారి బీజేపీ, కాంగ్రెస్ వంటి రెండు బలమైన ప్రత్యర్థులను సమర్థవంతంగా ఎదుర్కోవడం కేటీఆర్ ముందున్న తక్షణ కర్తవ్యాలు. గత పాలనా విజయాలను చెప్పుకోవడంతో పాటు, ప్రజల ప్రస్తుత సమస్యలపై పోరాడుతూ క్షేత్రస్థాయిలో తమ ఉనికిని బలంగా చాటుకున్నప్పుడే ఉత్తర తెలంగాణలో బీఆర్ఎస్ మళ్లీ పుంజుకునే అవకాశం ఉంటుంది. ఈ నెల రోజుల కార్యాచరణ గులాబీ దళానికి నిజమైన అగ్నిపరీక్షగా మారనుంది.

## రూ.20 వసూలు చేసినందుకు రూ.13,000 ఫైన్..

- రైల్వే పార్కింగ్ సిబ్బందికి బుద్ధి చెప్పిన వినియోగదారుల కమిషన్
- తమిళనాడులోని రాజపాళయం రైల్వే స్టేషన్‌లో చోటుచేసుకున్న ఘటన
- డ్రాప్-ఆఫ్ లేన్‌లో ఉన్న వాహనం నుంచి అక్రమంగా రూ.20 వసూలు
- బాధితుడికి రూ.13 వేల నష్టపరిహారం చెల్లించాలని కమిషన్ ఆదేశం
- పార్కింగ్ స్థలం దాటి రోడ్లపై వసూళ్లు చేయడం చట్టవిరుద్ధమని స్పష్టీకరణ
- ఉచిత సమయం నిబంధనలను ఉల్లంఘించినందుకు ఫోరం ఆగ్రహం



(రాజపాళయం, సాక్షర): రైల్వే స్టేషన్ వద్ద కుటుంబ సభ్యులను పికప్ చేసుకునేందుకు వెళ్లిన ఓ యువకుడి నుంచి అక్రమంగా రూ.20 పార్కింగ్ రుసుము వసూలు చేసిన వ్యవహారంలో రైల్వే శాఖ, పార్కింగ్ కాంట్రాక్టర్‌కు తమిళనాడు వినియోగదారుల కమిషన్ భారీ షాక్ ఇచ్చింది. బాధితుడి నుంచి తీసుకున్న రూ.20 రీఫండ్ చేయడంతో పాటు, అతనికి కలిగించిన మానసిక వేదనకు రూ.10,000, న్యాయ పోరాటం ఖర్చుల కింద మరో రూ.3,000 కలిపి మొత్తం రూ.13,000 పరిహారంగా చెల్లించాలని ఆదేశించింది. గతేడాది డిసెంబర్ 20న తమిళనాడులోని రాజపాళయం రైల్వే స్టేషన్‌కు (దక్షిణ రైల్వే, మధురై డివిజన్) ఓ న్యాయ విద్యార్థి తన వృద్ధ తల్లిదండ్రులు, తాతామామ్మలను పికప్ చేసుకునేందుకు కారులో వెళ్లాడు. అతను తన కారు ఇంజిన్ ఆపకుండా, ట్రాఫిక్‌కు అనుగుణంగా కేటాయించిన డ్రాప్-ఆఫ్ (సర్క్యులేషన్) ఏరియాలోనే ముందుకు కదులుతూ ఉన్నాడు. అసలు వాహనాన్ని ఎక్కడా నిలపలేదు, పార్కింగ్ స్థలంలోకి కూడా తీసుకెళ్లలేదు. అయినప్పటికీ, పార్కింగ్ కాంట్రాక్టర్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు అతడిని అడ్డుకుని, నిబంధనలకు విరుద్ధంగా '6 నిమిషాల రూల్' పేరుతో రూ.20 చెల్లించాలని డిమాండ్ చేశారు. డబ్బులు ఇచ్చేందుకు నిరాకరిస్తే రైల్వే చట్టం సెక్షన్ 159 కింద రూ.500 జరిమానా విధిస్తామని బెదిరించారు. వారిలో ఒకరు దక్షిణ రైల్వే లోగో ఉన్న గుర్తింపు కార్డు చూపించడంతో, బత్తిడికి గురైన సదరు విద్యార్థి రూ.20 చెల్లించి రసీదు తీసుకున్నాడు. తన కుటుంబ సభ్యుల ముందే సిబ్బంది హేళన చేస్తూ మాట్లాడారని, బహిరంగంగా అవమానించారని ఆరోపిస్తూ బాధితుడు వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించాడు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన కమిషన్ బెంచ్ (ప్రెసిడెంట్ ఎస్.జె. చక్రవర్తి, సభ్యురాలు ఎం. ముత్తులక్ష్మి) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. పార్కింగ్ కాంట్రాక్టర్ పరిధి కేవలం కేటాయించిన పార్కింగ్ స్థలానికి మాత్రమే పరిమితమని, పబ్లిక్ రోడ్లు లేదా డ్రాప్-ఆఫ్ లేన్లలోకి రాదని స్పష్టం చేసింది. దక్షిణ రైల్వే నిబంధనల ప్రకారం డ్రాప్-ఆఫ్ జోన్‌లో ప్రయాణికులను దింపేందుకు లేదా ఎక్కించుకునేందుకు 6 నిమిషాల వరకు ఉచిత సమయం ఉంటుందని, ఆ సమయంలో వాహనాల నుంచి రుసుము వసూలు చేసే హక్కు కాంట్రాక్టర్‌కు లేదని పేర్కొంది. కారును పార్క్ చేయనప్పుడు ఫీజు డిమాండ్ చేయడం వినియోగదారుల రక్షణ చట్టం ప్రకారం 'అన్యాయమైన వ్యాపార పద్ధతి' అని తేల్చింది. వాహనం ఎంట్రీ, ఎగ్జిట్ సమయాలను సరిచూడకుండా మాన్యువల్‌గా డబ్బులు వసూలు చేయడం నిబంధనల ఉల్లంఘనే అని పేర్కొంటూ.. రైల్వే అధికారులు, కాంట్రాక్టర్ ఆరు వారాల్లోగా బాధితుడికి పరిహారం చెల్లించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది

## కేంద్రీయ విద్యాలయ డిజిటల్ డ్యాష్‌బోర్డ్‌ను ప్రారంభించిన కేంద్ర విద్యాశాఖ మంత్రి



న్యూఢిల్లీ: కేంద్ర విద్యాశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి కేంద్రీయ విద్యాలయ సంగఠన్ మూడు ప్రధాన డిజిటల్ ప్లాగ్‌షిప్‌లను నవంబర్ 13న ప్రారంభించారు. వీటిలో ఏఐ ఇంటిగ్రేటెడ్ విద్యా సమీక్ష కేంద్ర విత్ ది సమీక్ష ఏఐ బాట్, సంవాద్ పేరెంట్ కనెక్ట్ యాప్, ఆలుమ్ని కనెక్ట్ పోర్టల్ ఉన్నాయి. టెక్నాలజీ ఆధారిత, పారదర్శక, సమర్థవంతమైన పరిపాలన దిశగా కేంద్రీయ విద్యాలయాలు తమ పాఠశాలల నెట్‌వర్క్‌లోని విద్యార్థుల హాజరు, విద్యా పనితీరు, మౌలిక సదుపాయాలను పర్యవేక్షించడానికి ఇవి ఉపయోగపడతాయి. విద్యార్థుల అభ్యసన ఫలితాలను పర్యవేక్షించి లోపాలను గుర్తించడంతో పాటు సకాలంలో స్పందించడానికి, తల్లిదండ్రులను భాగస్వామ్యం చేసేందుకు, పూర్వ విద్యార్థుల అనుభవాలను వివరించి, మార్గదర్శకత్వం ఇచ్చేందుకు ఈ డిజిటల్ పోర్టల్‌లు ఉపయోగపడతాయని మంత్రి ప్రహ్లాద్ జోషి పేర్కొన్నారు. విద్యావ్యవస్థను మరింత అనుసంధానంగా, ప్రతిస్పందించేది, ఉజ్వల భవిష్యత్తుకు తోడ్పడేందుకు ప్రధాన ముందడుగుగా నిలుస్తాయి అని మంత్రి అన్నారు. అన్ని తరగతులు, అన్ని ప్రాంతాలను కలుపుకొని ప్రతి కేంద్రీయ విద్యాలయంలో ఈ కార్యక్రమాన్ని విస్తరించాలని మంత్రి పిలుపునిచ్చారు. నిరంతర అభ్యసన విధానాన్ని అవలంబించాలని, ఫలితాలను అంచనా వేయాలని, మెరుగుపరచాల్సిన అంశాలపై దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. టీచర్ల సామర్థ్యాన్ని, సమగ్ర శిక్షణ ఉపాధ్యాయ శిక్షణ సమాచారాన్ని పోర్టల్‌లో పొందుపరచాలని ఆదేశించారు. టీచర్ల శిక్షణ పనితీరు, గత శిక్షణ రికార్డులు, ఇంకా శిక్షణ అవసరాల వివరాలను ఈ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో పొందుపరచాలని తెలిపారు. ఏఐ ఇంటిగ్రేటెడ్ విద్యా సమీక్ష కేంద్ర ద్వారా విద్యార్థులు, టీచర్లు, ఇతర సిబ్బంది హాజరు, అకడమిక్ పనితీరు, పాఠశాల మౌలికసదుపాయాలు, అడ్మిషన్ల గురించి సమాచారం తెలుసుకుంటుంది. ఈ సమాచారాన్ని విశ్లేషించి లోపాలను గుర్తించి, తీసుకోవాల్సిన చర్యలను సూచిస్తుంది. దీంతో సకాలంలో నిర్ణయాలు తీసుకోవడానికి వీలు కలుగుతుంది. కేవీఎస్ సమ్‌వాద్ పేరెంట్ కనెక్ట్ యాప్ ద్వారా విద్యార్థుల హాజరు, సిలబస్ పురోగతి, అకడమిక్ ఫలితాలు, అభ్యసన వనరులు, డిజిటల్ ఐడీ కార్డుల వివరాలను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరిస్తారు. దీనిద్వారా విద్యార్థుల తల్లిదండ్రులకు పాఠశాలలు చేరువ అవుతాయి. అలాగే వారు విద్యార్థులు, టీచర్ల దినచర్యలు తెలుసుకోవచ్చు. విద్యార్థుల బోనఫైడ్, సర్టిఫికెట్, సెలవులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.కేవీఎస్ ఆలుమ్ని పోర్టల్ పూర్వ విద్యార్థులతో మాట్లాడేందుకు వీలు కలుగుతుంది. దీనివల్ల వారి విజయాలు, అనుభవాలను పంచుకోవడంతో పాటు మెంటార్‌షిప్, కెరీర్ గైడెన్స్ అందిస్తారు.

## భారీగా తగ్గిన బంగారం ధరలు



హైదరాబాద్ బులియన్ మార్కెట్లో బంగారం ధరలు వరుసగా నాలుగో రోజు తగ్గుముఖం పట్టాయి. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,310 తగ్గి రూ.1,38,490కి చేరగా, గత నాలుగు రోజుల్లో మొత్తం రూ.6,110 మేర ధర తగ్గింది. అలాగే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,200 తగ్గి రూ.1,26,950గా ఉంది. మరోవైపు, కిలో వెండి ధర రూ.2,00,000 వద్ద స్థిరంగా కొనసాగుతోంది. ఈ ధరలపై 3% GST అదనంగా వర్తిస్తుందని మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి. ప్రాంతాన్ని బట్టి ధరల్లో స్వల్ప మార్పులు ఉండవచ్చు

## సదర్ ఉత్సవాలకు సన్నాహాలు

(కరీంనగర్, సాక్షర): కరీంనగర్ నగరంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న సదర్ ఉత్సవాలకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ నెల 22వ తేదీ ఆదివారం రోజున నగరంలోని సర్కస్ మైదానంలో సదర్ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించేందుకు యాదవ సంఘం ప్రతినిధులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌ను యాదవ సంఘం ప్రతినిధులు నేడు ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సదర్ ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను గంగుల కమలాకర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం ఉత్సవాల నిర్వహణ వివరాలను ఎమ్మెల్యేకు వివరించి, కార్యక్రమానికి హాజరుకావాల్సిందిగా ఆహ్వానించారు. యాదవుల సంస్కృతి, సంప్రదాయాలు, ఐక్యతకు ప్రతీకగా నిలిచే సదర్ ఉత్సవాలను ప్రతిఏటా ఘనంగా నిర్వహిస్తున్నామని ప్రతినిధులు తెలిపారు. సదర్ ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు వచ్చే ఆదివారం సర్కస్ మైదానంలో నిర్వహించనున్న సదర్ సమ్మేళనానికి యాదవ సంఘాల ప్రతినిధులు, యువజన సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సదర్ ఉత్సవాల విశిష్టతను చాటిచెప్పేలా కార్యక్రమాన్ని నిర్వహించేందుకు సమాయత్తమవుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నగర బిఆర్ఎస్ అధ్యక్షులు చల్ల హరి శంకర్, మాజీ కార్పొరేటర్ ఐలందర్ యాదవ్, సదర్ ఉత్సవాల కమిటీ చైర్మన్ రవి యాదవ్, ఉత్సవ కమిటీ ప్రతినిధులు ప్రసాద్ యాదవ్, సుధా యాదవ్, హరీష్ పటేల్, అభిలాష్ పటేల్, సాయి కృష్ణ బిట్టు, తదితర యాదవ సంఘాల సభ్యులు, యువజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## తెలంగాణ అండర్-19 బాలికల క్రికెట్ జట్టుకు అండగా నిలిచిన కేంద్ర మంత్రి బండి సంజయ్

- ఢిల్లీలో చిక్కుకున్న 17 మంది క్రీడాకారిణులకు తక్షణ ప్రయాణ ఏర్పాట్లు
- కేంద్ర మంత్రి చొరవతో సురక్షితంగా జమ్మూ కాశ్మీర్ చేరుకున్న జట్టు



(కరీంనగర్, సాక్షర): జాతీయ స్థాయి అండర్-19 బాలికల క్రికెట్ పోటీలలో పాల్గొనేందుకు వెళ్తున్న తెలంగాణ జట్టుకు ఎదురైన ప్రయాణ కష్టాలను కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తక్షణమే పరిష్కరించారు.జమ్మూ కాశ్మీర్‌లో జరుగుతున్న జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనేందుకు తెలంగాణ నుండి 17 మంది బాలికల క్రికెట్ బృందం బయలుదేరింది. అయితే, ఢిల్లీ నుండి జమ్మూ కాశ్మీర్ వెళ్లే క్రమంలో అనివార్య కారణాల వల్ల ప్రయాణపరమైన ఇబ్బందులు తలెత్తాయి. సమయానికి పోటీలకు చేరుకోలేమోనని క్రీడాకారిణులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. కరీంనగర్ బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యులు వేముల అనిల్ కుమార్ ద్వారా ఈ విషయం కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ దృష్టికి వెళ్లింది. సమాచారం అందిన వెంటనే స్పందించిన కేంద్ర మంత్రి, సంబంధిత ఉన్నతాధికారులతో మాట్లాడి క్రీడాకారిణులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ప్రయాణ ఏర్పాట్లు చేయించారు. ఆయన చొరవతో 17 మంది క్రీడాకారిణులు సకాలంలో, సురక్షితంగా జమ్మూ కాశ్మీర్‌కు చేరుకున్నారు. తమ కష్టకాలంలో వెంటనే స్పందించి అండగా నిలిచిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్‌కు తెలంగాణ అండర్-19 బాలికల క్రికెట్ జట్టు సభ్యులు, కోచ్‌లు , క్రీడాకారిణుల తల్లిదండ్రులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, ఈ సమస్యను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంలో కీలక పాత్ర పోషించిన కరీంనగర్ బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబర్ వేముల అనిల్ కుమార్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## తెలంగాణ విద్యా వ్యవస్థలో సమూల మార్పులు.. రేవంత్ సాహసం

(హైదరాబాద్, సాక్షర): తెలంగాణ విద్యా రంగంలో కీలక మార్పులకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వచ్చే విద్యా సంవత్సరం నుంచే రాష్ట్రంలో 10+2 విద్యా విధానాన్ని అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు పాఠశాల విద్యను బలోపేతం చేయడంతో పాటు, విద్యార్థులకు చదువుతోపాటు వృత్తి నైపుణ్యాలు అందించేలా కొత్త విద్యా ప్రణాళికను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. విద్యాశాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి పలు కీలక సూచనలు చేశారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యా వ్యవస్థలో సంస్కరణలు తీసుకురావాలని, ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా అభివృద్ధి చేయాలని స్పష్టం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.రాష్ట్రంలో నర్సరీ నుంచి 12వ తరగతి వరకు పాఠశాల విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం సూచించారు. ముఖ్యంగా 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ఉన్నత పాఠశాల విద్యగా పరిగణించి, విద్యార్థులకు అవసరమైన ప్రత్యేక విద్యా ప్రణాళికను అమలు చేయాలని ఆదేశించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు పెంచడంతో పాటు, భవిష్యత్తులో ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలకు అవసరమైన పునాదులు ఈ దశలోనే బలంగా వేయాలని ప్రభుత్వం భావిస్తోంది.కేవలం పుస్తక పరిజ్ఞానానికే విద్యను పరిమితం చేయకుండా, విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించే నైపుణ్యాలను కూడా అందించాలని సీఎం సూచించారు. 12వ తరగతి నుంచే స్కిల్లింగ్ కార్యక్రమాలను ప్రారంభించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు స్పష్టం చేశారు. తద్వారా విద్య పూర్తయ్యే సమయానికే విద్యార్థులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు అవసరమైన నైపుణ్యాలను పొందేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు.ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని రేవంత్‌రెడ్డి ఆదేశించారు. తరగతి గదులు, బోధనా సదుపాయాలు, ఇతర అవసరమైన సౌకర్యాలను మెరుగుపరిచి ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. విద్యా ప్రమాణాల విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని స్పష్టం చేశారు.విద్యా విధానంలో తీసుకొచ్చే మార్పుల అమలు విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం అధికారులకు సూచించారు. సంస్కరణల కారణంగా ఏ ఒక్క విద్యార్థికి నష్టం జరగకుండా పకడ్బందీ కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. మొత్తంగా వచ్చే విద్యా సంవత్సరం నుంచి 10+2 విధానం అమలుతో తెలంగాణ విద్యా రంగంలో కొత్త అధ్యాయం ప్రారంభం కానుంది. అయితే ఈ విధానం అమలుకు సంబంధించిన పూర్తి మార్గదర్శకాలు, కార్యాచరణను ప్రభుత్వం ఖరారు చేయాల్సి ఉంది.

## మొదటి పేజీ తరువాయి భారత్ సమ్మిట్-2026

ఆయా ఫోటోల్లోని చారిత్రక విశేషాలపై పరస్పరం చర్చించుకున్నారు. అనంతరం ఎగ్జిబిషన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పుస్తకాల స్టాల్‌ను సందర్శించి కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ ఆత్మకథ పుస్తకాన్ని పరిశీలించారు.

## మొదటి పేజీ తరువాయి అమెరికాలో ఇళ్ల అమ్మకాలు డౌన్.. 16 ఏళ్ల కనిష్టానికి విక్రయాలు.. ధరలు మాత్రం పైపైకే!

ఒకవైపు అమ్మకాలు పడిపోతున్నా, మరోవైపు ధరలు తగ్గకపోవడం మార్కెట్‌లో నెలకొన్న విచిత్ర పరిస్థితిని తెలియజేస్తోంది. దేశవ్యాప్తంగా ఇళ్ల సగటు ధర గత ఏడాదితో పోలిస్తే 0.4% పెరిగి 416,700 డాలర్లకు చేరింది. ఇలా ధరలు పెరగడం ఇది వరుసగా 40వ నెల. ఈ పరిస్థితిపై ఎన్ఏఆర్ చీఫ్ ఎకానమిస్ట్ లారెన్స్ యున్ స్పందిస్తూ.. "2000 సంవత్సరం తర్వాత మార్ట్‌గేజ్ వడ్డీ రేట్లు ఈ స్థాయిలో పెరగడం ఇదే మొదటిసారి. అందుకే ఇల్లు కొనడం చాలా కష్టంగా మారింది. ఫలితంగా, అమ్మకాలు దశాబ్దకాలంలో కనిష్ట స్థాయికి చేరాయి" అని వివరించారు. దేశంలోని మిడ్‌వెస్ట్, సౌత్, వెస్ట్ ప్రాంతాల్లో అమ్మకాలు క్షీణించగా, నార్త్ ఈస్ట్‌లో స్థిరంగా ఉన్నాయి. అమ్మకాలు మందగించడంతో మార్కెట్‌లో అందుబాటులో ఉన్న ఇళ్ల సంఖ్య (ఇన్వెంటరీ) పెరిగింది. ప్రస్తుతం 1.59 మిలియన్ల ఇళ్లు అమ్మకానికి ఉన్నాయి. ఇది 5.1 నెలల సప్లైకి సమానం. అయితే, సప్లై పెరిగినప్పటికీ ధరలు తగ్గకపోవడానికి బలమైన కారణం ఉందని నిపుణులు అంటున్నారు. ఇప్పటికే ఇళ్లు ఉన్న యజమానులు ఆర్థికంగా బలంగా ఉన్నారని, ఆస్తుల విలువ పెరగడంతో వారు తక్కువ ధరలకు అమ్మడానికి ఇష్టపడటం లేదని లారెన్స్ యున్ తెలిపారు. మొత్తం లావాదేవీలలో ఆర్థిక ఇబ్బందుల కారణంగా అమ్మిన ఇళ్లు కేవలం 2% మాత్రమే ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో మార్ట్‌గేజ్ వడ్డీ రేట్లు తగ్గితే, ఇల్లు కొనాలని వేచి చూస్తున్న వారి నుంచి భారీ డిమాండ్ (పెంట్-అప్ డిమాండ్) పుంజుకునే అవకాశం ఉందని ఆయన అంచనా వేశారు. ప్రస్తుతం మాత్రం అధిక ధరలు, వడ్డీ రేట్ల కారణంగా కొనుగోలు శక్తి అన్ని ప్రాంతాల్లోనూ గణనీయంగా తగ్గిందని అన్నారు.

# సజ్జనార్ కు షాక్...

(హైదరాబాద్, సాక్షర): తెలంగాణ పోలీసు శాఖలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సర్కార్ అనూహ్యమైన రీతిలో భారీ ప్రక్షాళనకు తెరలేపింది. ఒకేసారి 21 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జారీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ బదిలీల్లో అత్యంత ప్రధానంగా చెప్పుకోవాల్సిన అంశం హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్‌కు ఎదురైన భారీ షాక్. అత్యంత కీలకమైన ఫోకల్ పోస్టు లో కొనసాగుతున్న 1996 బ్యాచ్ అధికారి సజ్జనార్‌ను ఆ బాధ్యతల నుంచి తప్పించి, ప్రాధాన్యత తక్కువగా ఉండే తెలంగాణ ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్, ఎమర్జెన్సీ అండ్ సివిల్ డిఫెన్స్ డైరెక్టర్ జనర గా బదిలీ చేశారు. అదనంగా స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ బాధ్యతలు అప్పగించినప్పటికీ, సజ్జనార్ వంటి కీలక అధికారిని లూప్ లైన్ తరహా విభాగానికి పంపడం వెనుక ప్రభుత్వ అంతర్గత వ్యూహాలు బలంగా పనిచేశాయన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి.మరోవైపు, పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న 2001 బ్యాచ్ అధికారి అకున్ సబర్వాల్‌కు ప్రభుత్వం అత్యంత కీలకమైన పవర్‌ఫుల్ పోస్టింగ్ ఇచ్చి తన ప్రాధాన్యతను చాటుకుంది. అకున్ సబర్వాల్‌ను రాష్ట్ర శాంతిభద్రతల విభాగం అదనపు డీజీపీ గా నియమించడంతో పాటు, కోఆర్డినేషన్, టెక్నికల్ సర్వీసెస్ విభాగాల అదనపు బాధ్యతలను కూడా అప్పగించింది. ఇక సజ్జనార్ స్థానంలో కొత్త హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా 1995 బ్యాచ్ సీనియర్ ఐపీఎస్ అధికారి మహేష్ మురళీధర్ భగవత్ నియమితులయ్యారు. ఇప్పటివరకు శాంతిభద్రతల విభాగం డీజీపీగా పనిచేసిన ఆయన, గతంలో రాచకొండ కమిషనర్‌గా సుదీర్ఘకాలం పనిచేసిన అనుభవంతో ఇప్పుడు రాజధాని శాంతిభద్రతలను పర్యవేక్షించనున్నారు.ఈ ప్రక్షాళనలో భాగంగా అవినీతి నిరోధక శాఖ , నిఘా, ఆర్టీసీ, పౌరసరఫరాల విభాగాల్లోనూ ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. సీనియర్ మహిళా ఐపీఎస్ అధికారిణి చారు సిన్హాను పూర్తిస్థాయి ఏసీబీ డీజీగా నియమిస్తూనే, సీఐడీ డీజీపీగా పూర్తి అదనపు బాధ్యతలు కొనసాగించింది. మల్టీజోన్-1 ఐజీగా ఉన్న ఎస్. చంద్రశేఖర్ రెడ్డిని ఏసీబీ డైరెక్టర్‌గా బదిలీ చేసింది. అలాగే గ్రేహౌండ్స్ ఆపరేషన్స్ డీజీపీగా ఉన్న డాక్టర్ అనిల్ కుమార్‌ను టీజీఎస్ఆర్టీసీ ఎండీగా నియమించగా, ఆర్టీసీ ఎండీగా ఉన్న వై. నాగిరెడ్డిని పౌరసరఫరాల శాఖ కమిషనర్‌గా మార్చింది. ఇక సివిల్ సప్లైస్ కమిషనర్‌గా ఉన్న ఎం. స్టీఫెన్ రవీంద్రను కొత్తగా ఏర్పాటైన తెలంగాణ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, రోడ్ అండ్ రైల్ సేఫ్టీ బ్యూరో డైరెక్టర్‌గా నియమించగా, మహిళా భద్రత విభాగం డీజీపీగా డాక్టర్ సౌమ్య మిశ్రా, జైళ్ల శాఖ డీజీగా స్వాతి లక్రా బాధ్యతలు చేపట్టనున్నారు.గ్రేహౌండ్స్ డీజీగా విక్రమ్ సింగ్ మాన్, మల్టీజోన్-1 ఐజీగా కార్తికేయ వంటి సమర్థులైన అధికారులను కీలక స్థానాల్లో నియమించడం ద్వారా రేవంత్ రెడ్డి సర్కార్ పోలీసు వ్యవస్థపై తన పట్టును మరింత బిగించినట్లయింది. త్వరలో జరగబోయే పాలనాపరమైన కార్యక్రమాలు, క్షేత్రస్థాయి పర్యటనల నేపథ్యంలోనే ఈ భారీ మార్పులకు శ్రీకారం చుట్టినట్లు స్పష్టమవుతోంది. కొందరు అధికారులకు లూప్ లైన్ పోస్టింగ్‌లతో షాక్ ఇస్తూనే, అకున్ సబర్వాల్, మహేష్ భగవత్, చారు సిన్హా వంటి అధికారులకు కీలక విభాగాల పగ్గాలు అప్పగించడం ద్వారా రాష్ట్ర శాంతిభద్రతలు, అవినీతి నిరోధక చర్యల్లో ప్రభుత్వం సరికొత్త వేగాన్ని ఆశిస్తోందని అధికార వర్గాలు భావిస్తున్నాయి.

## 32 రోజులుగా సమ్మె.. రెగ్యులరైజేషన్ పై స్పష్టమైన హామీ ఇవ్వాలి

- ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల డిమాండ్



(ఆదిలాబాద్, సాక్షర) 21 ఏళ్లుగా సేవలందిస్తున్నా ఉద్యోగ భద్రత లేక, చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యను ముఖ్యమంత్రి తక్షణమే పరిష్కరించాలని, రెగ్యులరైజేషన్ పై లిఖితపూర్వక హామీ వస్తేనే సమ్మె విరమిస్తామని ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) పరిధిలో పనిచేస్తున్న సుమారు 17,000 మంది ఉద్యోగులు, 78 విభిన్న క్యాడర్లకు చెందిన కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు తమ న్యాయమైన హక్కుల సాధన కోసం గత 32 రోజులుగా నిరవధిక సమ్మె కొనసాగిస్తున్నారు.గత 21 సంవత్సరాలుగా ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖలో ప్రజలకు నిరంతర సేవలందిస్తున్న ఉద్యోగులు నేటికీ ఉద్యోగ భద్రత లేకుండా, చాలీచాలని వేతనాలతో జీవితాలను కొనసాగించాల్సిన పరిస్థితి నెలకొంది. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు, పిల్లల విద్యా ఖర్చులు, కుటుంబ బాధ్యతలు, ఇంటి అద్దెలు, ఇతర ఆర్థిక భారాలతో ఉద్యోగుల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.ప్రజల ఆరోగ్యం కోసం అహర్నిశలు కష్టపడుతున్న ఉద్యోగుల కుటుంబాల భవిష్యత్తు గురించి ప్రభుత్వం కూడా ఆలోచించాల్సిన అవసరం ఉంది. ఇన్ని సంవత్సరాల సేవల తర్వాత కూడా ఉద్యోగులకు శాశ్వత ఉద్యోగ భద్రత లేకపోవడం ఆవేదన కలిగిస్తోంది.ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలపై తక్షణమే స్పందించాలని జాక్-ఎన్‌హెచ్‌ఎం ఆదిలాబాద్ విజ్ఞప్తి చేస్తోంది.ముఖ్యమంత్రి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి, సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో చర్చించి, ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల ప్రతినిధులతో చర్చలు జరిపి, అన్ని 78 క్యాడర్ల ఉద్యోగుల రెగ్యులరైజేషన్ పై స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు.ఉద్యోగులు కోరుతున్నది విలాసవంతమైన జీవితం కాదు. తమ కష్టానికి తగిన గుర్తింపు, కుటుంబాలను గౌరవంగా పోషించుకునే వేతనం, ఆత్మగౌరవంతో కూడిన ఉద్యోగ జీవితం, శాశ్వత ఉద్యోగ భద్రత మాత్రమే.ప్రభుత్వం నుంచి రెగ్యులరైజేషన్ పై స్పష్టమైన లిఖితపూర్వక హామీ, కార్యాచరణతో కూడిన నిర్ణయం వచ్చినప్పుడే సమ్మె విరమణపై నిర్ణయం తీసుకుంటామని ఉద్యోగులు తమ వైఖరిని తెలియజేస్తున్నారు.ఇకనైనా ప్రభుత్వం సానుకూలంగా స్పందించి వేలాది ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల కుటుంబాల్లో న్యాయం, భరోసా, ఆనందం నింపాలని కోరారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

- బ్లాక్ స్పాట్ ల వద్ద హెచ్చరిక బోర్డులు, వేగ నియంత్రణ చర్యలు చేపట్టాలి జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా, ఎస్పీ జి.జానకి షర్మిల



(నిర్మల్ ప్రతినిధి, సాక్షర) జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పటిష్టమైన చర్యలు చేపట్టాలని, జిల్లాలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు వేగ నియంత్రణ చర్యలు చేపట్టాలని, రహదారులపై అక్రమ పార్కింగ్, ఆక్రమణలను తొలగించాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అన్నారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్ కు దూరంగా ఉండాలని జిల్లా ఎస్పీ జి.జానకి షర్మిల అన్నారు.శుక్రవారం నిర్మల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా రోడ్డు భద్రతా సమావేశంలో వారు పాల్గొని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు వేగ నియంత్రణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రహదారులపై అక్రమ పార్కింగ్, ఆక్రమణలను తొలగించాలని, పశువులు రోడ్లపై సంచరించకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖల అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిరంతరం ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా వాహన తనిఖీలు ముమ్మరం చేస్తున్నామని, మద్యం సేవించి వాహనాలు నడిపేవారు, హెల్మెట్ ధరించకుండా ప్రయాణించేవారు, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపేవారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్ కు దూరంగా ఉండాలని ఎస్పీ సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లలో ప్రయాణించేవారు సీటు బెల్టు తప్పనిసరిగా ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని తెలిపారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్, ఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకట మాధవరావు, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, డీఎస్పీ శ్రీనివాస్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రాజేందర్, రహదారులు, భవనాల శాఖ ఈఈ సుభాష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అవినీతి గురించి కేటీఆర్ మాట్లాడటం విడ్డూరం

- గాంధీపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టిన పొన్నం ప్రభాకర్
- పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క గ్రూప్-1 నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదని విమర్శ
- కాంగ్రెస్‌కు హామీలు ఇవ్వడమే కాకుండా అమలు చేసే సత్తా ఉందని స్పష్టీకరణ

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై తెలంగాణ బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' ద్వారా స్పందించిన ఆయన, ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ గురించి మాట్లాడే నైతిక అర్హత కేటీఆర్‌కు లేదంటూ ఘాటుగా బదులిచ్చారు. దేశం కోసం ఎన్నో త్యాగాలు చేసిన ఘన చరిత్ర గాంధీ కుటుంబానిదని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో నిరుద్యోగులను పూర్తిగా విస్మరించిందని పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. "పదేళ్లు అధికారంలో ఉండి ఒక్క గ్రూప్-1 నోటిఫికేషన్ అయినా ఇచ్చారా?" అంటూ కేటీఆర్‌పై మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రూప్-1 నోటిఫికేషన్ ఇవ్వడమే కాకుండా, పకడ్బందీగా పరీక్షలు కూడా నిర్వహించిందని వివరించారు. కాంగ్రెస్‌కు హామీలు ఇవ్వడమే కాదు.. వాటిని అమలు చేసే సత్తా కూడా ఉందని స్పష్టం చేశారు. అవినీతి గురించి కేటీఆర్ మాట్లాడటం వింతగా ఉందని మంత్రి ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఫార్ములా ఈ రేస్ వ్యవహారం, కాళేశ్వరం ప్రాజెక్టు, విద్యుత్ కొనుగోళ్లు, అసైన్డ్ భూముల కేటాయింపుల్లో జరిగిన అక్రమాలకు కేటీఆర్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. నేరెళ్లలో దళితులపై దాడులు, ఖమ్మంలో రైతులకు సంకెళ్లు వేయడం, మల్లన్నసాగర్ నిర్వాసితులపై లాఠీఛార్జ్ వంటి ఘటనలు బీఆర్ఎస్ పాలన వైఫల్యాలకు నిదర్శనాలని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు.

## సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలి : జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



(ఆదిలాబాద్‌టౌన్, సాక్షర): ప్రస్తుత డిజిటల్ యుగంలో ఆన్ లైన్ లావాదేవీలు పెరుగుతున్న నేపథ్యంలో సైబర్ నేరగాళ్లు వివిధ పద్ధతుల్లో ప్రజలను మోసం చేస్తున్నారని, ప్రతి ఒక్కరూ సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని, సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్ లైన్ కు ఫిర్యాదు చేయాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు.జిల్లాలో మొత్తం 24 సైబర్ నేరాలకు సంబంధించిన ఫిర్యాదులు నమోదైనట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ తెలిపారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో ఆన్ లైన్ లావాదేవీలు పెరుగుతున్న నేపథ్యంలో సైబర్ నేరగాళ్లు వివిధ పద్ధతుల్లో ప్రజలను మోసం చేస్తున్నారని, ప్రతి ఒక్కరూ సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తత అవసరం... గుర్తుతెలియని వ్యక్తులు పంపే లింకులను క్లిక్ చేయవద్దని, అనుమానాస్పద యాప్ లను ఇన్ స్టాల్ చేయవద్దని జిల్లా ఎస్పీ సూచించారు. బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీ, యూపీఐ పిన్ వంటి వివరాలను ఎవరికీ వెల్లడించవద్దని తెలిపారు. ఆన్ లైన్ లో వస్తువులు కొనుగోలు చేసేటప్పుడు విక్రేత వివరాలు పరిశీలించి మాత్రమే చెల్లింపులు చేయాలని సూచించారు.సైబర్ నేరానికి గురైన బాధితులు ఆలస్యం చేయకుండా వెంటనే జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నంబర్ 1930 కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని జిల్లా ఎస్పీ సూచించారు. www.cybercrime.gov.in వెబ్ సైట్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. మోసానికి సంబంధించిన ఫోన్ నంబర్లు, మెసేజ్ లు, లావాదేవీల వివరాలు, స్క్రీన్ షాట్ లు వంటి ఆధారాలను భద్రపరచుకోవాలని సూచించారు.ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండటంతో పాటు ఇతరులకు కూడా అవగాహన కల్పించాలని, సైబర్ నేరాల నివారణకు పోలీసులకు సహకరించాలని కోరారు.

## చేయూత పెన్షన్లు మంజూరు చేయడం హర్షనీయం..

- దుర్గం రవీందర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి



(రెబ్బెన,సాక్షర:) కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన కొత్త లబ్ధిదారులకు చేయూత,సామాజిక భద్రత పెన్షన్లు మంజూరు చేయడం హర్షణీయమని కాంగ్రెస్ పార్టీ కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా అధికార ప్రతినిధి దుర్గం రవీందర్ అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు.వృద్ధులు,వితంతువులు, దివ్యాంగులు,ఇతర అర్హులైన లబ్ధిదారులకు పెన్షన్లు అందించడం ద్వారా వారి జీవనానికి ఆర్థిక భరోసా కల్పించినట్లవుతుందని,పెన్షన్లు కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాకుండా పేద,బలహీన వర్గాల ఆత్మగౌరవంతో కూడిన జీవనానికి తోడ్పడతాయని తెలిపారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.గతంలో పెన్షన్ల కోసం ఎదురుచూసిన కొత్త లబ్ధిదారులకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఎంతో ఊరటనిస్తుందని ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.తెలంగాణ ప్రజల అభివృద్ధి,పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని తెలిపారు.

## సీఎం పర్యటన

- సభా వేదిక ప్రాంగణాన్ని పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ



సీఎం రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా సభా వేదిక ప్రాంగణాన్ని జిల్లా కలెక్టర్ కె. హైమావతి, కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎస్. రష్మీ పెరుమాళ్ తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారీ బహిరంగ సభ ప్రాంగణానికి ముందుగా అనుకున్న జిల్లా కేంద్రం నాగదేవత గుడి నుండి సిరిసిల్ల వెళ్ళే బైపాస్ రోడ్ వెంబడి గల స్థలాన్ని కొన్ని అనివార్య కారణాల వల్ల మార్చి నాగదేవత గుడి ముందు భాగంలోని నందాల వెంకట లక్ష్మి గార్డెన్ వెనకాల బైపాస్ మరియు చిన్నగుండవెల్లి రోడ్ కి ఆనుకొని దాదాపు 16 ఎకరాల స్థలంలో ముఖ్యమంత్రి భారీ బహిరంగ సభ ప్రాంగణానికి సంబంధించిన స్థలాన్ని ఎంపిక చేసినట్లు తెలిపారు. స్థలం బౌండరీలను ఫిక్స్ చెయ్యాలని సర్వే రెవెన్యూ అధికారులను, గ్రౌండ్ మొత్తం చెట్లపొదలు, పిచ్చి మొక్కలు లేకుండా డోజర్ తో శుభ్రం చేయాలని మున్సిపల్ కమిషనర్ ఆదేశించారు. క్లీన్ చేశాక సభ వేదిక, వివిఐపి పార్కింగ్, మీడియా గ్యాలరీ, ప్రజా ప్రతినిధులు ప్రజలు కూర్చునేందుకు సిట్టింగ్ అరేంజ్మెంట్స్, బస్సులు ఇతర వాహనాల పార్కింగ్ మిగతా ప్రక్రియకు సంబంధించి ఒక మ్యాప్ ను సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ మరియు రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ ప్రక్రియ అతి త్వరగా తయారుచేయాలని పనులు యుద్ధ ప్రాతిపదకన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ సదానందం, ఏసిపి రవీందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, తాసిల్దార్ హరి కిరణ్, సర్వే, పోలీస్, ఇంజనీరింగ్, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఏ రాష్ట్రానికి మైలేజ్....

- తెలుగు రాష్ట్రాల్లో సమ్మిట్ కోలాహలం

(హైదరాబాద్, సాక్షర): తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణల మధ్య పారిశ్రామిక పురోగతి, గ్లోబల్ పెట్టుబడుల సాధనలో సరికొత్త ఆరోగ్యకరమైన పోటీ వాతావరణం నెలకొంది. రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు దాదాపు ఒకే సమయంలో మెగా పెట్టుబడుల సదస్సులను నిర్వహిస్తుండటం కార్పొరేట్ రంగాన్ని ఆకర్షిస్తోంది. తెలంగాణలోని ఎనుముల రేవంత్ రెడ్డి సర్కార్ హైదరాబాద్‌లోని హైటెక్స్ వేదికగా ప్రసిద్ధ భారత్ సమ్మిట్ 2026 ను నిర్వహిస్తుండగా.. అటు ఆంధ్రప్రదేశ్‌లో నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం నవంబర్ విశాఖపట్నం వేదికగా ప్రతిష్టాత్మక 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సు ను ఎంతో వైభవంగా నిపుణులతో నిర్వహిస్తోంది. రెండు సదస్సుల లక్ష్యం ఒక్కటే—అంతర్జాతీయ పారిశ్రామిక దిగ్గజాలను ఆకట్టుకుని వేల కోట్ల రూపాయల పెట్టుబడులను తమ వైపు తిప్పుకోవడమే.ఒకే సమయంలో ఇరు రాష్ట్రాల్లో సమ్మిట్‌లు జరగనుండటంతో సహజంగానే మీడియా, కార్పొరేట్ వర్గాల్లో పోలికలు తీవ్రమయ్యాయి. ఆంధ్రప్రదేశ్ నిర్వహించే సీఐఐ భాగస్వామ్య సదస్సుకు కేంద్ర హోంమంత్రి పీయూష్ గోయల్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న అంతర్జాతీయ బహుళజాతి కంపెనీల సీఈఓలు, దౌత్యవేత్తలు హాజరవుతున్నారు. సముద్ర తీర ప్రాంతం, డెస్టినీ సిటీ ఆధారంగా విశాఖను గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ హబ్‌గా ప్రతిపాదించి దాదాపు రూ. 11 లక్షల కోట్ల విలువైన అవగాహన ఒప్పందాలు కుదుర్చుకోవడమే లక్ష్యంగా చంద్రబాబు సర్కార్ వ్యూహాలు రచిస్తోంది. మరోవైపు, తెలంగాణ నిర్వహించే భారత్ సమ్మిట్‌లో 70కి పైగా దేశాల నుంచి 1,000 మందికి పైగా ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, గ్లోబల్ పాలసీ మేకర్స్ పాల్గొంటున్నారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో గ్లోబల్ ఈక్విటీ, సాంకేతికత, ఫ్యూచర్ సిటీ కాన్సెప్ట్‌లతో గ్లోబల్ బ్రాండ్‌లను ఆకర్షించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నారు. హైదరాబాద్ ఇప్పటికే పొందిన ఐటీ అండ్ ఫార్మా గ్లోబల్ అడ్వాంటేజ్‌ను మరింత ముందుకు తీసుకెళ్తూ గ్రీన్ ఎనర్జీ, ఏఐ, స్పేస్ టెక్నాలజీ విభాగాలలో వేల కోట్ల పెట్టుబడులను సాధించడమే తెలంగాణ వ్యూహంగా ఉంది.ఈ రెండు సమ్మిట్‌ల పోలికలో మౌలిక సదుపాయాలు, ఎకోసిస్టమ్స్ ప్రధాన వ్యూహాత్మక భిన్నత్వాలుగా నిలుస్తున్నాయి. తెలంగాణ తన ప్రపంచ శ్రేణి హైదరాబాద్ నగర మౌలిక వసతులు, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు , వేగవంతమైన అనుమతుల వ్యవస్థలను ప్రధాన ఆయుధాలుగా ఉపయోగిస్తుంటే.. ఆంధ్రప్రదేశ్ తన విస్తారమైన సముద్ర తీరం, పోర్టు ఆధారిత రవాణా, గ్రీన్ హైడ్రోజన్, స్పేస్ టెక్నాలజీ హబ్‌లను చూపుతూ మల్టీనేషనల్స్ కంపెనీలకు ఆకర్షణీయమైన ప్రాధాన్యతలను అందిస్తోంది. కార్పొరేట్ సంస్థల కోణంలో చూస్తే, ఈ రేసు ద్వారా రెండు రాష్ట్రాలకు పెట్టుబడులు రావడం దేశానికే ప్రయోజనకరంగా మారుతోంది. అయితే ఏ రాష్ట్రం ఎంత సులభతర వాణిజ్యం , సింగిల్ విండో విధానం , స్థిరమైన నిధులు అందిస్తుందనే అంశంపైనే ఒప్పందాల కార్యరూపం ఆధారపడి ఉంటుంది. పెట్టుబడుల సమ్మిట్ వేదికపై ఎవరి ఒప్పందాల సంఖ్య ఎంత, ఏ రాష్ట్రం అధిక గ్లోబల్ జెయింట్స్‌ను తమ భూభాగంలోకి ఆహ్వానిస్తుందో రాబోయే రోజుల్లో తేలాల్సి ఉంది. తెలుగు రాష్ట్రాల మధ్య నెలకొన్న ఈ పెట్టుబడుల పోటీ రాజకీయ రంగానికి అతీతంగా అభివృద్ధికి కొత్త గమనకాలాన్ని ఇస్తోంది. విశాఖపట్నం పోర్టు లోకేషన్ బలం కాగా, హైదరాబాద్ ఆవిష్కరణల నెట్‌వర్క్ తెలంగాణకు అడ్వాంటేజ్. నవంబర్ రెండో వారంలో వెలువడే పెట్టుబడుల ఒప్పందాలు రాబోయే రోజుల్లో ఏపీ, తెలంగాణ రాజకీయ శ్రేణుల మైలేజ్‌ను శాసించే ప్రధాన కారకాలుగా నిలవబోతున్నాయని అనుకోవచ్చు.

## మాజీ ఎమ్మెల్యే చొరవతో పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు

- ఇండ్ల నిర్మాణానికి భూమిపూజ
  నారాయణరావు పటేల్‌కు గ్రామస్తుల కృతజ్ఞతలు



(కుబీర్, సాక్షర) కుబీర్ మండలంలోని సిర్పెల్లి తండా-3లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. ముధోల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే భోస్లే నారాయణరావు పటేల్ ప్రత్యేక చొరవతో అర్హులైన పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడంతో లబ్ధిదారుడి కుటుంబంలో ఆనందం వ్యక్తమైంది. ఈ సందర్భంగా గ్రామ కార్యదర్శి సంతోష్ రెడ్డి, సర్పంచ్ క్రాంతి రాజ్ చౌహాన్, వార్డు సభ్యులు, గ్రామస్తుల సమక్షంలో భూమిపూజ కార్యక్రమం నిర్వహించి ఇంటి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. సొంత ఇల్లు లేని నిరుపేద కుటుంబానికి ప్రభుత్వ పథకం ద్వారా ఇంటి కల సాకారం కావడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. పేదల సంక్షేమం, అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందించడంలో మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్ చూపుతున్న చొరవ అభినందనీయమని గ్రామస్తులు పేర్కొన్నారు. తమకు అండగా నిలిచి ఇందిరమ్మ ఇల్లు అందేలా కృషి చేసిన నారాయణరావు పటేల్‌కు లబ్ధిదారుడి కుటుంబ సభ్యులు, సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# డిజిటల్ వార్‌లో డీసెంట్ పాలిటిక్స్!

రాజకీయాల్లో గెలవాలంటే వ్యక్తిగత దూషణలు, ట్రోలింగ్‌లు తప్పనిసరా? ఆదిలాబాద్ జిల్లా సోషల్ మీడియా రంగం ఇప్పుడు దీనికి సానుకూల సమాధానం ఇస్తోంది. డేటా రిపోర్టల్ డిజిటల్ 2027 నివేదిక (2026 అక్టోబర్ డేటా)ప్రకారం భారతదేశంలో 57.3 కోట్ల సోషల్ మీడియా యూజర్ ఐడెంటిటీలు నమోదయ్యాయి. ఈ వేగవంతమైన డిజిటల్ విస్తరణలో పుండ్ర రవికిరణ్ రెడ్డి, పిడుగు స్వామి యాదవ్‌లు కేవలం జైనథ్ మండలానికే పరిమితం కాకుండా, రాష్ట్ర స్థాయి సోషల్ మీడియాలో కీలక పాత్ర పోషిస్తూ వ్యక్తిగత విమర్శలకు దూరంగా, విశ్లేషణాత్మక కంటెంట్‌తో కొత్త హుందాను నిరూపిస్తున్నారు. వాస్తవాలు, విశ్లేషణలే వారి బలం రవికిరణ్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వ గ్యారంటీలు, సంక్ష

# రేవంత్‌రెడ్డి పాలనలో రైతన్న బతుకులు ఆగం



- =నెల రోజులైనా ప్రారంభంకాని ధాన్యం కొనుగోలు కేంద్రాలు
- రైతుల కష్టాలు చూస్తుంటే కన్నీళ్లు వస్తున్నాయి:
- చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

(చొప్పదండి, సాక్షర): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిండని కాంగ్రెస్ పాలనలో రైతన్నల బతుకులను ఆగం చేస్తున్నారని చొప్పదండి నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం కురిక్యాల గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం చొప్పదండి నియోజకవర్గం మాజి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ సందర్శించి రైతులతో మాట్లాడారు. నెల రోజుల క్రితమే ధాన్యం కళ్లాల్లో పోసినా ఇప్పటివరకు ఒక్క ఎత్తు కూడా కొనుగోలు చేయకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం సన్న వడ్లు పండించాలని సూచిస్తే రైతులు సన్న వడ్లు పండించారని, తీరా పంట చేతికొచ్చాక వాటిని కొనేవారు లేక రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేయడం లేదని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనూ ధాన్యం సేకరణ ప్రారంభం కాలేదని మండిపడ్డారు. కేసీఆర్ పాలనలో రైతులకు ఇలాంటి దుస్థితి ఎప్పుడూ రాలేదని గుర్తుచేశారు. ఆనాడు ముఖ్యమంత్రి కేసీఆర్ నెల రోజుల ముందుగానే సమీక్షలు నిర్వహించి, జిల్లా కేంద్రాల్లో మంత్రులు, నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలతో సమావేశాలు పెట్టి ధాన్యం కొనుగోళ్లకు ముందస్తు ఏర్పాట్లు చేయించేవారని తెలిపారు. రైస్‌మిల్లులను కేటాయించి, హమాలీలు, ఐకేపీ సిబ్బందిని అప్రమత్తం చేసి ధాన్యం పోసిన వారం, పది రోజుల్లోనే కొనుగోళ్లు జరిగేలా చర్యలు తీసుకునేవారన్నారు. ధాన్యం తడిసినా, మొలకెత్తినా రైతులకు నష్టం జరగకుండా ప్రభుత్వం కొనుగోలు చేసేదని పేర్కొన్నారు.గతంలో కాంగ్రెస్ పాలనలో దళారుల చేతుల్లో రైతులు మోసపోయారని, ఇప్పుడు మళ్లీ దరిద్రుడు రేవంత్‌రెడ్డి అదే పరిస్థితిని తీసుకొచ్చారని విమర్శించారు. రైతుల పంటను దళారులకు అప్పగించేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఒకవైపు సాగునీరు అందక, మరోవైపు విద్యుత్ కోతలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, కరెంటు లేక మోటార్లు కాలిపోతూ, స్టార్టర్లు పేలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సన్న వడ్లకు బోనస్ ఇస్తామని చెప్పి ఇప్పుడు కొనుగోళ్లే చేపట్టకపోవడం వెనుక బోనస్ ఎగ్గొట్టే ఉద్దేశం ఉందా అని ప్రశ్నించారు.

# మత్తు పదార్థాలకు దూరంగా ఉంటేనే వికసిత భారతం సాధ్యం - ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి



(నిర్మల్ ప్రతినిధి, సాక్షర) మత్తు పదార్థాలకు దూరంగా ఉంటేనే వికసిత భారతం సాధ్యమని ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి అన్నారు. నిర్మల్ పట్టణంలోని డిగ్రీ కళాశాలలో 'మత్తు పదార్థాలకు దూరంగా యువత - వికసిత భారతం' అంశంపై యువ పార్లమెంట్ కార్యక్రమంలో బీజేపీ శాసనసభాపక్ష నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతలో మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. యువత తమ శక్తి సామర్థ్యాలను దేశాభివృద్ధికి వినియోగించాలని పిలుపునిచ్చారు.మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణంలో యువత చురుకైన పాత్ర పోషించాలని, ఆరోగ్యవంతమైన యువతతోనే అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణం సాధ్యమవుతుందని సందేశం ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు జమాల్, జిల్లా యువజన అధికారి రమేష్, కౌన్సిలర్లు సాదం అరవింద్, గంజి రాజు, జింక సురేందర్, శ్రీరామోజీ నరేష్, కూన శశాంక్, ఈశ్వర్, బీజేపీ నాయకులు కందుల హరీష్, భరత్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# 2028 జూన్ 2 నాటికి కోహెడ మార్కెట్

(హైదరాబాద్, సాక్షర): గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ప్రజల అవసరాలు, రైతులకు మెరుగైన మార్కెటింగ్ సదుపాయాలు కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న కోహెడ ఇంటిగ్రేటెడ్ ఫ్రూట్ మార్కెట్ నిర్మాణ పనులు వేగవంతమయ్యాయి. హైదరాబాద్ శివారులోని రంగారెడ్డి జిల్లా కోహెడలో ఔటర్ రింగ్ రోడ్డుకు ఆనుకుని దాదాపు 239 ఎకరాల విశాలమైన స్థలంలో ఈ మార్కెట్‌ను ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. ఆసియాలోనే అత్యంత ఆధునిక ప్రమాణాలతో కూడిన పండ్ల మార్కెట్‌గా దీనిని తీర్చిదిద్దుతున్నారు.తాజాగా ఈ ప్రాజెక్ట్ పురోగతిపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సంబంధిత అధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిని సమీచించిన ఆయన, నిర్మాణ పనులకు సంబంధించి స్పష్టమైన గడువులను నిర్దేశించారు. ఈ మెగా ప్రాజెక్ట్‌కు సంబంధించిన మొదటి దశ పనులను 2027 మార్చి నాటికి పూర్తి చేయాలని, అలాగే 2028 జూన్ 2 నాటికి మొత్తం ప్రాజెక్ట్‌ను పూర్తిగా అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ నాణ్యతలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడవద్దని, ఒకవేళ పనుల్లో జాప్యం జరిగితే కాంట్రాక్ట్ సంస్థలపై కఠిన చర్యలు తీసుకునేలా నిబంధనలను సవరించాలని సూచించారు. అంతేకాకుండా, ఈ పనులను నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రత్యేక అధికారిని కూడా ప్రభుత్వం నియమించింది.కొత్తపేట గడ్డిఅన్నారం మార్కెట్ స్థానంలో ప్రత్యామ్నాయంగా వస్తున్న ఈ కోహెడ మార్కెట్‌ను ఫ్రాన్స్‌లోని ప్రముఖ రంగిస్ మార్కెట్ తరహాలో అత్యున్నత వసతులతో డిజైన్ చేస్తున్నారు. పండ్ల నిల్వ కోసం అత్యాధునిక కోల్డ్ స్టోరేజ్ యూనిట్లు, భారీగా విక్రయాలు జరిపేందుకు వీలుగా ట్రేడింగ్ హాళ్లు, దేశీయ, అంతర్జాతీయ రవాణాకు అనుకూలమైన రోడ్డు కనెక్టివిటీ వంటి సమగ్ర మౌలిక సదుపాయాలు ఇందులో కల్పిస్తున్నారు.ఈ మార్కెట్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే తెలంగాణ రైతులు తమ ఉత్పత్తులను దేశ విదేశాలకు ఎగుమతి చేసుకునేందుకు గొప్ప వేదిక లభిస్తుందని ప్రభుత్వం ఆశిస్తోంది. ప్రాజెక్ట్ సకాలంలో పూర్తయ్యేలా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించడంతో రైతులు, వ్యాపారుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

# నీటి లభ్యతకు తగ్గట్టే రబీ ప్రణాళిక..

- వరి తగ్గించి... ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను మళ్లించాలి : సీఎస్ సంజయ్ జాజు



(ఆదిలాబాద్ ప్రతినిధి, సాక్షర) రబీ 2026-27 సీజన్ లో ప్రాజెక్టుల్లో నీటి లభ్యతను బట్టే పంటల సాగు ప్రణాళిక రూపొందించాలని, నీరు తక్కువగా ఉన్న చోట వరి తగ్గించి, ఉద్యాన పంటలు, ఆయిల్ పామ్ వంటి ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను ప్రోత్సహించాలని, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో వరి సాగును తగ్గించి, ఉద్యాన పంటలు, ఆయిల్ పామ్ వంటి ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు రైతులను ప్రోత్సహించాలని సూచించారు.శుక్రవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో వ్యవసాయ ప్రణాళిక, ధాన్యం కొనుగోళ్లు, విద్యాశాఖ, విద్యా మౌలిక సదుపాయాలు, భూసేకరణ, వీధి కుక్కల నియంత్రణ, వీబీ-గ్రామ్‌జి పనుల పురోగతిపై సీఎస్ సమీక్షించారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షా కలెక్టరేట్ నుంచి ఈ సమావేశంలో పాల్గొన్నారు.రైతులకు నీటి లభ్యతను బట్టి పంటల ఎంపికపై అవగాహన కల్పించాలని, పంటల వైవిధ్యీకరణతో పాటు సూక్ష్మ సేద్య పద్ధతులను ప్రోత్సహించాలని సీఎస్ సూచించారు. రైతు ఐడీ నమోదు, కస్టమ్ హైరింగ్ కేంద్రాల ఏర్పాటు, ఖరీఫ్ ఉత్పాదకత పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని, ప్రైవేటు వ్యాపారులకు ధాన్యం విక్రయించిన రైతులకు సైతం కనీస మద్దతు ధరతో పాటు క్వింటాలుకు రూ.500 బోనస్ అందేలా చూడాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలను ముందుగానే సిద్ధం చేసి రైతుల వివరాల నమోదు పూర్తి చేయాలన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరును ఎఫ్‌ఆర్ఎస్ విధానం ద్వారా పర్యవేక్షిస్తూ కనీసం 90 శాతానికి పెంచాలని సూచించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల మెరుగుదలకు డిజిటల్ అభ్యసన వేదికలను వినియోగించుకోవాలన్నారు.రూసా 2.0, పీఎం ఉషా, సమగ్ర శిక్ష అభియాన్, పీఎం శ్రీ పథకాల కింద చేపట్టిన పనులను వేగవంతం చేసి, మంజూరైన నిధులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.11 వేల కోట్లతో చేపట్టిన 87 యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణ పనులను, రూ.1,108 కోట్లతో మంజూరైన 115 తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. సాగునీటి ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, అభివృద్ధి పనులకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా చూడాలని స్పష్టం చేశారు.వీధి కుక్కల నియంత్రణకు సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని, జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో కుక్కలను గుర్తించి నిబంధనల ప్రకారం పునరావాస కేంద్రాలకు తరలించాలని సూచించారు. వీబీ-గ్రామ్‌జి పథకం కింద నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపునకు దోహదపడే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని, కాలువల శుభ్రతతో పాటు ఇతర పనులను సకాలంలో పూర్తి చేయాలని సీఎస్ ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్లు ఆర్.ఎస్. చిత్రు, రాజేశ్వర్, ఆర్డీవో జగదీశ్వర్ రావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణ బార్ కౌన్సిల్ చేరిన 690 మంది న్యాయ పట్టభద్రులు

- తాత్కాలిక నమోదు కమిటీచే ప్రమాణ స్వీకారం

(హైదరాబాద్, సాక్షర): తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ నూతనంగా ఎన్నికైన కార్యవర్గం ఈరోజు 690 మంది న్యాయ పట్టభద్రుల లాంఛన నమోదును నిర్వహించింది. వీరిలో 657 మంది పట్టభద్రులు తాత్కాలిక నమోదు కమిటీ పర్యవేక్షణలో తమ వృత్తిపరమైన ప్రమాణాన్ని స్వీకరించారు. భారత బార్ కౌన్సిల్ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ కమిటీలో తెలంగాణ బార్ కౌన్సిల్ చైర్మన్ సమూల రామ్ రెడ్డి, వైస్-ఛైర్మన్ వెంకట్ యాదవ్ చాలకాని, సభ్యులు జి. కిరణ్ కుమార్ ఉన్నారు. రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బి. విజయసేన్ రెడ్డి, జస్టిస్ జువ్వాది శ్రీదేవి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరయ్యారు. న్యాయమూర్తులు మాట్లాడుతూ తమ సుదీర్ఘ న్యాయ ప్రస్థానాన్ని వివరించారు. ప్రాక్టీసింగ్ న్యాయవాదులుగా న్యాయమూర్తులుగా తమకున్న అపారమైన అనుభవాన్ని ఉపయోగించి, కొత్తగా ప్రవేశించేవారికి స్ఫూర్తినిచ్చి, మార్గనిర్దేశం చేశారు. తరువాత, బార్ కౌన్సిల్ సభ్యులు అశోక్ గౌడ్ పొన్నం, మహేష్ కుమార్ ఆకుల, అనంతసేన్ రెడ్డి ఆకుల, సునీల్ గౌడ్.కె, రఘునాథ్ వెరోస్, జగదీశ్వర రావు.డి, రామారావు గోకుల్, రాఘవులు.డి, భాను చంద్రిక.సిహెచ్, సుజాత పాశం, సునీత.బి, జ్యోతి జాదవ్ ఈ కార్యక్రమానికి హాజరైయారు.

# కొమరం భీం కాలనీలో ప్రజాకవి కాళోజీ నారాయణరావు వర్ధంతి



(ఆదిలాబాద్, సాక్షర): తుడుం దెబ్బ మావల మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రజాకవి కాళోజీ నారాయణరావు వర్ధంతిని ఘనంగా జరుపుకొని నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షులు గోడం గణేష్ మాట్లాడుతూ కాళోజీ నారాయణరావు 1914 సెప్టెంబర్ 9న జన్మించి 2002 నవంబర్ 13న మరణించారు. తన జీవితమంతా ప్రజల కోసం, ప్రజాస్వామ్య విలువల కోసం, సామాజిక న్యాయం కోసం పోరాడిన గొప్ప వ్యక్తి. అందుకే ఆయనను ప్రజలు ప్రేమగా ప్రజాకవి, కాళన్న అని పిలుచుకున్నారు.కాళోజీ నారాయణరావు కేవలం కవి మాత్రమే కాదు, ప్రజల కష్టాలను తన కవిత్వంలో ప్రతిబింబించిన సామాజిక చైతన్యవాది. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమాల్లో పాల్గొని జైలు జీవితాన్ని కూడా అనుభవించారు. స్వాతంత్ర్య ఉద్యమం, ఆర్యసమాజ ఉద్యమం, గ్రంథాలయ ఉద్యమం, ఆంధ్ర మహాసభ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొన్నారు.సమాజంలో కొనసాగుతున్న కుల వివక్ష, అంటరానితనం, పేదరికం, దోపిడీ, అన్యాయాలపై తన కలం ద్వారా నిరంతరం పోరాటం చేశారు. అధికారం ముందు తలవంచకుండా ప్రజల పక్షాన నిలబడి ప్రశ్నించే ధైర్యాన్ని తన రచనల ద్వారా చాటిచెప్పారు.కాళోజీ రచించిన 'నా గొడవ' తెలుగు సాహిత్యంలో ప్రత్యేక గుర్తింపు పొందింది. ఆయన రచనలు సామాన్య ప్రజల జీవితాలను, వారి బాధలను, ఆకాంక్షలను, ఆవేదనలను ప్రతిబింబించాయి. తెలంగాణ మాండలిక భాషకు, యాసకు, సంస్కృతికి తన రచనల ద్వారా విశేష గౌరవాన్ని తీసుకొచ్చారు.తెలుగు మాత్రమే కాకుండా తదితర భాషల సాహిత్యంతోనూ అనుబంధం కలిగి ఉండి అనువాద రంగానికి సేవలందించారు. ఆయన సాహిత్య సేవలకు గుర్తింపుగా 1992లో భారత ప్రభుత్వం పద్మవిభూషణ్ పురస్కారంతో గౌరవించింది.అదేవిధంగా కాళోజీ తెలంగాణ ప్రజల భాష, యాస, సంస్కృతి, ఆత్మగౌరవం కోసం జీవితాంతం కృషి చేశారు. ప్రజల హక్కులను కాపాడటం, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడం, అణగారిన వర్గాలకు న్యాయం జరగాలని కోరుకోవడం ఆయన జీవిత లక్ష్యాలుగా నిలిచాయి.ఆయన ఆశయాలు నేటికీ ఆదివాసీలు, దళితులు, బహుజనులు, కార్మికులు, రైతులు, పేద ప్రజల హక్కుల పోరాటాలకు స్ఫూర్తినిస్తున్నాయి.ఆయన చూపిన మార్గంలో నడుస్తూ సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం, మానవ హక్కులు, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరుతున్నాం.ప్రజల కోసం బతికిన మహనీయుడు కాళోజీ. ప్రజల గొంతుకగా నిలిచిన ప్రజాకవి కాళోజీ. ఆయన ఆశయాలు అజరామరం. ఆయన పోరాట స్ఫూర్తి తరతరాలకు ఆదర్శం.కార్యక్రమంలో గోడం గణేష్, తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షులు, అర్కా శేషారావు రాష్ట్ర కార్యదర్శి, గోడం రేణుక ఆదివాసి మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉయిక ఇందిరా మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి, ఆత్రం గణపతి డివిజన్ అధ్యక్షులు, వెడ్మ ముకుందరావు మావల మండల అధ్యక్షుడు, కుమర గోవిందరావు, కనక మనోహర్, సీడం ప్రభు, కొమురమల్కు తదితరులు పాల్గొన్నారు.

## కూల్చివేతలను తీవ్రంగా ఖండిస్తున్నాం ఎంపి ఈటల

(మల్కాజిగిరి, సాక్షర): మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని ఫాక్స్ సాగర్ చెరువు చుట్టూ ప్రాంతంలో నివాసం ఉంటున్న పేద, మధ్యతరగతి ప్రజల ఇళ్లపై హైడ్రా పేరుతో జరుగుతున్న దౌర్జన్యాలు, కూల్చివేతలను తీవ్రంగా ఖండిస్తున్నామని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు రీ ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. ఫాక్స్ సాగర్ బాధితుల ఆవేదనను స్వయంగా తెలుసుకునేందుకు బాధితుల పక్షాన నిలబడి ఆయన మాట్లాడారు. ప్రభుత్వ వేధింపులు, హైడ్రా చర్యలు మరియు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, హైడ్రా కమిషనర్ రంగనాథ్ తీరుపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 1995 నాటికే సర్వే నంబర్ 121లో 10 ఎకరాలు, సర్వే నంబర్ 124, 125, 126లలో 22.5 ఎకరాలు కలిపి మొత్తం 32.5 ఎకరాల భూమిని ఆర్మూర్ వాసులు మరియు ఇతరులు కొనుగోలు చేశారు. అప్పట్లో ఈ ప్రాంతం మున్సిపాలిటీ కాదు.. దూలపల్లి, కొంపల్లి, మేడ్చల్, శామీర్‌పేట గ్రామపంచాయతీల పరిధిలోని పెరిఫెరల్ ఏరియా. అప్పట్లోనే గజం రూ. 1,000 నుంచి రూ. 5,000 వరకు వెచ్చించి కొనుక్కున్నారు. ఆనాడు హైటెక్ సిటీ ప్రాంత భూముల ధరల కంటే ఇక్కడే భూముల విలువ ఎక్కువ ఉండేది. గ్రామపంచాయతీ లేఅవుట్లు, నిబంధనల ప్రకారమే ఇక్కడ కొనుగోళ్లు జరిగాయి. ఇక్కడ ఇళ్లు కట్టుకున్న వారు కొందరైతే, పిల్లల పెళ్లిళ్ల కోసం కట్నం కింద ఇచ్చిన వారు, తదుపరి అమ్ముకున్న వారు ఉన్నారు. 1995 నుండి నేటి వరకు రెండు, మూడు సార్లు చేతులు మారిన ఆస్తులు ఇవి. ఎల్ఆర్ఎస్ (LRS) కూడా చెల్లించుకున్న ఈ ప్రాంతంలో, 2014 కంటే పూర్వం ఉన్న ఇండ్ల జోలికి రామని చెప్పి మాట తప్పుతూ హైడ్రా కూల్చివేతలకు పాల్పడటం అత్యంత దారుణం. 406 ప్లాట్లలో ఇళ్లు కట్టుకుని 30-35 ఏళ్లుగా జీవిస్తున్న 406 మంది ప్రధాన బాధితుల ఆక్రందనలు వింటేనే ప్రభుత్వ అరాచకం ఏంటో అర్థమవుతుంది. రాజ్యాంగానికి లోబడి పనిచేయాల్సిన ఐపీఎస్ అధికారి రంగనాథ్.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చెంచాగిరి చేస్తూ, ఆయన ప్రాపకం పొందేందుకు ఇలాంటి దుర్మార్గాలకు పాల్పడుతున్నారు. కోర్టుల తీర్పులు, స్టేలను కూడా లెక్కచేయకుండా రంగనాథ్ వ్యవహరిస్తున్న తీరు న్యాయమూర్తులను, చట్టాన్ని అవమానించేలా ఉంది. రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకే ఇదంతా జరుగుతోందని, సోషల్ మీడియాలో డబ్బా కొట్టించుకుంటూ పేదల జీవితాలతో చెలగాటమాడుతున్నారని విమర్శించారు. గతంలో 1995 లో మరియు మరొక్కసారి చంద్రబాబు నాయుడు, ఆతదుపరి వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి, రోశయ్య, కిరణ్ కుమార్ రెడ్డి, కేసీఆర్ ముఖ్యమంత్రులుగా పనిచేశారు. వాళ్లందరికీ చట్టాలు తెలియదా? చెరువులను కాపాడాలనే సోయి లేదా? కేవలం ఈ ప్రభుత్వ హయాంలోనే పేదల ఇళ్లను కూల్చివేస్తూ రాక్షసానందం పొందుతున్నారని. నిజంగానే చెరువులు బాగు చేయాలనుకుంటే ఇదే

# రిమ్స్ కు అదనంగా 18 పీజీ వైద్య సీట్లు మంజూరు

- జిల్లా కలెక్టర్ రాజర్షి షాను ఘనంగా సన్మానించిన రిమ్స్ వైద్య బృందం



(ఆదిలాబాద్ టౌన్, సాక్షర) ఆదిలాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాల (రిమ్స్)లో వైద్య విద్య, వైద్య సేవలను మరింత బలోపేతం చేసే దిశగా మరో కీలక ముందడుగు పడింది. జిల్లా కలెక్టర్ రాజర్షి షా ప్రత్యేక చొరవ, కృషి ఫలితంగా రిమ్స్ కు అదనంగా 18 పోస్టు గ్రాడ్యుయేట్ (పీజీ) వైద్య సీట్లు మంజూరయ్యాయి.ఈ సందర్భంగా రిమ్స్ డైరెక్టర్ తో పాటు వైద్యుల బృందం శుక్రవారం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో రాజర్షి షాను మర్యాదపూర్వకంగా కలిశారు. పీజీ సీట్ల మంజూరుకు విశేష కృషి చేసిన కలెక్టర్ ను శాలువాతో ఘనంగా సన్మానించి, కృతజ్ఞతలు తెలిపారు.అదనపు పీజీ సీట్లతో రిమ్స్ లో వైద్య విద్యావకాశాలు మెరుగుపడటంతో పాటు, భవిష్యత్తులో నిపుణులైన వైద్యుల తయారీకి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు దోహదపడనుంది.

# బంగాళాఖాతంలో అల్పపీడనం..!

- ఆదివారం నాటికి వాయుగుండంగా మారే అవకాశం..!

ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని ఏపీ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (APSDMA) ఎండీ, ఆర్టీజీఎస్ సీఈఓ ప్రఖర్ జైన్ వెల్లడించారు. ఈ అల్పపీడనం వాయువ్య దిశగా కదులుతూ రేపటికి మరింత స్పష్టమైన అల్పపీడనంగా, ఆదివారం నాటికి వాయుగుండంగా మారే అవకాశం ఉందని తెలిపారు. దీని ప్రభావంతో అండమాన్ సముద్రం, ఆగ్నేయ బంగాళాఖాతంలో గంటకు 40–50 కిలోమీటర్ల వేగంతో, గరిష్ఠంగా 60 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉందని వెల్లడించారు. అల్పపీడనం తదుపరి పయనంపై మరింత స్పష్టత రావాల్సి ఉందని పేర్కొన్నారు. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదని హెచ్చరించారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



(జన్నారం, సాక్షర): మండలంలోని రాంపూర్ గ్రామ యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు.వివరాల్లోకి వెళితే... మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన కుడిది నవీన్ (19) మరో యువకునితో కలిసి తాళ్ళపేట నుంచి హైదరాబాద్ కు ద్విచక్ర వాహనంపై వెళ్లగా సిద్ధిపేట వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో నవీన్ మృతి చెందగా మరో యువకునికి గాయాలు అయినట్లు సమాచారం.

# అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు పూర్తిగా రూపుమాపాలి




• రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్ల కదలికలపై నిఘా కొనసాగాలి : జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

(ఆదిలాబాద్‌టౌన్, సాక్షర) నేర రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్క పోలీసు అధికారి కృషి చేయాలని, విధుల నిర్వహణలో జవాబుదారీతనం, నిజాయితీ అలవర్చుకోవాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ తెలిపారు. శుక్రవారం పోలీసు హెడ్ క్వార్టర్స్ సమావేశ మందిరంలో జిల్లా పోలీసు అధికారులచే నెలవారి నేర సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా పూర్తిగా అసాంఘిక కార్యకలాపాలను రూపుమాపే దిశగా పోలీసు విధులను చేపట్టాలని తెలిపారు. పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని తెలిపారు. జిల్లావ్యాప్తంగా గంజాయి, గుడుంబా, మాదకద్రవ్యాలు, గ్యాంబ్లింగ్, గేమింగ్ లాంటివి జరగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని తెలిపారు.నేరాల నియంత్రణకు, నేర పరిశోధనకు సీసీటీవీ కెమెరాల పాత్ర కీలకంగా వ్యవహరిస్తుందని ప్రతి గ్రామంలో, ప్రతి పట్టణంలో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసే విధంగా ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రోత్సహించాలని తెలిపారు. సైబర్ క్రైమ్ బాధితులకు తిరిగి డబ్బులు అందే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రజలలో పోలీసుల పట్ల నమ్మకం పెంచే విధంగా విధుల నిర్వహణ జరగాలని, విధులలో నీతి, నిజాయితీలు తప్పనిసరిగా కలిగి ఉండాలని తెలిపారు.రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్లను తరచూ తనిఖీ చేస్తూ వారి కదలికలను గమనిస్తూ ఉండాలన్నారు. ముఖ్యంగా మహిళల పట్ల జరిగే నేరాలపై ప్రత్యేక శ్రద్ధ వహించి నిందితులకు చట్టపరంగా శిక్షలు పడే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ ఎలాంటి పెండెన్సీ లేకుండా చూడాలన్నారు. పోలీస్ స్టేషన్ లో వారీగా నమోదైన కేసుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, ప్రతి ఒక్క కేసుపై విచారణ జరిపారు. కోర్టు డ్యూటీ అధికారులతో ప్రతి వారం సమీక్షిస్తూ కోర్టులలో శిక్షలు పడే విధంగా దర్యాప్తులో నాణ్యత ప్రమాణాలను పాటించాలని తెలిపారు. కోర్టులలో సరైన శిక్షలు పడినప్పుడు ప్రజలలో పోలీసుల పట్ల ఉండే నమ్మకం మరింత పెరుగుతుందని సూచించారు.డయల్ 100, బ్లూ కోర్ట్ సిబ్బందిచే గ్రామాలలో విస్తృత అవగాహన కల్పించాలని, సిబ్బంది విధులలో క్రమశిక్షణ, సమయపాలన, నిజాయితీ కలిగి ఉండాలని సూచించారు. పోలీస్ స్టేషన్ లో వివిధ రంగాలలో ప్రతిభ కనబరిచిన సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందజేసి ప్రోత్సహించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.మౌనిక ఐపీఎస్, ఏఎస్పీ రుత్విక్ సాయి కొట్టే ఐపీఎస్, డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి, పోలీస్ కార్యాలయం ఏవో శివ కుమార్, జిల్లావ్యాప్తంగా ఉన్న సర్కిల్ ఇన్స్పెక్టర్లు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, ఎస్సైచ్ఓలు, ఎస్ఐలు, ఐటీ కోర్, డీసీఆర్బీ, పోలీసు కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వైద్యుడు ఉప్పు కృష్ణంరాజు సేవలు అభినందనీయం



(నిర్మల్ ప్రతినిధి, సాక్షర): ప్రజా సేవే పరమావధిగా భావిస్తూ నిరుపేదలకు అండగా నిలుస్తూ, ఆపదలో ఉన్నవారికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తున్న గొప్ప వైద్యుడు ఉప్పు కృష్ణంరాజు.వైద్య వృత్తిని కేవలం వృత్తిగా కాకుండా సేవా మార్గంగా భావిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్న ఆయన సేవలు అభినందనీయమని పేర్కొన్నారు.భారతీయ వైద్య సంఘం నిర్మల్ శాఖ ప్రధాన కార్యదర్శిగా వైద్యుడు ఉప్పు కృష్ణంరాజు ప్రమాణ స్వీకారం చేసిన శుభసందర్భంగా ఫహీం అహ్మద్ ఖాన్ ఆయనను హృదయపూర్వకంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ నూతన బాధ్యతల్లో ఆయన మరింత సమర్థవంతంగా సేవలందిస్తూ వైద్య రంగ అభివృద్ధికి, పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు.సమాజంలో మానవతా విలువలను పెంపొందిస్తూ నిరుపేదల సంక్షేమానికి నిరంతరం అండగా నిలిచే వైద్యుడు ఉప్పు కృష్ణంరాజు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, ఆయన సేవలు మరింత మందికి స్ఫూర్తిగా నిలవాలని ఫహీం అహ్మద్ ఖాన్ ఆకాంక్షించారు.

# జర్నలిస్టులు ప్రజలకు వాస్తవ సమాచారాన్ని అందించాలి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్




(మంచిర్యాల ప్రతినిధి, సాక్షర) ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రతి ఒక్కరికి చేరవేసే పాత్రికేయులు ప్రజలకు వాస్తవ సమాచారాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎం కన్వెన్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ మంచిర్యాల జిల్లా ఆత్మీయ మహాసభకు డి.సి.పి. ఎ.భాస్కర్, యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శి రామ్ నారాయణ, ఐ.జె.యు. రాష్ట్ర కార్యవర్గసభ్యులు రూపిరెడ్డి ప్రకాష్ రెడ్డి, ఎనగందుల రవీందర్, కేశెట్టి వంశీకృష్ణ, కాచం సతీష్, యూనియన్ జిల్లా అధ్యక్షుడు డేగ సత్యం, ప్రధాన కార్యదర్శి సంపత్ రెడ్డి లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జర్నలిస్టులు ప్రజలకు వాస్తవ సమాచారాన్ని అందించడంలో అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, వార్తల ప్రచురణలో నిష్పాక్షికత, నిజానిజాల పరిశీలనకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. యూనియన్ ఏర్పాటు చేయడం వెనుక ప్రధాన ఉద్దేశం ఆ సంఘంలోని సభ్యుల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారం, ఆపద సమయాలలో అండగా నిలవడం, అవసరమైన సందర్భాలలో బీమా వంటి సంక్షేమ కార్యక్రమాలు కల్పించడం ఉంటుందని తెలిపారు. యూనియన్ సభ్యుల సంక్షేమంతో పాటు వృత్తిపరమైన బాధ్యతలు, విలువలను కాపాడేందుకు కృషి చేయాలని సూచించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశంలో జర్నలిజం రంగం ఎంతో అభివృద్ధి చెందిందని, గతంలో ఒక జిల్లాలో పరిమిత సంఖ్యలో మాత్రమే జర్నలిస్టులు ఉండేవారని, ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న ప్రతి పరిణామాన్ని ప్రజలకు చేరవేయాల్సిన బాధ్యతతో జర్నలిస్టుల సంఖ్య పెరిగిందని పేర్కొన్నారు. సమాజంలో జరిగే మంచి, చెడు, అన్యాయం, న్యాయం వంటి ప్రతి అంశాన్ని వెలుగులోకి తీసుకురావడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, పరిపాలనా విధానాలు, ప్రభుత్వ కార్యక్రమాల పనితీరు, వాటిలోని లోపాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లడం మీడియా ప్రధాన బాధ్యత అని తెలిపారు. ప్రస్తుతం వాట్సాప్, యూట్యూబ్ తదితర సామాజిక మాధ్యమాల ద్వారా ఒకే అంశంపై భిన్నమైన, కొన్నిసార్లు తప్పుడు సమాచారాలు కూడా విస్తృతంగా ప్రచారమవుతున్నాయని, ప్రజలు అయోమయానికి గురవుతున్న నేపథ్యంలో వాస్తవ సమాచారాన్ని అందించడంలో మీడియా బాధ్యత మరింత పెరిగిందని తెలిపారు. వివాదాస్పద అంశాలపై వార్తలు ప్రచురించే సమయంలో సంబంధిత అధికారుల అధికారిక వివరణను కూడా తీసుకోవాలని, తద్వారా రెండు వైపుల వాదనలు ప్రజలకు తెలిసే అవకాశం ఉంటుందని తెలిపారు. పరిపాలనా వ్యవస్థ, పోలీస్ వ్యవస్థ, న్యాయవ్యవస్థతో పాటు మీడియా కూడా విమర్శలకు అతీతం కాదని, ప్రతి వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని తెలిపారు. వృత్తిపరమైన నైతిక విలువలు, బాధ్యతాయుతమైన వార్తా సేకరణ, నిష్పాక్షికతకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా జర్నలిజం రంగంపై ప్రజలలో మరింత విశ్వసనీయత పెరుగుతుందని తెలిపారు. జర్నలిస్టులు వాస్తవాలను వెలుగులోకి తీసుకువస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. డి.సి.పి.మాట్లాడుతూ సమాజంపై అవగాహన, సామాజిక స్పృహ, ప్రజలకు మంచి చేయాలనే సంకల్పం ఉన్నవారే పాత్రికేయ వృత్తిని ఎంచుకుంటారని, సమాజంలో చైతన్యం తీసుకురావడంలో పాత్రికేయుల పాత్ర ఎంతో కీలకమని తెలిపారు. పాత్రికేయ వృత్తి పట్ల ప్రత్యేకమైన ఆసక్తి, వార్తా సేకరణతో పాటు ఇన్వెస్టిగేటివ్ జర్నలిజంపై అభిరుచి ఉన్నవారే ఈ రంగంలో కొనసాగగలరని తెలిపారు. వ్యక్తిగతంగా, ఆర్థికంగా అనేక ఇబ్బందులు ఎదురవుతున్నప్పటికీ సమాజానికి సేవ చేయాలనే తపనతో ఈ వృత్తిలో కొనసాగుతున్న పాత్రికేయులందరినీ ప్రత్యేకంగా అభినందించారు. చిన్న, పెద్ద పత్రికలలో పనిచేస్తున్న జర్నలిస్టులకు సరైన వేతనాలు లేకపోవడం, లభించే అరకొర వేతనాలు కూడా కుటుంబ పోషణకు సరిపోని పరిస్థితులు ఉండటం బాధాకరమన్నారు. ఏదైనా ప్రమాదం లేదా అవాంఛనీయ సంఘటన జరిగినప్పుడు ముందుగా అక్కడికి చేరుకోవాలనే తపన పోలీసులతో పాటు మీడియా ప్రతినిధులలోనూ ఉంటుందని, పోలీసులు తమ విధి నిర్వహణలో భాగంగా సంఘటనా స్థలానికి చేరుకుంటే, పాత్రికేయులు ప్రజలకు సమాచారం అందించాలనే బాధ్యతతో వేగంగా అక్కడికి చేరుకుంటారని వివరించారు. కెమెరా / సెల్‌ఫోన్ ఉన్న ప్రతి ఒక్కరినీ పాత్రికేయులుగా పరిగణించలేమని, బాధ్యతాయుతంగా వార్తలను సేకరించి, వాస్తవాలను పరిశీలించి, సమాజానికి సరైన సమాచారాన్ని అందించే వారే నిజమైన పాత్రికేయులని స్పష్టం చేశారు. ప్రజా ఉద్యమాలలో పాత్రికేయులు వారధిగా నిలిచి సమాజంలో సానుకూల మార్పునకు దోహదపడ్డారని తెలిపారు. వార్తా సేకరణ కోసం, కార్యక్రమాలకు హాజరయ్యేందుకు పాత్రికేయులు వేగంగా ప్రయాణించే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రమాదాల కారణంగా కొందరు మీడియా ప్రతినిధులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని, వృత్తిపరమైన బాధ్యతలతో పాటు కుటుంబం పట్ల కూడా వ్యక్తిగత బాధ్యత ఉందని గుర్తుంచుకోవాలని సూచించారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ మహాసభలు కేవలం ఎన్నికల ప్రక్రియకు మాత్రమే పరిమితం కాకుండా, గత మహాసభ నుంచి ఇప్పటివరకు జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారానికి చేపట్టిన పోరాటాలు, సాధించిన విజయాలు, భవిష్యత్తు కార్యాచరణపై సమగ్రంగా చర్చించుకునే వేదికలుగా ఉండాలని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘానికి 75 ఏళ్ల సుదీర్ఘ పోరాట చరిత్ర ఉందని, కులమతాలకు, రాజకీయ పార్టీలకు అతీతంగా ట్రేడ్ యూనియన్ స్ఫూర్తితో జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం, వృత్తి నైతిక విలువల పరిరక్షణ కోసం సంఘం నిరంతరం పనిచేస్తోందని తెలిపారు. గ్రామీణ విలేకరులకు పత్రికా యాజమాన్యాలు ఉద్యోగులుగా గుర్తింపు ఇవ్వకుండా, ఎలాంటి ఉద్యోగ భద్రత లేకుండా పనిచేయించేవని, కనీసం గుర్తింపు కార్డులు ఇవ్వడానికి కూడా నిరాకరించిన పరిస్థితులు ఉండేవని గుర్తుచేశారు. అలాంటి సమయంలో గ్రామీణ, మండల, నియోజకవర్గ స్థాయి జర్నలిస్టులకు గుర్తింపు, అక్రిడిటేషన్ కార్డులు కల్పించేందుకు సంఘం నిరంతరం పోరాటం చేసిందని తెలిపారు. సోషల్ మీడియా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి ఆధునిక సాంకేతిక పరిణామాల నేపథ్యంలో జర్నలిస్టులకు నిరంతర శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని తెలిపారు. జర్నలిస్టుల ప్రధాన సమస్యల పరిష్కారానికి సంఘం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ఇళ్ల నిర్మాణం, ఆరోగ్య భద్రతకు కృషి చేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో టి.యు.డబ్ల్యు.జె. కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జి.శ్రీనివాస్, సీనియర్ పాత్రికేయులు, వివిధ మండలాల పాత్రికేయులు పాల్గొన్నారు.

# రైతులకు అండగా ఉంటాం.. పంట రుణాల రీషెడ్యూల్ కు ప్రయత్నం

• ఫసల్ బీమా ఉంటే ఎకరానికి రూ.40 వేల నుంచి రూ.45 వేల వరకు పరిహారం వచ్చేది పత్తి రైతులకు భరోసా.. రుణాల రీషెడ్యూల్ పై ప్రభుత్వంతో చర్చలు ఎమ్మెల్యే పాయల్ శంకర్



(బేల, సాక్షర) మండల కేంద్రంలోని పత్తి మార్కెట్ యార్డులో శుక్రవారం పత్తి కొనుగోళ్లను ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ప్రారంభించారు. ముందుగా పత్తి బండ్లకు పూజలు నిర్వహించి, రైతులను సన్మానించి మిఠాయిలు తినిపించారు. అనంతరం కొనుగోలు ప్రక్రియను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ.. రైతులకు ఫసల్ బీమా పంటల బీమా పథకం అమలులో ఉండి ఉంటే ఎకరానికి రూ.40 వేల నుంచి రూ.45 వేల వరకు పరిహారం లభించే అవకాశం ఉండేదని అన్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నామని, ప్రభుత్వం కూడా సానుకూలంగా ఆలోచిస్తోందని తెలిపారు. ఈ ఏడాది రైతులు తీసుకున్న పంట రుణాలను రీషెడ్యూల్ చేయడం లేదా 10 నుంచి 12 వాయిదాల్లో చెల్లించే అవకాశం కల్పించే అంశాలను పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు.రానున్న రోజుల్లో పత్తి సాగుతో ఎదురవుతున్న ఇబ్బందులను అధిగమించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తరఫున రాయితీలు కల్పించే అంశంపై ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. రైతులు పత్తికి ప్రత్యామ్నాయ పంటల వైపు కూడా దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. రైతులు పండించిన పంటలను నిల్వ చేసుకునేందుకు చిన్న చిన్న గ్రామస్థాయి గోదాముల నిర్మాణానికి సంబంధించిన ప్రక్రియ మంజూరు దశలో ఉందని తెలిపారు. ప్రతి గ్రామంలో గోదాం ఏర్పాటు చేస్తే రైతులకు పంట నిల్వ విషయంలో ఇబ్బందులు తగ్గడంతో పాటు గ్రామపంచాయతీలకు కూడా కొంత ఆదాయం సమకూరుతుందని పేర్కొన్నారు.పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడమే కాకుండా రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. రైతు మార్కెట్లను మార్కెట్ కమిటీ చైర్మన్ నిరంతరం సందర్శిస్తూ రైతుల సమస్యలను తెలుసుకోవాలని సూచించారు.స్ప్రింక్లర్ల కోసం ఇంకా దరఖాస్తు చేసుకోని రైతులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అదనంగా మరో 2 వేల స్ప్రింక్లర్లను తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు వెల్లడించారు. మద్దతు ధర కంటే తక్కువకు వ్యాపారులు కొనుగోలు చేసే పరిస్థితి ఏర్పడితే ప్రభుత్వ రంగ సంస్థలు రంగంలోకి వచ్చి కొనుగోళ్లు చేపట్టేలా చర్యలు ఉంటాయని అన్నారు. మద్దతు ధర కంటే ఎక్కువ ధర లభిస్తే రైతులు సంతోషించాల్సిన విషయమని, ఈ అంశంపై అనవసర గందరగోళం సృష్టించకుండా రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు.

# బ్యాంకింగ్ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి

• రైతుల పంట రుణాల రీషెడ్యూల్‌కు చర్యలు జిల్లా కలెక్టర్ రాజర్షి షా సాంగిడిలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు నూతన శాఖ ప్రారంభం



(ఆదిలాబాద్ ప్రతినిధి, సాక్షర) గ్రామీణ ప్రజలు, రైతుల ఆర్థికాభివృద్ధిలో బ్యాంకులు కీలక పాత్ర పోషిస్తాయని, సాంగిడి పరిసర గ్రామాల ప్రజలు నూతనంగా ప్రారంభించిన తెలంగాణ గ్రామీణ బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సూచించారు.శుక్రవారం బేల మండలం సాంగిడి గ్రామంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు నూతన శాఖను కలెక్టర్ ప్రారంభించారు. ఈ కలెక్టర్ సందర్భంగా మాట్లాడుతూ.. బ్యాంకింగ్ సేవలు గ్రామీణ ప్రాంతాలకు చేరువ కావడం వల్ల రైతులు, మహిళా సంఘాలు, కూలీలు, చిరువ్యాపారులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ బ్యాంకు ఖాతాలు తెరిచి పొదుపు అలవాటు చేసుకోవాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఆర్థిక సాయం, రాయితీ రుణాలు పొందేందుకు బ్యాంకు ఖాతాలు అవసరమని తెలిపారు. రైతులు ప్రైవేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించకుండా బ్యాంకుల ద్వారా పంట రుణాలు పొందాలని సూచించారు.ఎల్‌నినో ప్రభావంతో ఆశించిన వర్షాలు కురవక పంటలు దెబ్బతిని రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రైతులను ఆదుకునేందుకే బేల మండలాన్ని కరువు మండలంగా ప్రకటించామని కలెక్టర్ పేర్కొన్నారు. పంట నష్టంపై వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో సర్వేలు నిర్వహిస్తున్నారని, నష్టపోయిన ప్రతి ఎకరా వివరాలను సేకరించి ప్రభుత్వానికి నివేదిస్తున్నారని తెలిపారు. కరువు పరిస్థితుల నేపథ్యంలో రైతులు బ్యాంకుల ద్వారా పొందిన పంట రుణాలను రీషెడ్యూల్ చేసేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని స్పష్టం చేశారు. రైతులు అధైర్యపడవద్దని, ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.కార్యక్రమంలో బ్యాంకు ప్రాంతీయ మేనేజర్ అప్పారావు, శాఖ మేనేజర్ రోహిత్ శర్మ, సర్పంచులు భూపతిరెడ్డి, అశోక్ ఠాక్రే, నాయకులు రఘుకుల్ రెడ్డి, రూపేష్ రెడ్డి, బాలచందర్, నాయబ్ తహసీల్దార్ వామన్, బ్యాంకు సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

# మున్నూరు కాపు సంఘం ఆత్మగౌరవ భవన నిర్మాణానికి రూ.5 కోట్ల నిధులు మంజూరు



(నిజామాబాద్ ప్రతినిధి, సాక్షర): మున్నూరు కాపు సంఘం ఆత్మగౌరవ భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5 కోట్ల నిధులు మంజూరు చేసినందుకు టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కు నిజామాబాద్ మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు ధర్మపురి సంజయ్ తో పాటు మున్నూరు కాపు సంఘం ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా నిజామాబాద్ లోని అతిథి గృహంలో టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ను మర్యాదపూర్వకంగా కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మున్నూరు కాపు సామాజిక వర్గ ఆత్మగౌరవానికి, ఐక్యతకు ప్రతీకగా నిలిచేలా భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం పట్ల వారు సంతోషం వ్యక్తం చేశారు. ఈ భవనం సామాజిక వర్గ అభ్యున్నతికి, సంఘటిత శక్తికి కేంద్రంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో డీసీసీ బొబ్బిలి రామకృష్ణ, నిజామాబాద్ మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు ధర్మపురి సంజయ్, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, రాములు, రత్నాకర్, గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో 3 కారిడార్లలో పీఆర్‌టీఎస్.

(హైదరాబాద్, సాక్షర): హైదరాబాద్ నగరంలో నానాటికీ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యను తగ్గించడం కోసం రేవంత్ రెడ్డి సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది. మూడు ప్రధాన మార్గాల్లో పర్సనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్‌ను అందుబాటులోకి తేవడానికి ఆమోదం తెలిపింది. డిసెంబర్‌లోగా పనులు ప్రారంభించి.. 2027 చివరి నాటికి పీఆర్టీఎస్ సేవలు అందుబాటులోకి తేవాలని సీఎం రేవంత రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇందులో కేపీహెచ్‌బీ నుంచి బయోడైవర్సిటీ మెట్రో స్టేషన్ (ప్రతిపాదిత) వరకు ఏర్పాటు చేయబోయే మార్గం కీలకం కానుంది.హైదరాబాద్ నగరంలోని ఐటీ ఉద్యోగులకు తెలంగాణ సర్కారు గుడ్ న్యూస్ చెప్పింది. కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు (కేపీహెచ్‌బీ) మెట్రో స్టేషన్ నుంచి త్వరలో రానున్న బయోడైవర్సిటీ మెట్రోస్టేషన్ వరకు పర్సనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ ( పీఆర్టీఎస్ ) ఏర్పాటుకు సీఎం రేవంత్ రెడ్డి ఆమోదం తెలిపారు. కేపీహెచ్‌బీ మెట్రో స్టేషన్ నుంచి దుర్గం చెరువు, రహేజా మైండ్ స్పేస్ మీదుగా బయోడైవర్సిటీ మెట్రో స్టేషన్ వరకు పీఆర్టీఎస్‌ను ఏర్పాటు చేయనున్నారు.హైదరాబాద్ నగరంలోని ఐటీ సంస్థలు ప్రధానంగా పశ్చిమ ప్రాంతంలోని హైటెక్ సిటీ, గచ్చిబౌలి, కొండాపూర్ ప్రాంతాల్లో ఉన్నాయి. దీంతో ఐటీ ఉద్యోగులు ఎక్కువగా కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ, మియాపూర్, నిజాంపేట్, బాచుపల్లి, చందానగర్ ప్రాంతాల్లో ఎక్కువగా నివసిస్తున్నారు. మియాపూర్ నుంచి రాయదుర్గం వరకు మెట్రో సేవలు అందుబాటులో ఉన్నాయి. అయితే మెట్రోలో వెళ్లాలంటే చుట్టూ తిరుగుతూ అమీర్‌పేట మీదుగా 17 కి.మీ. ప్రయాణించాల్సి వస్తోంది. అంతే కాకుండా అమీర్‌పేటలో రైలు మారాలి. అత్యంత రద్దీగా ఉండే ఈ మార్గంలో.. ఎక్కువ దూరం ప్రయాణించడం, రైలు మారాల్సి రావడం ఐటీ ఉద్యోగులకు ఇబ్బందికరంగా ఉంది. దీంతో చాలా మంది ఇప్పటికీ కార్లు, బైకుల, ట్యాక్సీల మీదే ఆఫీసులకు వెళ్తున్నారు. దీంతో గచ్చిబౌలి నుంచి కేపీహెచ్‌బీ వెళ్లే రూట్‌లో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటోంది.పీఆర్టీఎస్ అందుబాటులోకి వస్తే ట్రాఫిక్ సమస్య తగ్గుతుందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. దీంతో డిసెంబర్ నాటికి టెండర్లు పూర్తి చేసి.. 2027 చివరి నాటికి పీఆర్టీఎస్‌ను అందుబాటులోకి తేవాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఐటీ కారిడార్‌లో పీఆర్టీఎస్ సాధ్యాసాధ్యాలపై లీ అసోసియేట్స్ సమర్పించిన రిపోర్టు ఇప్పటికే సిద్ధంగా ఉంది కాబట్టి వెంటనే పనులు చేపట్టాలని సీఎం ఆదేశించారు.హైదరాబాద్ నగరంలోని ఐటీ కారిడార్లలో మొత్తం 34.46 కిలోమీటర్ల మేర పీఆర్టీఎస్‌ను ప్రతిపాదించారు. అయితే తక్షణ ప్రాధాన్యంగా కేపీహెచ్‌బీ నుంచి రాయదుర్గం వరకు 7.62 కి.మీ. మార్గాన్ని మొదటి జోన్‌లో భాగంగా అందుబాటులోకి తేనున్నారు. తర్వాత దీన్ని మిగతా ఐటీ కారిడార్ మొత్తానికి విస్తరించనున్నారు.ఐటీ కారిడార్‌తోపాటు హైదరాబాద్ కోర్ సిటీలోనూ మరో రెండు మార్గాల్లో పీఆర్టీఎస్ ఏర్పాటు చేయడానికి సీఎం రేవంత్ రెడ్డి ఆమోదం తెలిపారు. ఎల్బీ స్టేడియం నుంచి రాణిగంజ్ బస్టాండ్ వరకు ఒక లైన్ కాగా.. అసెంబ్లీ మెట్రో నుంచి బేగంపేటకు మరో లైన్ ఉండనుంది. ఎల్బీ స్టేడియం నుంచి అంబేద్కర్ విగ్రహం, ఇందిరా పార్క్, లోయర్ ట్యాంక్ బండ్ మీదుగా రాణిగంజ్ బస్టాండ్ వరకు మొదటి లైన్ ఉంటుంది. రెండో లైన్లో రవీంద్ర భారతి, సచివాలయం, ఐమ్యాక్స్ ప్రాంతాలు కూడా కవర్ అవుతాయి. అయితే వీటిలో అసెంబ్లీ నుంచి బేగంపేట పీఆర్టీసీ లైన్ ఏర్పాటు కొంత ఆలస్యమయ్యే అవకాశం ఉంది.మెట్రోకు అనుసంధానంగా పాడ్ కార్లు.. కూకట్‌పల్లిలో PRTS భారీ డిపో.. 104 ఎకరాల్లో ఏర్పాటు..!గచ్చిబౌలి ఐకియా ప్రాంతంతోపాటు నెక్లెస్ రోడ్‌లో మల్టీ లెవల్ పార్కింగ్‌లు ఏర్పాటు చేసి పీఆర్టీఎస్ డిపోలు ఏర్పాటు చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు.2027 చివరి నాటికి పీఆర్టీఎస్ సేవలు అందుబాటులోకి వస్తే.. ఐటీ కారిడార్లో ట్రాఫిక్ సమస్య తగ్గే అవకాశం ఉంది. ఐటీ ఉద్యోగులు 15 నిమిషాల్లోపే కేపీహెచ్‌బీ నుంచి మైండ్ స్పేస్‌కు చేరుకునే అవకాశం ఉంటుంది. తొలి దశ పీఆర్టీఎస్ సేవలు అందుబాటులోకి వస్తే.. 2030 నాటికి రోజుకు 75 వేల మందికిపైగా ప్రయాణికులు ఈ సేవలను వాడుకునే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

## సూరవరం ప్రతాప్ రెడ్డి పార్కును ప్రెస్ క్లబ్‌గా మార్చొద్దు

(వనపర్తి, సాక్షర): పట్టణంలోని క్యాంపు కార్యాలయం పక్కన ఉన్న సూరవరం ప్రతాప్ రెడ్డి పార్కును ప్రెస్ క్లబ్‌గా మార్చాలనే స్థానిక ఎమ్మెల్యే ఆలోచన సరైనది కాదని మాజీ మున్సిపల్ చైర్మన్లు బోలెమోని.లక్ష్మయ్య, గట్టు యాదవ్,పలుస. రమేశ్ గౌడ్ మాజీ వైస్ చైర్మన్ వాకిటి. శ్రీధర్,కౌన్సిలర్ ఏర్వ.అరుణ శ్రీనివాసులు మరియు బీఆర్ఎస్ నాయకులు అభిప్రాయపడ్డారు. పాత్రికేయులకు బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ వ్యతిరేకం కాదు. జర్నలిస్టుల సంక్షేమానికి, వారి హక్కులకు బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది. అయితే ప్రెస్ క్లబ్ ఏర్పాటుకు సూరవరం ప్రతాప్ రెడ్డి పార్కు సరైన స్థలం కాదన్నదే మా విజ్ఞప్తి. ప్రజల కోసం ఏర్పాటు చేసిన పార్కును యథావిధిగా కొనసాగిస్తూ, పాత్రికేయుల కోసం అన్ని సౌకర్యాలతో కూడిన ప్రెస్ క్లబ్ నిర్మాణానికి మరో అనువైన స్థలాన్ని కేటాయించాలని కోరారు. ఈ మేరకు ఈరోజు సురవరం. ప్రతాప్ రెడ్డి పార్కులో బి. ఆర్.ఎస్ నాయకులు బైఠాయించి ఎమ్మెల్యే ఏకపక్ష నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ నిరసన చేపట్టారు.అనంతరం మున్సిపల్ కమిషనర్ బి.నిరంజన్ యాదవ్ కి వినతిపత్రం అందజేసి పార్కుల్లో ఇతరత్ర నిర్మాణాలు చేపట్టడానికి మున్సిపల్ చట్టం అనుమతించదని నియమ నిబంధనలు ఉల్లంఘించి ప్రెస్ క్లబ్ నిర్మాణాన్నికి పూనుకుంటే చట్టబద్ధ చర్యలకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. పాత్రికేయుల సంక్షేమానికి మద్దతు ఇస్తూనే.. ప్రజల కోసం ఉన్న పార్కును పరిరక్షించాలన్నదే బీఆర్ఎస్ పార్టీ అభిమతం అని అన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో నందిమల్ల.అశోక్,గంధం.పరంజ్యోతి,మాజీ కౌన్సిలర్ ఉంగ్లం.తిరుమల్,నాగన్న యాదవ్, స్టార్.రహీం, నీలస్వామి, సూర్యవంశం.గిరి, జోహెబ్ హుస్సేన్, హేమంత్ ముదిరాజ్,సునీల్ వాల్మీకి, హరీఫ్, ఎ.కె.పాషా, అస్లామ్,మంద.రాము, అనిపాటి.రాము, ఇంతియాజ్,రాజోలి. నిరంజన్,వజ్రాల. రమేష్ ఉన్నారు.

## కాంగ్రెస్ సంస్థాగత బలోపేతానికి కార్యాచరణ..

- సంఘటన్ సృజన్ అభియాన్ లో భాగంగా గ్రామ, బూత్ స్థాయి కమిటీల ఏర్పాటు



(గుడిహత్నూర్, సాక్షర) “సంఘటన్ సృజన్ అభియాన్ ద్వారా కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి బూత్ స్థాయి వరకు పటిష్టంగా నిర్మించడమే ప్రధాన లక్ష్యమని, మండలంలోని అన్ని గ్రామాలు, బూత్ లలో ఏర్పాటు చేసిన కమిటీల ద్వారా దాదాపు 1,400 మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు మరింత చేరువవుతారని, పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఇంటికీ చేరవేస్తూ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడానికి ప్రతి కమిటీ సభ్యుడు బాధ్యతతో పనిచేయాలని గుడిహత్నూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తొడసం దౌలత్ రావు అన్నారు. గుడిహత్నూర్ మండలంలో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత బలోపేతానికి కార్యాచరణ రూపొందించారు.గుడిహత్నూర్ మండల కేంద్రంలోని ఎక్స్ రోడ్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గుడిహత్నూర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తొడసం దౌలత్ రావు అధ్యక్షతన సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసే లక్ష్యంతో సమావేశం నిర్వహించారు.ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు డా.నరేష్ జాదవ్ ఆదేశాల మేరకు గుడిహత్నూర్ మండలంలోని ప్రతి గ్రామంలో 21 మంది సభ్యులతో గ్రామ కమిటీని, ప్రతి బూత్ స్థాయిలో 21 మంది సభ్యులతో బూత్ కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందని గుడిహత్నూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తొడసం దౌలత్ రావు సమావేశంలో వెల్లడించారు.ఈ సందర్భంగా తొడసం దౌలత్ రావు మాట్లాడుతూ సంఘటన్ సృజన్ అభియాన్ ద్వారా కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి బూత్ స్థాయి వరకు పటిష్టంగా నిర్మించడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలు, బూత్ లలో ఏర్పాటు చేసిన కమిటీల ద్వారా దాదాపు 1,400 మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు మరింత చేరువవుతారని పేర్కొన్నారు.రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి ఈ కమిటీలు కీలక పాత్ర పోషించడంతో పాటు, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు, ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కార దిశగా కృషి చేసేందుకు దోహదపడతాయని అన్నారు.పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఇంటికీ చేరవేస్తూ, కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడానికి ప్రతి కమిటీ సభ్యుడు బాధ్యతతో పనిచేయాలని పిలుపునిచ్చారు.సంఘటన్ సృజన్ అభియాన్ ద్వారా గుడిహత్నూర్ మండలంలో కాంగ్రెస్ పార్టీకి మరింత బలమైన సంస్థాగత పునాది ఏర్పడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.ఈకార్యక్రమంలో ఆయనతోపాటు కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు మారుతీ, గర్కం పేట్ సర్పంచ్ కేశవ్, స్పోర్ట్స్ పర్సన్ ఆడే జైపాల్, ప్రధాన కార్యదర్శి కాగ్నే రాంకిషన్, సెక్రటరీ రాథోడ్ రమేష్, విష్ణు పోలె, కిషోర్ మదనే, సారంగా పాణి, సెడమాకి కృష్ణ, బాలవంత్ రావు, మేశ్రం మోహన్, వేలాది మాకేష్, సిడం మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## మత్తుపదార్థాల నిర్మూలనకు విస్తృత ప్రచారం చేయాలి

- నషా ముక్త్ భారత్ అభియాన్’ పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ రాజర్షి షా



(ఆదిలాబాద్, సాక్షర) మత్తుపదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై యువతకు అవగాహన కల్పించి, మత్తుపదార్థాల రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సూచించారు.నషా ముక్త్ భారత్ అభియాన్ లో భాగంగా రూపొందించిన మత్తుపదార్థాల నివారణ ప్రచార పోస్టర్ ను శుక్రవారం కలెక్టరేట్ లో కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని, వాటి దుష్ప్రభావాలపై విద్యార్థులు, ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, డీఈఓ మాధవి, రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ మనోహర్ రావు, స్టేట్ ఈసీ మెంబర్ రాజేశ్వరరావు, డైరెక్టర్లు రాజు, బండారి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## ఆశా వర్కర్లకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలి : ఎమ్మెల్యే పాయల్ శంకర్



(ఆదిలాబాద్ ప్రతినిధి, సాక్షర): ఆశా వర్కర్లకు ఫిక్స్డ్ వేతనం రూ.18 వేలు నిర్ణయించి, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, ఆశా వర్కర్లకు కనీస వేతనంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం వారికి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు.శుక్రవారం తెలంగాణ ఆశా వర్కర్స్ రాష్ట్ర యూనియన్ సభ్యులు ఎమ్మెల్యేను క్యాంపు కార్యాలయంలో కలిసి తమ సమస్యలపై వినతి పత్రం అందజేశారు. సందర్భంగా ఎమ్మెల్యే స్పందిస్తూ ప్రభుత్వం దృష్టికి ఆశా కార్యకర్తల సమస్యలను తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఆశా వర్కర్లకు కనీస వేతనంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం వారికి ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు.

## రూ.3.50 లక్షలకే ఇందిరమ్మ టవర్స్ ఫ్లాట్..

- తెలంగాణ ప్రభుత్వం కీలక ప్రక్రియ
- తెలంగాణలోని ఐదు ప్రధాన పట్టణాల్లో 2,400 ఇందిరమ్మ ఫ్లాట్ల నిర్మాణం
- రూ.5 లక్షల ప్రభుత్వ సబ్సిడీతో కేవలం రూ.3.50 లక్షలకే 512 చదరపు అడుగుల ఫ్లాట్
- డిసెంబర్ 5 వరకు మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం
- వార్షిక ఆదాయం రూ.6 లక్షల లోపు ఉన్నవారికే దరఖాస్తు చేసుకునే అర్హత
- లాటరీ పద్ధతి ద్వారా లబ్ధిదారుల ఎంపిక ఉంటుందని హౌసింగ్ బోర్డు స్పష్టీకరణ

(హైదరాబాద్, సాక్షర): రాష్ట్ర ప్రభుత్వం పట్టణ పేదలకు తీపి కబురు అందించింది. హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) వెలుపల ఉన్న ఐదు ప్రధాన నగరాల్లో 'ఇందిరమ్మ ఇండ్లు టవర్స్' పథకం కింద మొదటి విడతలో 2,400 ఫ్లాట్ల నిర్మాణానికి తెలంగాణ హౌసింగ్ బోర్డు డిమాండ్ సర్వే నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పథకం ద్వారా ఒక్కో అర్హత కలిగిన కుటుంబానికి రూ.5 లక్షల సబ్సిడీతో పాటు ఉచితంగా స్థలాన్ని సమకూరుస్తున్నారు. లబ్ధిదారుడి వాటాగా కేవలం రూ.3.50 లక్షలు మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. ఈ పథకం కింద నిజామాబాద్ (నాగారం - ఆర్‌జీకే

## ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలి

- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



(మంచిర్యాల, సాక్షర ) భారతదేశంలోనే తొలిసారిగా తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతిష్టాత్మక సామాజిక భద్రతా పథకం, ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలుకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుండి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంబంధిత జిల్లా అధికారులతో పథకం అమలు, కార్యాచరణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని కుటుంబాలకు కుల, ప్రాంత, వర్గ భేదాలకు అతీతంగా 18 నుండి 59 సంవత్సరాల మధ్య వయసు కలిగిన కుటుంబ పెద్దకు ఈ పథకం వర్తించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కుటుంబ పెద్దకు దురదృష్టవశాత్తు ఏదైనా ప్రమాదం సంభవించినప్పుడు ఆ కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని తెలిపారు.రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, గ్రామాలలో ఒకేసారి ఈ పథకాన్ని ప్రారంభించేందుకు ప్రణాళిక రూపొందించడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల19న ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా పథకాన్ని అధికారికంగా ప్రారంభించడం జరుగుతుందని, ఈ పథకం అమలులో జిల్లా కలెక్టర్లు పూర్తి నిబద్ధతతో పనిచేయాలని, క్షేత్రస్థాయిలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. గ్రామాలలో అవసరమైన కేంద్రాలను ఏర్పాటు చేసి, గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల పరిధిలో వార్డుల వారీగా ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని తెలిపారు. ఈ నెల 19 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభించి, దరఖాస్తు ఫారాలు పంపిణీ చేయడంతో పాటు కుటుంబ సభ్యుల పూర్తి వివరాలను సక్రమంగా సేకరించాలని ఆదేశించారు. ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో ఈ పథకం అమలు చేయనున్న నేపథ్యంలో సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని, కుటుంబ సభ్యుల వివరాల సేకరణలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ పథకానికి అర్హత పొందాలంటే సంబంధిత కుటుంబం తెలంగాణ రాష్ట్రానికి చెందిన వారై ఉండాలని తెలిపారు. పథకం విధివిధానాలు, దరఖాస్తు ప్రక్రియ, అమలు తీరు గురించి ప్రజలకు పూర్తి అవగాహన కల్పించేందుకు మీడియా ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని, క్షేత్రస్థాయి అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ అర్హులైన ప్రతి కుటుంబానికి పథకం ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలుకు జిల్లాలో అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలోని ప్రజలందరికీ తెలిసే విధంగా విస్తృత ప్రచారం నిర్వహిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, జిల్లా ప్రణాళిక అధికారి పాపయ్య, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి గణపతి, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు హాజరయ్యారు.

## బేలా మార్కెట్ యార్డులో పత్తి కొనుగోళ్లు ప్రారంభం



(బేల, సాక్షర): బేలా మార్కెట్ యార్డులో ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ తో కలిసి ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు బోరంచు శ్రీకాంత్ రెడ్డి పత్తి కొనుగోళ్లను ప్రారంభించారు.ఈ సందర్భంగా మార్కెట్లో పత్తి క్వింటాలు ధర 8,910 రూపాయలు పలికిందని వారు తెలిపారు. ధరలో మరో 50 రూపాయలు అదనంగా పెరిగితే రైతులు మరింత లబ్ధి పొందుతారని తెలిపారు.ప్రస్తుతం మంచు కురుస్తున్నందున పంటలో తేమ శాతం పెరిగే అవకాశం ఉందని, రైతులు పంటను 8 నుంచి 12 శాతం తేమ శాతానికి తీసుకువచ్చి మార్కెట్కు విక్రయానికి తీసుకురావాలని కోరారు.హర్యానా వంటి ప్రాంతాలలో పశువులు ఎక్కువగా ఉండటం వల్ల అక్కడ విత్తనానికి 200 రూపాయల వరకు ధర అధికంగా వస్తుందని, మన ప్రాంతంలో కూడా రైతులు తగిన తేమతో నాణ్యమైన పత్తిని తెస్తే అందరికంటే 200 రూపాయలు ఎక్కువ ధర ఇప్పించే విధంగా శాసనసభ్యుడు, తాము కలిసి తగిన కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. రైతులందరూ ఈ విషయాన్ని గ్రహించి, నాణ్యమైన పంటను విక్రయించి లాభాలు పొందాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా మార్కెట్ అధికారి గజానంద్, కార్యదర్శి శ్రీకాంత్, మాజీ జిల్లా పరిషత్ ప్రాదేశిక సభ్యుడు రాందాస్, మాజీ మార్కెట్ అధ్యక్షులు వామన్ రావు వాంఖడే, అశోక్ రెడ్డి, అల్పసంఖ్యాక వర్గాల అధ్యక్షుడు బేలా అబ్దుల్ కరీం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సంజయ్ గుండావర్, సర్పంచులు బద్దం జగదీశ్వర్ రెడ్డి, శంకర్ భోక్రే, బేలా ఉప సర్పంచి ప్రకాష్, భారత జాతీయ విద్యార్థి సంఘం అధ్యక్షుడు రాజు, వ్యవసాయ సాంకేతిక నిర్వహణ సంస్థ కమిటీ సంచాలకుడు ఈశ్వర్, అలీం పాల్గొన్నారు.

# భారత్ సమ్మిట్ చుట్టూ రాజకీయాలు

(హైదరాబాద్, సాక్షర): తెలంగాణ రాజధాని హైదరాబాద్ వేదికగా జరగుతున్న ప్రతిష్టాత్మక అంతర్జాతీయ భారత్ సమ్మిట్ చుట్టూ ఇప్పుడు జాతీయ స్థాయిలో రాజకీయ చర్చ ప్రారంభమైంది. ఒకవైపు రాష్ట్రానికి అంతర్జాతీయ పారిశ్రామిక ప్రగతిని, సాంకేతిక పెట్టుబడులను తీసుకురావడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వ యంత్రాంగం కార్యక్రమ ఏర్పాట్లను ముమ్మరం చేస్తోంది. అయితే, ఈ వేదికపై సీనియర్ కాంగ్రెస్ నేతలు చేసిన సంచలన వ్యాఖ్యలు, ఏఐసీసీ అగ్రనేతల భాగస్వామ్యం చూస్తుంటే.. ఇది కేవలం పారిశ్రామిక సదస్సా లేక కాంగ్రెస్ పార్టీ సిద్ధాంత ప్రచార వేదికనా అనే ప్రశ్నలు దౌత్య, రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి.వివాదానికి ప్రధాన బీజం ఏఐసీసీ వేదికగా సీనియర్ నేత, మాజీ విదేశాంగ మంత్రి సల్మాన్ ఖుర్షిద్ చేసిన తాజా వ్యాఖ్యలే కారణం. స్విట్జర్లాండ్‌లోని దావోస్ సదస్సు తరహాలో హైదరాబాద్‌ను ఒక శాశ్వత అంతర్జాతీయ మేధో కేంద్రంగా తీర్చిదిద్దుతామని చెబుతూనే.. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వ విదేశాంగ ధోరణులను ఆయన పరోక్షంగా ప్రశ్నించారు. నెహ్రూ అలీన విధానం, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీలు రూపకల్పన చేసిన రాజనీతి సిద్ధాంతాలతో పాటు భవిష్యత్ ప్రపంచానికి రాహుల్ గాంధీ అందించే నూతన అంతర్జాతీయ దృక్పథాన్ని ప్రపంచ ప్రతినిధుల ముందుంచే వేదికగా దీనిని నిర్వహిస్తున్నామని ప్రకటించడం ద్వారా ఈ సదస్సు చుట్టూ రాజకీయ సమీకరణాలు వేడెక్కాయి.లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్వయంగా విచ్చేస్తుండటంతో పాటు శామ్ పిట్రోడా, శశి థరూర్, గుర్దీప్ సప్పల్ వంటి కాంగ్రెస్ రంగాధిపతులు ఈ కార్యక్రమ రూపకల్పనలో ప్రధాన భూమిక పోషించడం విశేషం. ప్రపంచవ్యాప్తంగా 70కి పైగా దేశాల నుంచి విచ్చేస్తున్న దాదాపు 1,000 మంది ప్రతినిధులతో భౌగోళిక రాజకీయాలు, ప్రగతిశీల భావజాలం, ప్రజాస్వామ్య సూత్రాలపై చర్చలు జరపనున్నట్లు ప్రకటించారు. ఒక ప్రభుత్వ అధికారిక యంత్రాంగం, నిధులతో నడిచే సదస్సులో పార్టీ సిద్ధాంతాలకు, భావి రాజకీయ వ్యూహాలకు ప్రాధాన్యత ఇవ్వడం ఎంతవరకు సమంజసమనే డిబేట్ ప్రారంభమైంది.ఈ పరిణామాలపై విపక్ష బీజేపీ అత్యంత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తుతోంది. తెలంగాణ ప్రజల పన్నుల సొమ్మును, ప్రభుత్వ యంత్రాంగాన్ని రాహుల్ గాంధీ అంతర్జాతీయ ఇమేజ్ బిల్డింగ్ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని ఎన్డీయే నేతలు ఆరోపిస్తున్నారు. నిజమైన పెట్టుబడుల సదస్సు అయితే ప్రపంచ పారిశ్రామిక దిగ్గజాలు, పరిశ్రమల ఒప్పందాలు కేంద్రంగా చర్చలు జరగాలని, అలాకాకుండా నెహ్రూ విదేశాంగ విధానం గురించి ప్రభుత్వ ఖర్చుతో సమావేశాలు పెట్టడమేంటని విపక్షాలు నిలదీస్తున్నాయి. రాష్ట్ర నిరుద్యోగులు, రైతుల ప్రయోజనాలను పక్కనబెట్టి పార్టీ ప్రచారానికి వేదికగా మార్చడాన్ని తాము అంగీకరించబోమని హెచ్చరిస్తున్నాయి.మరోవైపు కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విమర్శలను ఏమాత్రం ఒప్పుకోవడం లేదు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఈ వివాదంపై స్పందిస్తూ.. రాబోయే డిసెంబర్‌లో జరగబోయే ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ కు ఈ భారత్ సమ్మిట్ ఒక బలమైన వైజ్ఞానిక, విజ్ఞాన భూమికగా ఉపయోగపడుతుందని స్పష్టం చేశారు. కేవలం ఫ్యాక్టరీలు, పారిశ్రామిక నిధులే కాకుండా ప్రపంచ స్థాయి విధాన నిర్ణేతలు, సాంకేతిక నిపుణులు హైదరాబాద్ వేదికగా ఆలోచనలు పంచుకోవడం వల్ల తెలంగాణ బ్రాండ్ ఇమేజ్ ప్రపంచపటంలో మరింత పెరుగుతుందని, దీనిని రాజకీయ కోణంలో చూడకూడదని ప్రభుత్వం వాదిస్తోంది. ఈ పరిణామాన్ని పక్క రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌తో పోల్చి చూస్తే ఆసక్తికరమైన తేడాలు కనిపిస్తాయి. విశాఖపట్నంలో నవంబర్ 12-13 తేదీల్లో జరిగే సీఐఐ భాగస్వామ్య సదస్సు సంపూర్ణంగా పారిశ్రామిక రంగాలు, ఒప్పందాల చుట్టూనే సాగుతుండగా.. హైదరాబాద్‌లో జరుగుతున్న భారత్ సమ్మిట్ మాత్రం ఆర్థిక అంశాలతో పాటు రాజకీయ, సామాజిక-రాజనీతి చర్చలకు వేదికగా మారుతోంది. అంతర్జాతీయ వేదికలపై నూతన ఆలోచనలు, పాలసీలపై చర్చలు జరగడం ఏ నగరానికైనా మైలేజ్ ఇచ్చే అంశమే. అయితే, పారిశ్రామిక ప్రగతి, ఉద్యోగ కల్పన అనే ప్రాథమిక లక్ష్యాలు నెరవేరినప్పుడే ప్రభుత్వ నిధులతో నిర్వహించే ఇటువంటి గ్లోబల్ సదస్సులకు నిజమైన సార్థకత చేకూరుతుందని అంటున్నారు.

## తానూర్ విఠలేశ్వర్ ఆలయంలో కార్తీక మాస ఉత్సవాలు




(తానూర్, సాక్షర): సోమవారం నుంచి అఖండ హరినామ సత్తా, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నట్లు, ప్రతి సంవత్సరం లాగా ఈ సంవత్సరం కూడా కార్తీక మాస ఉత్సవాలు ఉంటాయని అర్చకులు ప్రింటు మారాజు అన్నారు. మండల కేంద్రంలోని విఠలేశ్వర్ ఆలయంలో కార్తీక మాస ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు.సోమవారం నుంచి అఖండ హరినామ సత్తా, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నట్లు అర్చకులు ప్రింటు మారాజు అన్నారు. ప్రతి సంవత్సరం లాగా ఈ సంవత్సరం కూడా కార్తీక మాస ఉత్సవాలు ఉంటాయని అన్నారు.

## బియ్యం ధరలను తక్షణమే కట్టడి చేయాలి

- సామాన్య ప్రజలపై ధరల భారం తగ్గించాలి ప్రజా జాగృతి సమితి రాష్ట్ర అధ్యక్షులు రాజలింగు మోతె



(ఆదిలాబాద్ ప్రతినిధి, సాక్షర) బియ్యం ధరలు రోజురోజుకూ పెరుగుతుండటంతో పేద, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సామాన్య ప్రజలకు బియ్యం ధరల పెరుగుదల మరింత భారంగా మారిందని, ప్రభుత్వం వెంటనే స్పందించి బియ్యం ధరలను నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రజా జాగృతి సమితి రాష్ట్ర అధ్యక్షులు రాజలింగు మోతె అన్నారు. శుక్రవారం ప్రజా జాగృతి సమితి కార్యాలయంలో ఆయన మాట్లాడారు. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సామాన్య ప్రజలకు బియ్యం ధరల పెరుగుదల మరింత భారంగా మారిందన్నారు.ప్రభుత్వం వెంటనే స్పందించి బియ్యం ధరలను నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. మార్కెట్ లో బియ్యం నిల్వలు, విక్రయ ధరలపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని, కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయించే వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ప్రజలకు నాణ్యమైన బియ్యం సరసమైన ధరలకు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, సామాన్య ప్రజల ఆహార భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని రాజలింగు మోతె ప్రభుత్వాన్ని కోరారు. ఈ నెల 16న ప్రత్యేక పిల్లల ప్రజావాణి నిర్వహణ జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ (మంచిర్యాల ప్రతినిధి, సాక్షర) తెలంగాణ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాల మేరకు ఈ నెల 16వ తేదీన (సాధారణ ప్రజావాణితో పాటు) ప్రత్యేకంగా “పిల్లల ప్రజావాణి” కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రత్యేక పిల్లల ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా బాలలకు సంబంధించిన వ్యక్తిగత, సామాజిక సమస్యలు, ఇబ్బందులు, ఇతర ఫిర్యాదులను స్వీకరించడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని జిల్లాలోని బాలబాలికలు, వారి తల్లిదండ్రులు, సంరక్షకులు సద్వినియోగం చేసుకొని, పిల్లలకు సంబంధించిన సమస్యలు, ఫిర్యాదులను ప్రజావాణి కార్యక్రమంలో తెలియజేయవచ్చని వివరించారు.

## తానూర్ పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసిన భైంసా ఏఎస్పీ సాయికిరణ్




(తానూర్, సాక్షర): మండల కేంద్రంలోని తానూర్ పోలీస్ స్టేషన్ ను భైంసా సబ్ డివిజన్ ఏఎస్పీ సాయికిరణ్ శుక్రవారం సందర్శించి స్టేషన్ పరిధిలోని కేసుల పురోగతి, పోలీస్ స్టేషన్ నిర్వహణ, వివిధ రికార్డులు, ఫైళ్లను పరిశీలించారు.ఈ సందర్భంగా హిస్టరీ షీట్లు, పాత పెండింగ్ కేసులు, ఇటీవల నమోదైన కేసులు, ప్రజల నుంచి అందిన ఫిర్యాదులపై సమీక్ష నిర్వహించారు. పెండింగ్ కేసులను వేగవంతం చేసి సకాలంలో పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం పోలీస్ స్టేషన్ ను సందర్శించిన పాఠశాల విద్యార్థులతో మాట్లాడి పోలీస్ స్టేషన్ విధులు, పోలీసుల బాధ్యతలు, ప్రజలకు అందించే సేవలు, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర గురించి వివరించారు. పోలీస్ స్టేషన్ పనితీరుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.తదుపరి ఇటీవల రోడ్డు ప్రమాదాలు జరిగిన బెల్ తరోడా, బోసి గ్రామాల పరిధిలోని ప్రమాదకర ప్రాంతాలను, బ్లాక్ స్పాట్స్ ను ఏఎస్పీ స్వయంగా సందర్శించి పరిశీలించారు. జాతీయ రహదారి ఎన్హెచ్ 161 బీబీ పరిధిలో ఈ ప్రాంతాలు ఉన్నందున సంబంధిత ముధోల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రవీందర్, జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ ఎన్హెచ్ఏఐ అధికారులతో సమన్వయం చేసుకొని ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రహదారిపై హెచ్చరిక బోర్డులు, అవసరమైన రోడ్డు భద్రత ఏర్పాట్లు చేపట్టి ప్రమాదాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ముధోల్ సీఐ రవీందర్ నాయక్, తానూర్ ఎస్ఐ జుబేర్, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## రబీ సాగులో ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను ప్రోత్సహించాలి

- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు 90 శాతానికి పెంచాలి
- భూసేకరణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి
- వీధి కుక్కల నియంత్రణకు సుప్రీంకోర్టు మార్గదర్శకాల అమలు
- జిల్లా కలెక్టర్లతో సీఎస్ సంజయ్ జాజ్జు వీడియో కాన్ఫరెన్స్



(హైదరాబాద్, సాక్షర): రబీ 2026-27 సీజన్‌లో సాగునీటి ప్రాజెక్టుల్లో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని రైతులను ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు ప్రోత్సహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజ్జు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. డా బిఆర్ అంబేడ్కర్ సచివాలయం నుండి శుక్రవారం ప్రత్యామ్నాయ పంటల సాగు, ధాన్యం కొనుగోళ్లు, విద్య, మౌలిక సదుపాయాలు, భూసేకరణ, నీటి సంరక్షణ, వీధి కుక్కల నియంత్రణ తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ రబీలో ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించాలని సూచించారు. ఎల్ నినో వల్ల నీటి కొరత ఏర్పడనున్నందున వరికి బదులుగా ఉద్యాన పంటలు, ఆయిల్ పామ్ సాగుతో పాటు సూక్ష్మ సేద్య పద్ధతులను రైతులు అనుసరించేలా వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. రైతు ఐడీ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని, కస్టమ్ హైరింగ్ కేంద్రాల ఏర్పాటుతో పాటు కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ పథకాలపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి కొనుగోలు కేంద్రాలను ముందుగానే సిద్ధం చేయాలని, నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. రైతులు ప్రైవేటు మార్కెట్లో ధాన్యం విక్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర అందేలా చూడాలని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన రకాలకు 500 బోనస్ అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు హాజరును ముఖ గుర్తింపు యాప్ ద్వారా నిరంతరం పర్యవేక్షించాలని, హాజరు శాతాన్ని 90 శాతానికి పైగా పెంచాలని సీఎస్ సూచించారు. విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు ఫిజిక్స్ వాలా, ఖాన్ అకాడమీ వంటి డిజిటల్ విద్యా వేదికలను సమర్థవంతంగా వినియోగించుకోవాలన్నారు. రూసా 2.0, పీఎం ఉషా, సమగ్ర శిక్ష అభియాన్, పీఎం శ్రీ పథకాల కింద మంజూరైన నిధులను పూర్తిస్థాయిలో వినియోగించుకొని పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. రూ.11 వేల కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న 87 యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలలు, రూ.1,108 కోట్లతో మంజూరైన 115 తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని సూచించారు. సాగునీటి ప్రాజెక్టులు, ఇతర అభివృద్ధి పనులకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్లకు సూచించారు. భూసేకరణకు అవసరమైన నిధుల కొరత లేదని, సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ పనులను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ఇతర రద్దీ ప్రాంతాల్లో వీధి కుక్కలను గుర్తించి, నిబంధనల ప్రకారం పునరావాస కేంద్రాలకు తరలించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచడంతో పాటు భూగర్భ జలాల అభివృద్ధికి అవసరమైన నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. కాలువల్లో పూడిక, చెత్త తొలగించి నీటి

## సామ రూపేష్ రెడ్డి ఇంటికి జిల్లా కలెక్టర్ రాజర్షి షా



(బేల / ఆదిలాబాద్) బేల మండలం సాంగిడి గ్రామంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ డైరెక్టర్ సామ రూపేష్ రెడ్డి నివాసానికి ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా విచ్చేశారు.ఈ సందర్భంగా సామ రూపేష్ రెడ్డి కుటుంబ సభ్యులు కలెక్టర్ కు ఆత్మీయ స్వాగతం పలికారు. అనంతరం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన తేనీటి విందులో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా సామ రూపేష్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలెక్టర్ ఆప్యాయంగా ముచ్చటించారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి ఫోటోలు దిగారు. జిల్లా కలెక్టర్ తమ ఇంటికి విచ్చేసి ఆత్మీయ సమయం గడపడం పట్ల సామ రూపేష్ రెడ్డి, కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

## రైతులకు సూక్ష్మ సేద్యంపై అవగాహన కల్పించాలి

- పంట మార్పిడి, ఉద్యాన పంటల సాగును విస్తృతంగా ప్రోత్సహించాలి జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా



(నిర్మల్ ప్రతినిధి, సాక్షర) “జిల్లాలో వ్యవసాయ రంగాన్ని మరింత అభివృద్ధి చేస్తూ, తక్కువ నీటి వినియోగంతో అధిక దిగుబడులు సాధించేలా రైతులకు సూక్ష్మ సేద్య పద్ధతులపై విస్తృత అవగాహన కల్పించాలని, పంట మార్పిడి విధానాన్ని ప్రోత్సహించడంతో పాటు, ఉద్యాన పంటల సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, ప్రభుత్వ రాయితీలు రైతులకు అందేలా చూడాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అన్నారు.”నిర్మల్, జిల్లాలో వ్యవసాయ రంగాన్ని మరింత అభివృద్ధి చేస్తూ, తక్కువ నీటి వినియోగంతో అధిక దిగుబడులు సాధించేలా రైతులకు సూక్ష్మ సేద్య పద్ధతులపై విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు. పంట మార్పిడి విధానాన్ని ప్రోత్సహించడంతో పాటు, ఉద్యాన పంటల సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు.శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు హైదరాబాద్ నుంచి వివిధ శాఖల ఉన్నతాధికారులతో కలిసి జిల్లా కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వ్యవసాయం, విద్య, వీబీ-గ్రామ్‌జి, భూసేకరణ తదితర అంశాలపై సమీక్షించారు.ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రైతులు పంట మార్పిడి విధానాన్ని అనుసరించేలా ప్రోత్సహించాలని, తక్కువ నీటితో సాగు చేసుకునే పంటలకు ప్రాధాన్యత కల్పించాలని సూచించారు. సూక్ష్మ సేద్య పద్ధతులపై అవగాహన కల్పించి, ప్రభుత్వ రాయితీలు, ప్రోత్సాహకాలు రైతులకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ముందుగానే సిద్ధం చేయడంతో పాటు రైతుల వివరాల నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని, కొనుగోళ్లను కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. సన్నధాన్యం సాగు చేసిన రైతులకు క్వింటాలుకు రూ.500 బోనస్ అందేలా చూడాలన్నారు.ప్రభుత్వ విద్యాసంస్థల్లో ముఖ గుర్తింపు ఆధారిత హాజరు విధానాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును ప్రతిరోజూ పర్యవేక్షించాలని సూచించారు. సమగ్ర శిక్షా అభియాన్, పీఎం శ్రీ పథకాల నిధులను పూర్తిస్థాయిలో వినియోగించాలని, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలలు, తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆదేశించారు.వీధి కుక్కల నియంత్రణకు సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం చర్యలు తీసుకోవాలని, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో వాటిని గుర్తించి నిబంధనల ప్రకారం పునరావాస కేంద్రాలకు తరలించాలని తెలిపారు. ప్రాజెక్టులు, రహదారుల నిర్మాణాలకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. వీబీ-గ్రామ్‌జి పథకం కింద నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యతనిస్తూ, ఉపాధి హామీ పథకం జాబ్ కార్డులు కలిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని సూచించారు.వీడియో సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా మాట్లాడుతూ జిల్లాలో ఉద్యాన పంటల సాగును విస్తృతంగా ప్రోత్సహించాలని, సూక్ష్మ సేద్య విధానాలపై రైతులకు అవగాహన కల్పించి ప్రభుత్వ రాయితీలు అందేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు వందశాతం ఉండేలా చర్యలు తీసుకోవాలని, పాఠశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. సమగ్ర శిక్షా అభియాన్, పీఎం శ్రీ పథకాల నిధులను సమర్థవంతంగా వినియోగించాలని, నీటి సంరక్షణ పనులను చేపట్టి భవిష్యత్తులో నీటి కొరత తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ వీడియో సమావేశంలో అదనపు కలెక్టర్లు వెంకట మాధవ రావు, రాథోడ్ రమేష్, జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, సీపీఓ గంగారెడ్డి, ఉద్యాన శాఖ అధికారి రమణ, ఈఈ ఆర్డబ్ల్యూఎస్ సందీప్, నీటిపారుదల శాఖ అధికారులు రాజేంద్రప్రసాద్, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బాలల హక్కులపై అవగాహన కల్పించడమే లక్ష్యం

- బాలల దినోత్సవం సందర్భంగా న్యాయ విజ్ఞాన



(ఆదిలాబాద్‌టౌన్, సాక్షర) ప్రతి బాలబాలికకు విద్య, ఆరోగ్యం, రక్షణ, సమాన అవకాశాలు కల్పించడం మనందరి బాధ్యత అని, బాల కార్మిక వ్యవస్థ, బాల్యవివాహాలు, వేధింపుల నుంచి పిల్లలను కాపాడే చట్టాలను ప్రతి విద్యార్థి తెలుసుకోవాలని, సమస్య వస్తే భయపడకుండా తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు చెప్పాలని డీఎల్ఎస్ఏ కార్యదర్శి బి.హుస్సేన్ అన్నారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు బాలల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించేందుకు కేజీబీవి మావాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా డీఎల్ఎస్ఏ కార్యదర్శి బి.హుస్సేన్ మాట్లాడుతూ ప్రతి బాలబాలికకు విద్య, ఆరోగ్యం, రక్షణ, సమాన అవకాశాలు కల్పించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. బాల కార్మిక వ్యవస్థ, బాల్యవివాహాలు, బాలలపై జరిగే వేధింపులు, లైంగిక దాడుల నుంచి పిల్లలను రక్షించేందుకు ఉన్న చట్టాల గురించి వివరించారు.పోక్సో చట్టం, బాల్యవివాహ నిషేధ చట్టం, బాలల హక్కులు, ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఏదైనా సమస్య ఎదురైనప్పుడు భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు.బాలలే దేశ భవిష్యత్తు అని, వారి హక్కులను కాపాడుతూ మంచి పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రమశిక్షణ, నైతిక విలువలు అలవర్చుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ అరుగుల అశోక్, చంద్రకాంత్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఉమేష్ రావు డోలే, ఉపాధ్యాయులు, విద్యార్థులు, న్యాయవాదులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## బెడ్ షెడ్ కాంట్రాక్ట్ రద్దు చేసి ఫిక్స్‌డ్ వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

- డిసెంబర్ 7న సమ్మె : ఎస్పీఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు సుంకరి నరేష్



(మంచిర్యాల, సాక్షర) “బెడ్ షెడ్ కాంట్రాక్ట్ రద్దు చేయాలని, ఫిక్స్‌డ్ వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ప్రమాద బీమా రూ.10 లక్షలు ఇవ్వాలని, మహిళలకు ప్రసూతి సమయంలో ఆరు నెలల లీవ్ ఇవ్వాలని, రాష్ట్ర పిలుపు మేరకు డిసెంబర్ 7న సమ్మె చేస్తామని ఎస్పీఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు సుంకరి నరేష్ అన్నారు.ఎస్పీఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు సుంకరి నరేష్ ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా గవర్నమెంట్ హాస్పిటల్ లక్షపేటలో కమిటీ వేయడం జరిగింది. ఇందులో భాగంగా రాష్ట్ర పిలుపు మేరకు డిసెంబర్ 7న సమ్మె చేస్తామని తెలియజేశారు.బెడ్ షెడ్ కాంట్రాక్ట్ రద్దు చేయాలని, ఫిక్స్‌డ్ వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ప్రమాద బీమా రూ.10 లక్షలు ఇవ్వాలని, మహిళలకు ప్రసూతి సమయంలో ఆరు నెలల లీవ్ ఇవ్వాలని కార్మికులకు తెలియజేశారు.ఈ సందర్భంగా కార్మికులకు కమిటీ వేశారు. గౌరవ అధ్యక్షుడు విక్రమ్, అధ్యక్షుడు పి.గట్టయ్య, ఉపాధ్యక్షుడు ఆర్.జ్యోతి, ప్రధాన కార్యదర్శి ఎం.సతీష్, కోశాధికారి బి.లక్ష్మి, సలహాదారులు ఎండి.హసీనా, ఎస్.శిరీష, కే.సునీత, జి.హరీష్, ఎండి.జాకీర్ లను ఎన్నుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో రాష్ట్ర సలహాదారుడు చిప్పకుర్తి కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి అగ్గు ప్రశాంత్, మాతా శిశు హాస్పిటల్ కోశాధికారి తోకల రాకేష్, సలహాదారుడు అడెపు రాకేష్, కన్నాల శంకర్, బి.సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

# జయంత్ అండ్ ది జింగో పెన్' సినిమా నవంబర్ 14న విడుదల



నమో జయం ప్రొడక్షన్స్ బ్యానర్ మీద దివ్య ప్రవీణ్ బొలిశెట్టి నిర్మాణంలో జాతీయ అవార్డు గ్రహీత నవీన్ దేశబోయిన తెరకెక్కించిన చిత్రం 'జయంత్ అండ్ ది జింగో పెన్'. ఈ సినిమాలో మాస్టర్ జయంత్ బొలిశెట్టి, మన శంకర వర ప్రసాద్ ఫేమ్ ఊహా రెడ్డి, సత్యం రాజేష్, ఆశిష్ గాంధీ, మానస రాధాకృష్ణన్, తనికెళ్ల భరణి, కాశీ విశ్వనాథ్, మానిక్ రెడ్డి, అశోక్ కుమార్, శ్రీకాంత్ రెడ్డి, వెంకట్ రెడ్డి తదితరులు ముఖ్య పాత్రలను పోషించారు. బాలల దినోత్సవం సందర్భంగా ఈ మూవీని నవంబర్ 14న విడుదల చేయనున్నారు. ఈ క్రమంలో ట్యూన్స్ & లిరిసిస్ట్ ప్రవీణ్ బొలిశెట్టి మాట్లాడుతూ* .. ''జయంత్ అండ్ ది జింగో పెన్' చిత్రంలో నేను రాసిన పాటలకు మంచి స్పందన వచ్చింది. ఈ మూవీని బాలల దినోత్సవం సందర్భంగా నవంబర్ 14న రిలీజ్ చేస్తున్నాం. పిల్లలు, పేరెంట్స్, టీచర్స్ అందరూ కలిసి తండోపతండాలుగా థియేటర్లు బుక్ చేసుకుంటున్నారు. అన్ని వర్గాల ప్రేక్షకుల్ని ఆకట్టుకునేలా మా చిత్రం ఉంటుంది' అని అన్నారు. మాస్టర్ జయంత్ బొలిశెట్టి మాట్లాడుతూ* .. ''జయంత్ అండ్ ది జింగో పెన్' సినిమాని చిల్డ్రెన్స్ డే స్పెషల్‌గా రిలీజ్ చేస్తున్నాం. పిల్లల కోసం ఈ మూవీ టికెట్‌ని రూ. 250 నుంచి రూ. 150కి తగ్గించాం. పిల్లలకు, పెద్దలకు, టీచర్లకు మంచి సందేశం ఇచ్చేలా సినిమా ఉంటుంది. మా మూవీ అందరికీ కనెక్ట్ అవుతుంది' అని అన్నారు. నిర్మాత దివ్య ప్రవీణ్ బొలిశెట్టి మాట్లాడుతూ* .. ''జయంత్ అండ్ ది జింగో పెన్' సినిమాలోని ఎమోషన్స్ అందరికీ కనెక్ట్ అవుతాయి. పిల్లల కోసం టికెట్ రేట్లను తగ్గించాం. పిల్లలు, తల్లిదండ్రులు, టీచర్స్ అందరూ ఈ మూవీని చూడాలి. బాలల దినోత్సవం సందర్భంగా మా సినిమా రిలీజ్ అవుతోంది. పిల్లల మార్కులు కాదు మనసులు చూడండి' అని అన్నారు. సహ నిర్మాత షఫి మాట్లాడుతూ* .. ''జయంత్ అండ్ ది జింగో పెన్' చిత్రాన్ని బాలల దినోత్సవం సందర్భంగా రిలీజ్ చేస్తున్నాం. పిల్లలకు కానుకగా ఈ మూవీని విడుదల చేస్తున్నాం. అందుకే రూ. 250 ఉన్న టికెట్‌ని రూ. 150కే అందిస్తున్నాం. అన్ని చోట్లా హౌస్ ఫుల్స్ అవుతున్నాయి. ఈ క్రమంలో వేరే వాళ్లు కూడా చిల్డ్రెన్స్ డే స్పెషల్ అని సినిమాని ప్రమోట్ చేసుకుంటున్నారు. మేం మాత్రం ముందు నుంచే పిల్లల కోసం ఈ మూవీని తీశాం. అందరూ మా సినిమాని నవంబర్ 14న చూసి ఆదరించాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. దర్శకుడు నవీన్ దేశబోయిన మాట్లాడుతూ* .. ''జయంత్ అండ్ ది జింగో పెన్' చిత్రాన్ని బాలల దినోత్సవం సందర్భంగా నవంబర్ 14న రిలీజ్ చేస్తున్నాం. ఈ మూవీని వ్యాపారంగా చూడటం లేదు. అందుకే టికెట్ రేట్లను రూ. 150కి తగ్గించాం. పిల్లలు, పేరెంట్స్, టీచర్స్ అందరూ ఈ సినిమాని చూడాలి. ఇప్పటికే చాలా స్కూల్స్ థియేటర్లను బుక్ చేసుకున్నాయి. ఈ రోజు కావాలనే ఓ సినిమాని చిల్డ్రెన్స్ డే స్పెషల్ అంటూ ప్రమోట్ చేసుకుంటున్నారు. ఆ విషయంలో మీరు పొరబాటు పడకండి. మా 'జయంత్ అండ్ ది జింగో పెన్' సినిమా నవంబర్ 14న రాబోతోంది. అందరూ తప్పకుండా చూడండి' అని అన్నారు.

# రియాలిటీ' సినిమాని థియేటర్లలో హ్యాపీగా ఎంజాయ్ చేస్తారు : హీరో, డైరెక్టర్ కిరణ్ అబ్బవరం



వరుస బ్లాక్‌బస్టర్స్‌తో అలరిస్తున్న యంగ్ హీరో కిరణ్ అబ్బవరం తన ప్రతిష్టాత్మక చిత్రం 'రియాలిటీ'తో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ఈ సినిమా కోసం కిరణ్ అబ్బవరం నటుడిగానే కాకుండా రచయితగా, దర్శకుడిగా కూడా బాధ్యతలు చేపట్టారు. ప్రతి విషయంలోనూ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ, అన్ని వయసుల ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఒక మంచి ఎంటర్‌టైనర్‌ను తీర్చిదిద్దుతున్నారు. ఆయన కెరీర్‌లోనే భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని జాయ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై సుధాకర్ చాగంటి నిర్మిస్తున్నారు. సురేష్ యెర్రా సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్ ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని పెంచింది. గ్లింప్స్‌కు ఫీల్ గుడ్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో మంచి స్పందన రాగా, ఫస్ట్ సింగిల్ భజ గోవిందం చార్ట్‌బస్టర్‌గా నిలిచింది. జీవితంలో చిన్న చిన్న విషయాల్లోనే ఆనందాన్ని వెతుక్కోవాలనే అందమైన భావనతో రూపొందిన ఈ పాట శ్రోతలకు వెంటనే కనెక్ట్ అయి వైరల్‌గా మారింది. ఇప్పుడు మ్యూజికల్ ఎక్స్‌పీరియన్స్‌ను మరోస్థాయికి తీసుకెళ్తూ మేకర్స్ రెండో సింగిల్ 'రుత్తూ'ను విడుదల చేశారు. ఈ పాట 'రియాలిటీ'లోని రొమాంటిక్ కోణాన్ని అందంగా ఆవిష్కరిస్తుంది. వినసొంపైన మెలోడీగా, మనసుకు హాయినిచ్చేలా ఈ పాట సాగుతుంది. భీమ్స్ సిసిరోలియో అందించిన సంగీతం కొత్త అనుభూతిని ఇస్తుంది. అద్భుతమైన ఇన్‌స్ట్రుమెంటేషన్ పాటకు మరింత అందాన్ని తీసుకొచ్చింది. పూర్ణాచారి రాసిన సాహిత్యం కవితాత్మకంగా సాగుతూ, తన ప్రేయసిపై హీరోకు ఉన్న ప్రేమను, ఆమెతో ఉన్నప్పుడు కలిగే ఆనందాన్ని, ప్రతి క్షణం ఆమెతోనే గడపాలనే ఆరాటాన్ని అందంగా ఆవిష్కరించింది. ప్రేమలోని భావాలను వ్యక్తపరిచిన తీరు మరింత అందంగా చూపిస్తుంది. కపిల్ కపిలన్ బ్యూటీఫుల్ వోకల్స్ పాటకు మరింత ప్రాణం పోశారు. ఎం. షరీఫ్ చేసిన గ్రేస్‌ఫుల్ కొరియోగ్రఫీ ఆకట్టుకుంది. చాలా సింపుల్ మూవ్‌మెంట్స్ కూడా ఎంతో అందంగా కనిపించాయి. ముఖ్యంగా పాటలోని క్యాచీ హుక్ స్టెప్ సోషల్ మీడియా రీల్స్, షార్ట్స్‌లో ట్రెండ్ అయ్యేలా ఉంది. కిరణ్ అబ్బవరం తన పాత్రలో పూర్తిగా ఒదిగిపోయారు. పక్కింటి కుర్రాడిలా కనిపించే పాత్రలో తనదైన చార్మ్‌తో ఆకట్టుకున్నారు. దేవిక భట్ అందంగా కనిపిస్తూ, తన స్క్రీన్ ప్రెజెన్స్, క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్‌తో పాటకు మరింత మ్యాజిక్ తీసుకొచ్చారు. వీరిద్దరి కెమిస్ట్రీ ఈ పాటలో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. కిరణ్ తన ఆనందాన్ని వ్యక్తపరచడం, దేవికకు పానీపూరీ తినిపించడం వంటి చిన్న చిన్న మూమెంట్స్ కూడా ఎంతో ముచ్చటగా అనిపిస్తాయి. ప్రతి ఫ్రేమ్‌లోనూ ప్రేమకథలోని మ్యాజిక్ ప్రేక్షకులకు ఒక అందమైన అనుభూతిని అందిస్తుంది. మొత్తంగా 'రుత్తూ' విజువల్స్ పరంగా కూడా ఒక మంచి మ్యాజికల్ ట్రీట్. వెంటనే ఆకట్టుకునే మెలోడీ, క్యూట్ రొమాంటిక్ మూమెంట్స్‌తో ఈ పాట ఫస్ట్ సింగిల్‌లాగే మరోసారి వైరల్ కానుంది. 'రియాలిటీ' మ్యూజికల్ ప్రమోషన్స్ వరుసగా ఆకట్టుకుంటుండటం చూస్తుంటే, ఈ సినిమా ప్రతి విషయంలోనూ కిరణ్ అబ్బవరం ఎంత ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారో అర్థమవుతోంది. ఈ సినిమాలో శరత్ కుమార్, సాయి కుమార్, రోహిణి, అన్నపూర్ణమ్మ, సుదర్శన్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. విశ్వాస్ డేనియల్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, భీమ్స్ సిసిరోలియో సంగీతం సమకూరుస్తున్నారు. సుధీర్ మాచర్ల ప్రొడక్షన్ డిజైన్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సంతోష్ నాయుడు ఎడిటర్‌గా, రాజేష్ కామార్సు కాస్ట్యూమ్ డిజైనర్‌గా పనిచేస్తున్నారు. క్రిస్మస్ కానుకగా 'రియాలిటీ' చిత్రం డిసెంబర్ 25, 2026న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది. సాంగ్ లాంచ్ ఈవెంట్ లో హీరో, డైరెక్టర్ కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. . 'ఎస్ఆర్ కళ్యాణ మండపం' తర్వాత మరో మంచి కథ చెప్పాలని ఎప్పుడూ ఉండేది. కంటిన్యూగా నేను హీరోగా చేస్తున్న సినిమాలు అద్భుతంగా ఆడుతున్నాయి. మీరందరూ నన్ను అభిమానిస్తున్నారు. ఎక్కడికి వెళ్లినా సరే, నేను కోరుకున్న దానికంటే ఎక్కువ అభిమానం, ప్రేమ దొరుకుతున్నాయి. ముఖ్యంగా ఫ్యామిలీ ఆడియన్స్ నుంచి చాలా ప్రేమ, ఆదరణ లభించింది. అందుకే ఒక మంచి ఫ్యామిలీ కథ చేయాలనిపించింది. కుటుంబం అంతా కలిసి ఇలాంటి ఒక సినిమా చూస్తే బాగుంటుందనిపించి ఈ కథ రాశాను. ఇప్పటివరకు వచ్చిన కంటెంట్‌ను ఆడియన్స్ చాలా అద్భుతంగా ఆదరించారు.. అలాగే 'భజగోవిందం' పాట కూడా అందరికీ నచ్చింది. 'రుత్తు' పాట కూడా మీ అందరికీ నచ్చిందని అనుకుంటున్నాను. సినిమా కూడా మీ అందరికీ నచ్చాలని కోరుకుంటున్నాను.'భజగోవిందం' పాటను సనారే అద్భుతంగా రాశారు. ఆ పాట నచ్చితే 'రియాలిటీ' సినిమా కూడా మీకు నచ్చుతుందని అనుకుంటున్నాను. అలాగే పూర్ణాచారి ఈ రెండో పాటకు అద్భుతమైన లిరిక్స్ ఇచ్చారు. భీమ్స్ అన్న ప్రతి పాటను అద్భుతంగా చేశారు. మేము అడిగిన దానికంటే ఇంకా బాగా ఇచ్చారు. సినిమా చాలా అద్భుతంగా వచ్చింది. ఔట్‌పుట్ పరంగా, బిజినెస్ పరంగా మేము చాలా హ్యాపీగా ఉన్నాము. డిసెంబర్ 25న సినిమాను రిలీజ్ చేస్తున్నాము. మీ అందరికీ నచ్చాలని కోరుకుంటున్నాను. 'భజగోవిందం' పాటను ఇంత అద్భుతంగా ఆదరించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు. సినిమా చాలా అద్భుతంగా వచ్చింది. మీరంతా హ్యాపీగా థియేటర్లకు వెళ్లండి. కచ్చితంగా ఎంజాయ్ చేస్తారు. అందరికీ ధన్యవాదాలు. ప్రొడ్యూసర్ సుధాకర్ చాగంటి మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఇరవై ఏళ్ళుగా పరిశ్రమలో ఉన్నాము. సినిమా చేయాలని అనుకున్నప్పుడు మంచి కుటుంబ విలువలతో కూడిన కథ చేయాలని భావించాము. కిరణ్ గారు చెప్పిన కథ నాకు చాలా నచ్చింది. 53 రోజుల్లో షూటింగ్ పూర్తి చేశాము. చాలా అద్భుతమైన క్వాలిటీతో సినిమా వచ్చింది. ప్రతి డైలాగ్ చాలా బ్యూటిఫుల్‌గా ఉంటుంది. చాలా అద్భుతంగా రాశారు. నా తొలి సినిమాను కిరణ్ అబ్బవరం హీరో, ఆయన దర్శకత్వంలో చేయడం నాకు చాలా ఆనందంగా ఉంది. 'భజగోవిందం' పాట ప్రతి ఇంటికీ చేరువైంది. చాలామంది తమ స్టేటస్‌లో కూడా పెట్టుకుని అప్రిషియేట్ చేస్తున్నారు. చాలా విలువ ఉన్న కథ ఇది. ఆ కథకు తగ్గట్టుగానే ఆ పాటను చేశాము. భీమ్స్ అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు. ఇంకా మంచి పాటలు ఉన్నాయి. మంచి మంచి కమర్షియల్ సాంగ్స్ ఉన్నాయి. ఆల్బమ్ చాలా అద్భుతంగా ఉండబోతుంది. బిజినెస్ కూడా క్లోజ్ అయింది. డిసెంబర్ 25వ తేదీన సినిమాను చాలా గ్రాండ్‌గా రిలీజ్ చేస్తున్నాము. హీరోయిన్ దేవికా మాట్లాడుతూ.. ఇది నా తొలి సినిమా. నాకు చాలా ప్రత్యేకమైనది. బిగ్ స్క్రీన్ మీద నన్ను నేను చూసుకోవడం చాలా ఆనందంగా ఉంది. 'భజగోవిందం' పాట చాలా పెద్ద హిట్ అయింది. రెండో పాటకు కూడా మీ నుంచి అలాంటి ఆదరణ లభిస్తుందని కోరుకుంటున్నాను. ఇలాంటి మంచి సినిమాలో పని చేసే అవకాశం ఇచ్చిన మా దర్శక నిర్మాతలకు ధన్యవాదాలు. అందరూ మా సినిమాను థియేటర్లలో చూసి సపోర్ట్ చేస్తారని కోరుకుంటున్నాను. డీవోపీ విశ్వాస్ డానియల్ మాట్లాడుత.. ఇప్పటికే మీరు 'భజగోవిందం' పాట చూశారు. సినిమాలో కూడా అలాంటి మ్యాజిక్ ఉంటుంది. కిరణ్ అబ్బవరం గారు ఈ సినిమాలో ప్రతి క్యారెక్టర్‌ను అద్భుతంగా డిజైన్ చేశారు. ఇది మనందరం రిలేట్ చేసుకునే కథ. ఈ సినిమాలో ఆయనలోని రచయిత నాకు ఎంతగానో నచ్చారు. ఇలాంటి కథను అందరూ రాయలేరు. ఇలాంటి అద్భుతమైన కథను తీసుకొస్తున్న కిరణ్ గారికి ధన్యవాదాలు. లిరిక్ రైట పూర్ణాచారి మాట్లాడుతూ.. సనారే రాసిన 'భజగోవిందం' పాట చాలా పెద్ద హిట్ అయింది. రెండో పాట రాసే బాధ్యతను నాకు కిరణ్ అబ్బవరం గారు ఇచ్చారు. ప్రేమలో ఒక మ్యాజిక్‌ను క్రియేట్ చేసేలా ఈ పాటను రాయడం జరిగింది. 'రియాలిటీ' మన ఇంటి కథ, మనందరి కథ. తప్పకుండా మీ అందరికీ నచ్చుతుంది. లిరిక్ రైటర్ సనారే మాట్లాడుతూ.. ఇందులో 'భజగోవిందం' పాట రాశాను. ఆ పాట అందరికీ నచ్చడం చాలా ఆనందంగా ఉంది. నా జీవితంలో ఇదొక హై మూమెంట్. 'భజగోవిందం' పాట నాకు ఒక విజిటింగ్ కార్డులా మారింది. నాకు ఈ అవకాశం ఇచ్చిన హీరో కిరణ్ అన్నకి చాలా రుణపడి ఉంటాను. ఈ వేడుకలో సినిమా యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు. నటీనటులు: కిరణ్ అబ్బవరం, దేవిక భట్, శరత్ కుమార్, సాయి కుమార్, రోహిణి, అన్నపూర్ణమ్మ, సుదర్శన్ తదితరులు.

# ముక్కంటి సేవలో సినీ నటి శ్రీలీల



(శ్రీకాళహస్తి నవంబర్ 13, సాక్షర): శ్రీకాళహస్తీశ్వరాలయం కు సినీనటి శ్రీలీల కుటుంబ సభ్యులతో కలసి ఆలయం కు విచ్చేశారు.శుక్రవారం రాహుకాల సమయం రాహు కేతు కాల సర్ప దోష నివారణ పూజలు నిర్వహించుకున్నారు. వారికి దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు స్వాగతం పలికారు. తరువాత స్వామి అమ్మవార్ల ఆలయాల్లో అంతరాలయ దర్శనం ఏర్పాటు చేశారు. అనంతరం వేద పండితులచే ప్రత్యేక ఆశీర్వచనం స్వామి అమ్మవార్ల చిత్ర పటం తీర్థ ప్రసాదాలు ఆలయఅధికారులు అందజేశారు. ఆలయం వెలుపల శ్రీలీల ను చూసిన అభిమానులు చరవాణి లో ఫొటోలు, సెల్ఫీ లు దిగారు. ఆమె అందరి తో ఆప్యాయంగా పలకరించారు

# హైందవ' మూవీ నుంచి రొమాంటిక్ మెలోడీ 'ఎవరైనా' రిలీజ్



'కిష్కింధపురి' బ్లాక్‌బస్టర్ విజయంతో జోష్ లో ఉన్న యాక్షన్ హల్క్ బెల్లంకొండ సాయి శ్రీనివాస్ ఆకట్ట్ థ్రిల్లర్ 'హైందవ'తో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. నూతన దర్శకుడు లుధీర్ బైరెడ్డి దర్శకత్వంలో, మూన్‌షైన్ పిక్చర్స్ బ్యానర్‌పై మహేష్ చందు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సంయుక్త హీరోయిన్ గా నటిస్తున్నారు. ఇప్పటికే విడుదల టీజర్ సినిమాపై అంచనాలు పెంచింది. తాజాగా ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ 'ఎవరైనా' ను విడుదల చేశారు. ప్రేమ, భావోద్వేగాలను కలిపి రూపొందించిన ఈ పాట వినగానే ఆకట్టుకుంటుంది. సామ్ సీఎస్ అద్భుతమైన ట్యూన్ కంపోజ్ చేశారు. మెలోడీ ట్యూన్, చక్కటి లిరిక్స్‌తో పాట మొదటిసారి విన్నప్పుడే కనెక్ట్ అయ్యేలా ఉంది. కపిల్ కపిలన్, శ్వేతా మోహన్ తమ వాయిస్‌తో పాటకు మరింత అందాన్ని తీసుకొచ్చారు. కిట్టు విస్సాప్రగడ అందించిన సాహిత్యం పాటకు మరో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. . పాటలోని విజువల్స్ కూడా చాలా ఆహ్లాదకరంగా ఉన్నాయి. బెల్లంకొండ సాయి శ్రీనివాస్, సంయుక్త మధ్య కెమిస్ట్రీ ఆకట్టుకుంది. లీడ్ పెయిర్ మధ్య కనిపించే మ్యాజిక్, వారి స్క్రీన్ ప్రెజెన్స్ పాటను మరింత ఆకట్టుకునేలా చేశాయి. 'ఎవరైనా' పాట 'హైందవ' ఆల్బమ్‌పై అంచనాలు పెంచుతోంది. ఇప్పటికే టీజర్‌తో ఆసక్తి కలిగించిన ఈ సినిమా, ఇప్పుడీ మెలోడీతో అంచనాలు పెంచింది. ఈ చిత్రంలో మహేష్ మంజ్రేకర్, సౌరభ్ సచ్‌దేవా, జేడీ చక్రవర్తి, శివాజీ రాజా కీలక పాత్రలు పోషిస్తున్నారు. హరీష్ కన్నన్ డీవోపీగా పని చేస్తున్నారు, కార్తిక శ్రీనివాస్ ఆర్ ఎడిటర్, శివ కామేష్ డి ప్రొడక్షన్ డిజైనర్. 'హైందవ' నవంబర్ 27న గ్రాండ్ గా రిలీజ్ కానుంది. నటీనటులు: బెల్లంకొండ సాయి శ్రీనివాస్, సంయుక్త, మహేష్ మంజ్రేకర్, సౌరభ్ సచ్‌దేవా, జేడీ చక్రవర్తి, శివాజీ రాజా, గెటప్ శ్రీను.

Printed, Published, Edited and Owned by A. Linganna, Printed at EVR Printers, Vidyanagar, Adilabad - 504001. Telangana.
Published at D.No. 5-91/2, Talamadugu (Vill & Mandal) Adilabad - 504312. A.P. RNI No. APTEL/2011/42149. Editor A. Linganna.
Phone: 08732-231345. Email: Saaksharaadb@gmail.com